న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

7 మార్చి 1960

మూల్యం : రూపాయి

న వ భా ర తి కా ర్యా ల యం

గాంధీనగరం * విజయవాడ-2

విషయ సూచిక

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 | విజయవాడ * మార్చి 1960 | సంచిక 6

తారతమ్యములు

సృష్టికి, ప్రతిసృష్టికి తారతమ్యము కనిపించుచున్నది సృష్టి తనంతతానేర్పడినది. ప్రతిసృష్టి మానవునిచే నిర్మించబడియున్నది. సృష్టి ప్రతిసృష్టి ప్రకృతి ధర్మములే ఇవి యేర్పడుచున్నవి. నిర్మూలించబడుచున్నవి. ఇవి యెలా యెందుకు యేర్పడినది తెలియదు. ఎందుకు నిర్మూలించబడుచున్నది తెలియదు వీనినిగురించి తెలుసుకొనవలయునని పరిశీలన జరుపబడుచునేయున్నది. కాని ఇవి యెవరికిని తెలియకున్నవి. వాని గుణములను, స్వభావ స్వరూపములను వివేచించి ఇది యిది యని నిర్ధారణ చేసుకొని భావస్ఫూర్తికి కొన్ని గుర్తులుగా యేర్పరచుకొని అవి తెలియబడునవని యెప్పటికప్పుడు మన మనుకొనుచునే యుంటిమి. కాని అవి కాలక్రమమున మరియొక క్రొత్తరూపమును ధరించి మనమనములను విస్తుపోవునటుల చేయుచునే యున్నవి. ఇది కాలప్రభావమో, వస్తుప్రభావమో, గుణప్రభావమో, రూపప్రభావమో, స్వభావ చిత్రణాప్రభావమో ఏ ప్రభావమో తెలియదు కాని యీ యర్థమునకు మనమందరము ఆశ్చర్యపడుచునే యుంటిమి. మన యీ ఆశ్చర్యమునకు కాలప్రభావము కారణమని కొందరు చెప్పుచున్నారు కాదు కర్మప్రభావమని మరికొందరు చెప్పుచున్నారు శాస్త్రవిజ్ఞానముల ప్రభావమని యింకా కొందరు చెప్పుచున్నారు. ఈ అందరూ చెప్పునది మనమందరము వినుచున్నాము మనమందరము చదువుచున్నాము. కాని యెవరి నిర్ణయము వారిదే. ఇందుకు కారణము తెలియదు.

కార్యకారణ సంబంధములను విచారించుచున్నాము. వివేచనచేసి నిర్ధారణకు రావచ్చునని భావించుచున్నాము. కాని మూలకారణమేదియో తెలియరాకున్నది. ప్రకృతి యనగా నేమి ! సృష్టియనగా నేమి ? ప్రతిసృష్టి యనగా నేమి ? ఈ మొదలైన ప్రశ్నలు అన్ని కాలములలోను వచ్చినవే. వానికి సరియైన సమాధానము యెందువల్లనో చెప్పబడియుండలేదు.

ఈ జన్మకారణమైన సృష్టిలో మానవజన్మ ఉత్తమమైనదని మన మనుకొనచున్నాము మానవునిచే సృష్టించబడిన దానిలో యేది ఉత్తమమైనదో మనమూహింపలేకన్నాము. అసలు మానవజన్మ ఉత్తమమైనదా? కాదా? మానవునిచే సృష్టించబడినవానిలో యేది ఉత్తమమైనదో నిర్ణయించగలమా? లేమా? ఈ మొదలైన ప్రశ్నలకు సమాధానమెచ్చటనున్నది? మనము సమాధానము చెప్పి యీలోకమును సంతృప్తి పరచగలమా? ఈ లోకమనగనే ప్రాణికోటి అంతయూనని భావించుచుంటిమా? మనము సామాన్యధర్మములో లోకమనగనే మానవుల మనుకొనుచుంటిమి. మానవులు యీ ప్రాణికోటిలోని అనంతభావములోని ఒక సూక్ష్మశరీరధారులు మాత్రమేనని మనము గ్రహించవలయును మనము అలాగ్రహించలేక పోవుచున్నాము. ఎందువలన గ్రహించలేకపోవుచుంటిమో మన

మెరుగకయే యుంటిమి. ఈ మనకు తెలియని విషయములను గురించి తర్కించి, వివేకించి విషయపరిశీలన చేసి వింతవింత వాదములను నెలకొల్పి మనకు మనమే మనవాదము సమర్థనీయమని చెప్పుకొనుచుంటిమికదా! ఇది చిత్రముకాని విచిత్రముకాదా?

దైవభావమననేమి? దానవభావమననేమి? దైవదానవభావముల అంతర్యమేమి? ఈ దైవదానవభావముల సంబంధ బాంధవ్యములు మనకు తెలియునా? మనకు తెలియని వానినిగురించి తెలిసిన విధమున వాదించవచ్చునా? అన్నియూ పుట్టుచున్నవి. అన్నియూ గిట్టుచున్నవి. పుట్టుటకు కారణము తెలియదు. గిట్టుటకు కారణము తెలియదు. పుట్టుకకు, గిట్టుకకు మధ్యకాల మెంతయో అదియును మనకు తెలియదు. ఇవి అన్నియూ ఒక కాలములోని అంతర్భాగములేనని మనకు భావించగలశక్తి యున్నదా? మనమీ అనంతకాలములోని రూపధారణ చేసినవానిలో యెంతభాగమై ఉన్నాము? ఈ భాగవిభాగము చేయగల శక్తి మనకున్నదా? మనకున్నది వ్యవహార సంబంధమైన జ్ఞానముమాత్రమేనని తెలిసి ప్రవర్తించుచుంటిమా? మన వ్యవహారజ్ఞానము ఈ అనంతమైన కాలప్రభావములో అతి సామాన్యమైనది మాత్రమేనని మనము గ్రహించి మెలగుచుంటిమా? మనకు యే మెలకువ తెలియకనే మనమే అన్నిటికి కర్తలమని కర్తృత్వము వహించి నడిపించుచుంటిమని యనుటలో అహంకార మిమిడి యుండలేదా? మానవునిలో నున్న అహంకారము అతిసూక్ష్మాంశమై యున్నది. ఇది యంతయూ అహంకారమే. ఎచట అహంభావమున్నదో అచటనే సృష్టి ప్రతిసృష్టులను భావములు యున్నవి ఈ ప్రపంచమే అహంకారపూరితము. ఈ అహంకారము కొందరు వలదందురు. మరికొందరు అవసరమందురు మన సంప్రదాయములో అహంకారభావమును అలంకార ప్రియముచేసిరి. పార్వతీపరమేశ్వరులని, లక్ష్మీనారాయణులని, సరస్వతీ బ్రహ్మలని రూపాలంకరణచేసి సృష్టిఅంతయూ యీ విధమున ప్రవర్తించనగునని ఒక విధమైన రమణీయ ప్రతిపాదన సామాన్య ధర్మమునకు ప్రాతిపదికగాచేసిరి. సృష్టిధర్మము రమణీయమైనదని, ప్రతిసృష్టి ధర్మము ఆహ్లాదకరమైనదని, ఆనందప్రదమైనదని, బహువిధములైన చిత్రవిచిత్రములను కల్పించి మన మనోభావములను పరమ రమణీయముగా చేయుటకు ప్రయత్నించిరి. మనమా ప్రయత్నముల నన్నింటినీ గౌరవించుచున్నామా? మనమా ప్రయత్నములకు దోహదము చేయుచున్నామా? మనకు ప్రమాణభావ మున్నదా?

మన దైవభావము ఒక అనంతమైన సౌందర్యనిలయము. ఒక మనోహరమైన రమణీయ దృశ్యము. ఒక ఉన్నతమైన సౌందర్యభావములోని చిత్రకళారూపము. ఇదియే ప్రాచ్య సంప్రదాయము.

పాశ్చాత్యులకు దైవమనునది ఒక ఆదర్శము. ఆ ఆదర్శము మానవులకు రమణీయమైనదికాదు. అది ఒక ప్రతిపాదన ఈ ప్రతిపాదనా భావము అహంకార ప్రధానమైనది. ఈ అహంకారము ఆనందప్రదమైనదికాదు. మనోహరమైనదికాదు కళావిలసితమైనదికాదు. పరిమళప్రభావము కలదికాదు. ఈ వీరి దైవభావము మానవాతీతమైనది. సామాన్యమానవ జీవితమునకు పూర్తి విరుద్ధమైనది.

ప్రాచ్యదైవమునకు సంసారబంధము అనునవి యున్నవి. పాశ్చాత్య దైవమునకు సంసారబంధము అనునవిలేవు. ప్రాచ్యదైవము సృష్టికార్యము చేయును. పాశ్చాత్య దైవము సృష్టికార్యమునకు అతీతము. ప్రాచ్యదైవము శృంగారభావప్రేరణకు నిలయము. శృంగారభావమే శాపశ్యాలంకారములకు ప్రాతిపదిక యేర్పరచును. ఈ అలంకారమే రాగానురాగములకు మూలభావము. ఇదియే లోకధర్మము. ఇది పాశ్చాత్య దైవభావమునకు ప్రాచ్య దైవభావమునకు తారతమ్యము. ఇదియే పాశ్చాత్యప్రాచ్య జీవితవిధానములకు పరిపూర్ణమైన వ్యత్యాసము. ఈవ్యత్యాసముల విధానములే యీ ప్రపంచ భావములకు కారణములై యున్నవి.

మన మన విద్యలలో, విద్యావిధానములలో, మన మన కళాసంస్కృతులలో, వాటి వాటి ప్రభావములలో, మన మన జీవితవిధానములలో, వాటివాటి అనుభవ విధానములలో, మన మన మతములలో, మన మన మతవిశ్వాసములలో, మన మన బ్రతుకురీతులలో, మన మన బ్రతుకునిర్ణయములలో, మన మన తారతమ్యములు వ్యక్తము చేయబడుచున్నవి.

యోగదర్శనము

సాధన

లా

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

ధారణ

నాభిచక్రము హృదయపుండరీకము శిరోజ్యోతి నాసికాగ్రము జిహ్వాగ్రము ఈ మొదలయిన శరీరము చోటులందుగాని వెలుపటి చోటులందుగాని తగిన బాహ్యవిషయమునందుగాని చిత్తమును నెలకొలుపుట ధారణ (1) ఆధ్యాత్మిక దేశములం దనుభవముచేతను బాహ్యవిషయము నందు కన్ను చెవి మొదలగు ఇంద్రియముల చేతను చిత్తము కట్టుపడును. శబ్దాదులు బాహ్యవిషయములు. మూర్ధాద్యాదులు బాహ్యదేశములు.

చిత్తము దేనియందు కట్టువడునో అదియే మనకు తెలియును. దాని యెరుకయే మనకు ఉండును. అపు డితరేంద్రియములు తమతమ విషయములకు పరుగెత్తవు. ప్రత్యాహార మూలకమగు నిట్టి ధారణయే సమాధికి అంగము. చిత్తమొక విషయమున లయమగునేని ఇంద్రియములు అన్యవిషయములయెడ ఉపరతములగును. ధారణ లనేకవిధములు. ఏ ధారణయందేనియు ఈ రీతిగా ప్రత్యాహారము సంభవించును.

యోగదర్శనముకంటె వేరయిన యోగగ్రంథములందును పురాణములందును ఇతరములగు ఆధ్యాత్మిక గ్రంథములందును అనేక విధములగు ధారణలు చెప్పబడెను మిశ్రుడును భిక్షువును సదాశివేంద్ర సరస్వతియు తమతమ వ్యాఖ్యలందు పురాణములును కొన్ని యోగగ్రంథములును చెప్పిన ధ్యానధారణలను ఉదాహరించిరి వాని నందిం దెడనెడ నరయునది. ఇటుముందు వానిని కొలదిగా తడవి చూతము.

ధ్యానము

వృత్త్యంతరస్పర్శ లేక నాభిచక్రాదులందలి జ్ఞానవృత్తి తైలధారవలె ప్రవహించిన యెడల అది ధ్యానము. ధారణలో జ్ఞానవృత్తి అభీష్టప్రదేశమునందు బుడగల వలె బిందువులవలె ఖండరూపము. ఖండరూపమగు ఆ జ్ఞానవృత్తియే అభ్యాస బలమున అఖండధార అయినపుడు అది ధ్యానమని చెప్పబడును. ఇది పారిభాషకమగు ధ్యానము. ఇది నిశ్చలమగు ఒక చిత్తావస్థ దీనికి విషయము ధ్యేయదేశము. దీనికి ఇంకకొ విషయముతో సంబంధము లేదు. ఈ ధ్యానమును ధ్యేయమగు దేని

1 'ధారణాసన స్వకర్మణా తత్ సిద్ధిః' అను సాంఖ్య, సూత్రము నందలి (౩-౩౨) ధారణ వేరు.

యందేని ప్రయోగింపనగును. ముందు ధ్యానించుటకు శక్తి కలిగినయెడల ఆ శక్తిచే దేనినేని ధ్యానింపవచ్చును గదా.

స మా ధి

ధ్యానమే గట్టిపడినయెడల అది సమాధి. సాధకున కపుడు ధ్యేయము మాత్రము గోచరించును. అత డపుడు తన్ను మరచును. మరియు 'నే నెఱుగుచున్నాను లేక నేను చూచుచున్నాను' అను ఈ రీతి 'గ్రహణా'ది బోధ లేని చందముగా ఎపు డగునో అపుడా ధ్యానము సమాధి. మరియు గ్రహీత లేక నేను, గ్రహణము లేక ధ్యానించుచుంటిని అను ఎరుక మరుగై యెపుడు ధ్యానము ధ్యేయ విషయమాత్రమునందే సమాపన్నమగునో ఆ ధ్యానము సమాధి. ధారణాస్థిరత ఒదవినచో ధ్యానము ధ్యానము గభీరమగుచో సమాధి. ధ్యాత ధ్యానము ధ్యేయము ఈ మూడును ధ్యానమున నుండును. తద్రహితము సమాధి. ధ్యాన, ధ్యాతలును లేక క్రియయు జ్ఞాతయు లేనిది సమాధి. సమాధిపద మిచట పారిభాషికము ధ్యేయ విషయమునందు గడ్డకట్టిన చిత్తస్థిరత అని దీని అర్థము. ఏదే నొకానొక విషయమునందు చిత్తము నెలకొనునెడల దానికంటె వేరు వృత్తి నిరుద్ధమగును. ఇదియే సమాధి సామాన్యలక్షణము. మిగుల మన్నన చేయదగినవారివంటి విషయములతో ఇంద్రియములకు సంబంధము కలిగిన యెడల ధ్యానము చెడిపోవచ్చును. సమాధి చెడదు.

ద్రోణుడు అస్త్రవిద్యా కౌశల మెరుగుటకు చెట్టు కొమ్మచివర నొక చిన్నపిట్టను(భాసము) కట్టించెను దానిని ధర్మరాజాదులకు చూపి 'గురిపెట్టుకొని యుండుడు, నేను కొట్టుమనినపుడు కొట్టునది' అని ఉపోద్ఘాతము చెప్పి ముందు ధర్మజుని బిలిచి - 'పిట్టతల ఇమ్మగా జూచితివా?' అని అడిగెను. అతడు చూచితిని' అని అనెను. ద్రోణుడు 'మ్రానిని నన్నును నీవారిని చూచితివా?' అని అడిగెను 'ఆ' అని అత డనెను. పిదప అత డందర నట్లేయడిగెను.అందరు నటులే యనిరి. అంత నత డర్జును నటులే యడుగగా అత డిటు లనెను - 'నాకు పిట్టతల తక్క నొందేదియు కనబడదు' అని చెప్పెను. (2)

సమాధి యనగా ఇది. ఇది బాహ్యవిషయము.

ఇట్టి సమాధిరూపమగు చిత్తస్థైర్యము బడసి గ్రహీతృ గ్రహణ గ్రాహ్య విషయముల సంప్రజ్ఞానమును సంపాదింపవలయును. ఇటులు సంపాదించిన యెడల సంప్రజ్ఞాతసమాధి ఒదవును.

ఈ ఘట్టమున 'ధ్యాత లేనిది సమాధి' అని చెప్పినచో అస్మిసమాధి లేకపోవలయును అని శంక పొడమును అస్మిసమాధికి ముందు - నేను ఎరుగుచున్నాను, నేను ఎరుగుచున్నాను'

---

2 అత్యంతాభ్యర్హితాది విషయమై రింద్రియ సన్నికర్షేధ్యానస్య భంగో భవతి న తు సమాధేః. తథా చ స్మర్యతే.

త దైవ మాత్మ న్యవరుద్ధ చిత్తో
న వేద కించిద్ బహిరంతరం వా
యథేషుకారో నృపతిం వ్రజంత
మిషౌ గతాత్మా న దదర్శ పార్శ్వే.

[యోగసార సంగ్రహ- 2 అంశ]

అనునది ఖండవృత్తి రూపమగు ధారణ. అది అఖండవృత్తి యయినపుడు 'ఎరుగుచున్నాను' అను జ్ఞానప్రవాహము అగును. ఈ యెరుకలో అస్మిత్వము కలిసియుండును. అది ధ్యానము. ఈ ధ్యానము ఉత్కర్షచెందుడు సమాధియై. నేను నన్ను ఎరిగితిని' అని పిదప దెలుపవలసియుండును, 'నేనును' గురుతు అను అద్దములో చూచునంతసేపును స్వరూపములేని చందమగు (3) ప్రత్యయధార ఉండదు ఇంచుకయు ప్రయత్నింపకయే 'నేనెరుగుచున్నాను' అను గురుతు (స్మృతి) స్వాభావిక మౌనేని అది స్వరూపశూన్యము కాకున్నను స్వరూపశూన్యమయిన చందముగా కమ్మచ్చున దీసిన తీగవలె సాగి, 'నేను' ఎరుగుచున్నానను ఎరుకలో అడగి సమాధి యగును.

సంయమము

ధారణయు ధ్యానమును సమాధియు ఒక విషయమునకే సాధనము లగు నెడల ఆమూటికి వెరసి, సంయమ మని పేరు. ధారణాధ్యాన సమాధులను సాధనములు ఏకవిషయకము లగునెడల ఆ మూటికిని కలిపి యోగదర్శనమున సంయను మని పరిభాష.

ధారణ చేసినయెడల ఆ యనుభవము ఖండరూపముగా ఆరంభమై ధ్యానముచే ఆ యనుభవమే అఖండమై సమాధిచే ఆ యనుభవమే పరమోత్కర్ష పొందునెడలను ఆ మూటిని ఏదేనొక ధ్యేయవిషయమును సాక్షాత్కరించుకొనుటకు ఉపయోగింపవచ్చును. కొన్ని కొన్ని ధ్యేయ విషయములు బహుముఖములుగా నుండును వాని సాక్షాత్కారమునకు ఏకదేశమునగాక సర్వతోముఖముగా పలుమారులు ధారణాదిత్రయమును ఉపయోగింపవలయును. ఇట్టి సంయమముచే జ్ఞానశక్తికి పరమస్థైర్యము కలుగుటయకాక ధ్యేయమునందు ఇమ్మగా నెలకొన గలుగుటచే ప్రజ్ఞ దీప్తమగును.

యోగముచే అసాధారణములగు శక్తులును జ్ఞానమును కలుగును. విభూతిపాదమునందు అతీతానాగత జ్ఞానము పరచిత్తసంవేదనము అంతర్ధానముతోపాటు శబ్దాద్యంతర్ధానము మొదలగు విభూతులు నమ్మటకును శక్యము కానివి ఎన్నియెన్నియో చెప్పబడెను. ఇవి యెల్ల సంయమముచే సిద్ధించు నను దార్శనికమగు వివరణము ఈవిభూతి పాదమునందు కలదు.

లోకమున కొందరు కొంచెపాటిగాగాని నిండుగాగాని పరచిత్తము చదువగలవారిని అంతర్హితులు కాగలవారిని కొలది గొప్ప అతీతానాగతముల నెరుగువారిని, మరికొన్ని యిట్టిశక్తులు కలవారిని వినియుందురు. కొందరు కనియు నుందురు. ఇట్టి శక్తికి ఏదో కారణము తప్పక ఉండవలయును. ఈ శక్తులు కలవారిని 'మీ కీ శక్తు లెటులు కలిగినవ'ని యడుగునెడల కొందరు వానికి కారణము చెప్పగలుగవచ్చును, కొందరు చెప్పజాలకయు పోవచ్చును. పదునెనిమిదవ శతాబ్ది మొదటిపాదములో ఉద్భవించిన సదాశివేంద్రసరస్వతి యీ విభూతులకు తన యోగసుధాకరమను వృత్తిలో ఉపపత్తుల జూపుటయకాక తాను కొన్ని యోగవిభూతులకు ఉదాహరణమాయెను ఇట్టివారి నింకను పేర్కొనవచ్చును. అది యటుండె.

ఈశ్వరుడు శక్తిత్రయము కలవాడు. జ్ఞానేచ్ఛా శక్తిమయమగు చిత్తము ఎట్టిదో అరయునెడల ఈశ్వరస్వరూపజ్ఞానము కలుగును. పురుషు లందరకును చిత్తము ఇచ్ఛయు ఒక మాదిరివే చిత్తమునందు మకిల ఉండువాడు అనీశ్వరుడు. ఆ మకిల సమాధిచే నశించునెడల విభూతులతోపాటు జ్ఞానమును కలుగును అది యీశ్వరతుల్యావస్థ.

3. 'తదే వార్థమాత్ర నిర్భాసం స్వరూపశూన్య మివ సమాధిః' (యో ద 3-3)

సంకల్పముచే యోగులు అసాధారణశక్తులు చూపగలరను ఇప్పట్టున ఒక ఎచ్చరిక చేయవలసియుండును. పరచిత్తము చెప్పుటయు కొన్ని కొన్ని వస్తువుల తెప్పించుటయు మొదలగువానిలో కొంతగాని యింకొంతగాని శక్తి కలిగి చరిత్రహీనులైపోయిన వారి పాలబడి యిహమును పరమును పోగొట్టుకొనిన అమాయికులు కొంద రుండవచ్చును ఏవో కొన్ని అసాధారణ శక్తులను చూచినంతమాత్రమున ఆ శక్తి కలవానిని యోగియనిగాని జ్ఞానియనిగాని నిర్ణయింపరాదు. ఆ శక్తులకును కారణము లేకపోదు. జ్ఞానములేని శక్తియు ప్రపంచమున కలదని మరవరాదు. సరియగి యోగి యెన్నడును లోకవంచనముకాక లోకకల్యాణము చేయును.అహింస యమము నియమము - మొదలగు 'దైవీ సంపద'తో నిండియుండును. కపటయోగియో లోకవంచనము చేయుచు ధన మార్జించును ఈదెస యోగమననేమియో నెరిగి యీయెడ విపర్యయము పొందకుండ గలుగనిచో యోగులకును యోగ్యాభాసులకును ఐక్యమే చేసినటు లగును.

ధారణా విశేషములు

ప్రాణాయామము నందును ధారణ ఆవశ్యకము ప్రాణాయామమునకు ఫలము చిత్తస్థైర్యము (4) స్థైర్యమనిన ధారణ, అనగా తలచినచోట చిత్తమును కట్టివేయుట. ప్రాణమును ఆయమించునంతవట్టును, ఆధ్యాత్మిక దేశానుభూతి ఉండవలెను ప్రాణాయామము చేయజేయ అట్టి అనుభవయోగ్యత కలుగును. ఇది సమాధ్యంగమగు ధారణ కాదు.

ధ్యానముగూడ ధారణావిశేషమేకాని అది ఒక భావన. ఈ భావనయే ఘనీభవించి ధారణయు ధ్యానమును కాగలదు. కావున నిదియు ముఖ్యధారణ కాదు.

ధారణను తత్త్వధారణ యనియు విషయధారణ యనియు విభజింతము. అందు తత్త్వధారణలు గ్రహీతృ గ్రహణ గ్రాహ్యాభేదముచే మూడు విధములు. ఇవి సాంఖ్యశాస్త్ర- తత్త్వధారణలు. గ్రహీతృ పురుషధారణ (అస్మి) గ్రహీతృధారణ. చిత్తేంద్రియధారణ గ్రహణధారణ. విషయధారణ గ్రాహ్యాధారణ వీనియందును వేరువేరు ధారణలందువలెనే ఇంద్రియాదుల కాధ్యాత్మిక దేశములతో సంబంధమున్నను వీనికి తత్త్వజ్ఞానమే ముఖ్యాలంబనము.

విషయధారణలలో జ్యోతిర్ధారణలును నాదధారణలును లేక శబ్దధారణలును ముఖ్యములు. జ్యోతిరారణలలో బుద్ధి తత్త్వ ధారణ దొడ్డది. దీనికి హార్దజ్యోతి ఆలంబనము. యోగదర్శనము దీనిని విశోకయనియు జ్యోతిష్మతి యనియు చెప్పును. హృదయపుండరీకమున ధ్యానించునెడల 'జ్యోతిష్మతీ'- ప్రవృత్తి యనబడునట్టియు సుఖమయమగునట్టియు బుద్ధితత్త్వము సాక్షాత్కృత మగును. (5) మెదడు చిత్తము

4. 'ప్రచ్ఛర్దన విధారణాభ్యాం వా ప్రాణస్య' (యో. ద-౧-౩౪) చూ

5 అష్టదళ హృత్ పద్మమును రేచముచే పయికి తిప్పి దాని దుద్దున నున్న సుషుమ్నయందు సూర్య చంద్ర విద్యుద్విభానిభమగు చిత్త తత్త్వమును ధ్యానించునెడల ఆ చిత్తజ్యోతికి గోచరమగు ఎరుక జ్యోతిష్మతి అని అనుభూతమగుచో శోకములేని ప్రవృత్తి ఉదయించును. దాన మనస్సునకు స్థిరత కలుగును ఇద్ది ఏకాగ్రత అని సదాశివేంద్ర సరస్వతి

(విశోకా- సూత్ర- యోగసుధాకరము- చూ)

నకు సంబంధించిన అంతరాత్మ స్థానమయినటులు హృదయము దేహాభిమానమునకు మూల స్వరూపమగు ఆత్మస్థానము. మార్గధారణ జ్యోతిర్ధారణలలోనిదే జ్యోతీ రూపముగనే బ్రహ్మమార్గచింత. ఇదియే అర్చిరాదిమార్గము. దీనినే శివయోగ, పిండ బ్రహ్మాండమార్గములుగా తాంత్రికులు వివరించిరి.

దహరోపాసనమును సుషుమ్నాధారణయు శ్రౌతములు. ఈ రెంటను హృదయము, హృదయమునుండి పైకి బోవు సుషుమ్నాజ్యోతియు ధారణకు ఆస్పదము. షట్చక్ర ద్వాదశ చక్రధారణలు. తంత్ర శాస్త్రోపదిష్టములు. షట్చక్రముల కిపుడు మాష చక్రములంత ప్రచారము.

పిండ బ్రహ్మాండమార్గమే షట్చక్ర మార్గము సుషుమ్నలో షట్చక్రములు తంత్రములు చెప్పు పెక్కు ధారణలతో మెలిగొనిన సుషుమ్న [సు+సు+మన్] హృదయమునుండి తలలోనికి బోవు నొకానొక నాడియని కఠశ్రుతి (6) ఇడా పింగళా సుషుమ్నలకు వేరువేరు తంత్రములు వేరువేరు స్థానములను (7) చెప్పును. శరీరమును కోసి చూచుట కివి కనబడునవి కావు. కావున ఇవి అప్రామాణికములని అందమా, అటు లనజెల్లదు. వీనికి నామసంబంధముతో దేవతల కడనుండి మానవుల కడకును వచ్చిన ప్రసిద్ధి కలదు కావున మూలాధారము నుండి సహస్రారము వరకు ప్రసరించుచు బోధ చేష్టలు కలిగించు నాడులను ఇడా పింగళా సుషుమ్నలనుగా గ్రహించుటతక్క వేరు దారిలేదు. కుండలినిని పరికించునెడల నిది స్పష్టమగును.

'సుషుమ్నలో చిత్రిణి యను నాడి యున్నది, దాని వివరములో కుండలిని ఆడుచుండును, అది మధురముగా మ్రోయుటయకాక ఊర్పునిట్టూర్పు లొదవించి ప్రపంచముచే జీవము తాల్పజేయును, అది మూలాధార పద్మకుహరమున తోచును (8) 'విశ్వాతీతయు జ్ఞానరూపయు ఊర్ధ్వగామినియు నగు కుండలినిని

---

6 శతం చైకా హృదయస్య నాడ్య
స్తాసాం మూర్ధాన మభినిస్సృతైకా
తయోర్ధ్వమాయ న్నమృతత్వ మేతి
విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవన్తి- (౨-౩ ౧౬)

7 'మేరో ర్బాహ్యప్రదేశే శశిమిహిరసిరే సవ్య దక్షే నిషణ్ణే'అని షట్చక్ర నిరూపణము- వెన్నెముకకు వలపలదాపల ఇడాపింగళ లున్నవని చెప్పెను. 'మేరోర్మధ్య పృష్ఠగతా స్తిస్రోనాడ్యః ప్రకీర్తితాః' అని నిగమతంత్ర సారము వెన్నుకలోనే ఇడాపింగళలు ఉన్నవని చెప్పును త్రిపురాసార సముచ్చయము-
'మేరోర్వామే స్థితా నాడీ, ఇడా చంద్రామృతాశివే
దక్షిణే సూర్యసంయుక్తా పింగళా నామ నామతః
తద్బాహ్యే తు తయోర్మధ్యే సుషుమ్నా వహ్నిసంయుతా'
అని తంత్రాంతరము వెన్నెముకకు వెలుపటనే ఇడాపింగళా సుషుమ్నలనియు ఇడాపింగళలు సుషుమ్నకు దాపలవలపటల ఉన్నవని చెప్పును

8 కూజన్తీ కులకుండలీ చ మధురం మత్తాలిమాలాస్ఫుటం
వాచం కోమల కావ్యబంధ రచనాభేదాతి భేదక్రమైః
శ్వాసోచ్ఛ్వాస విభంజనేన జగతాం జీవో యయా ధార్యతే
సా మూలాంబుజ గహ్వరే విలసతి ప్రోద్దామ దీపావళిః (షట్చక్ర- ౧౧)

ధ్యానించునది' (9) శూన్యరూపుడును బిందువు నగు శివుడే పరమకుండలి (10) త్రిగుణాన్వితము కుండలీశక్తిరూపము నగు వృత్తమే (బిందువు) శూన్యము మరి శివశక్త్యాత్మకము. (11) అని తంత్రములు చెప్పును. దీనినిబట్టి 'బోధచేష్టలను కలుగజేయు శక్తియే కుండలిని' అని తెల్లము. ఈ శక్తి గుహ్యమునుండి మస్తిష్కము వరకు ప్రసరించు నాడులలో నున్నది. ఈ నాడులు మేరువునడుమను మేరువునకు ఇరువంకలను ఉన్నవి. వీనిలోపల నున్న బోధ చేష్టా రూపశక్తియే కుండలిని. శరీరమునకు సంబంధించిన పనులు చేయించుచుండుట దీని సాధారణవ్యాపారము. కాని దీనిని మస్తిష్కములోనికి నడిపించుట అసాధారణ వ్యాపారము. ధారణచేతను ప్రాణాయామాదుల చేతను ఇది మస్తిష్కమును మెట్టును. హఠయోగాది యోగచతుష్టయముదీని కుపాయము. దేవదేవీ విద్యుదాది వర్ణములందును నాదమునందును ధారణ యిందుల కొక ఉపాయము. మూలబంధాదులచే పేశీ ధాతు సంకోచన మొనరించునెడల కుండలిని మేలుకనునని హఠయోగము ఉపదేశించును.

లయయోగము ముఖ్యముగా నాదధారణ. ఆహతానాహత భేదముచే నాదము ద్వివిధము. ఈ రెండు నాదములును కుండలినీశక్తిచే పొడమును. ఆహత నాదము వాక్యరూపము. ఇది పరా పశ్యన్తీ మధ్యమావైఖరీ భేదముచే నలుదెరగులు. పలుకునపుడును ఊర్పునిట్టూర్పులయందును మూలాధారము ముడుచుకొనును. ఇది అతి సూక్ష్మక్రియ. కాన ఈ పరావస్థ శబ్దోచ్చారణ మూలక్రియ. ఈ మూలక్రియ పిమ్మట స్వాధిష్ఠానమునం దుదరసంకోచము కలుగును. ఇది పశ్యన్తీక్రియ, పిదప అనాహతమున లేక వక్షమున పుప్ఫుససంకోచ క్రియ కలుగును. ఇది మధ్యమాక్రియ. తరువాత కంఠతాల్వాదులందు కలుగు క్రియాఫలము వైఖరి. ఇదియే వినబడు వాక్యము. ఇదియెల్ల కుండలిని పని. దీని కెంతయో గభీరమగు అర్థము కలదు. దాని వివరణము వేరుచోట. వాక్యముతో నిటులు కుండలినికి సంబంధము. దానజేసి హుమ్ అని కుండలినికి మేలుకొలుపు. దాన అనాహతనాదముప్పతిల్లును. వీపువెనుక క్రిందినుండి మీదికొక 'ధార' ఎగయుచుండునని సాధన సంకేతము నొడువును. ప్రయత్నవిశేషమున త దనుభవము. హుమ్ అనిగాని ఉమ్మని కాని ఓమ్మని గాని వేరుగగాని అది అనుభూతమగును

అనాహతనాద మొకటి చెవులలో విశేషించి కుడిచెవిలో వినబడును. కొండొకటి మేననెల్లెడ ఊర్ ధ్వధారగా అనుభూతమగును దీని దీర్ఘకాల మభ్యసించి కుండలినిని మస్తిష్కములోనికి నడపవలయును. అపుడది యచట బిందువుగా పరిణ

9. 'విశ్వాతీతాం జ్ఞానరూపాం చింతయే దూర్ధ్వకుండలీమ్'

10. 'కలా కుండలినీ సైవ నాదశక్తిః శివోదితా
శూన్యరూపః శివః సాక్షాద్ బిందుః పరమకుండలీ'

11. 'వృత్తః కుండలినీశక్తిర్ గుణత్రయ సమన్వితః
శూన్యభాగం మహేశాని! శివశక్త్యాత్మకం ప్రియే॥

మించును (12) అనగా నాద మతిసూక్ష్మమగును కేశాగ్రమును కోటిభాగములు చేయుచో వానిలో నొకభాగము (13) అనగా సూక్ష్మాతిసూక్ష్మమగు తేజోంశము. కాగా సూక్ష్మజ్ఞాన రూపాంశము బిందువు (14). 'నాదమునందు లగ్నమగు మనసు నిశ్చలమై వెలియెరుగక పాలబడిన నీరివలె దానితో చిదాకాశమున లయమగును' అనియును 'నాదము శక్తి, బిందువు శివుడు, మరి నాదబిందుతాద్రాప్తి శివశక్తి యోగము' అనియును తంత్రములు వాకొనును. ఇది యోగులు చెప్పు శబ్దతన్మాత్రయే.

తంత్రములలో శివునిపై పరశివుడొక డున్నాడు. పోలిక యుండుటవలన శబ్ద బ్రహ్మదివిషయ మిచట అసంగతము కాదు. సంగీతసందర్భమున గాయకులు శబ్దధారణను నాదోపాసనము అని యిటు లుపపాదింతురు. శబ్ద మనినను నాద మనినను వట్టి చప్పుడు కాదు. గాయకుడు పాడదొడగి రాగము నందలి స్వరములను స్ఫుటముచేసి ప్రస్తరించి సంచారము చేయుచు ఉదాత్తమగు మూర్ఛనలో ఒక ఊర్ధ్వ భూమిక కెక్కును. అపుడు శ్రోతయు గాతయు ఆనందములో మునుగుదురు. ఆ భూమికలోని వస్తువు నాదము. ఇది ఒంటబట్టిన గాయకుడు సప్తస్వరములచే మూడు మూర్ఛనలచే ద్వావింశ్రుతులచేగూడ నాదము ననుసంధానముచేయుచు మహానాదమును మేలుకొలిపి తదనుభవ మందును.

వైయాకరణులు శబ్దము బ్రహ్మమని యిటు లుపపాదింతురు శబ్దము అంతటను కలదు. అది పూర్ణము, నిత్యము. ఇటు లగుచో నిత్యము మనకు వినబడుచునే యుండవలయుగదా! అటులు వినబడదేమి? గాలి ఎల్లెడ గలదు వీవనచే విసరనిదే అది మన కనుభవముకాదు వెలుతు రెల్లెడ గలదు. గూటినుండి పొగగాని ధూళి అణువులుగాని దండాకారముగా కనిపించి నపుడు మనకు కిరణజ్ఞానము లేక వెలుతురువలన నిది కలుగుచున్నది కాన వెలుతురు లేక జ్యోతి ఎల్లెడ కలదను జ్ఞాన మొదవుచున్నది. రెండు చేతులు తట్టి నపుడు చప్పు డగుచున్నది. ఇటులే విభిన్నాకారములయిన దవుడలు దంతములు జిహ్వామూలము మొదలగు వాగ్యంత్రములు వాయుతరంగములను పుట్టించినపుడు కచటతప, శప మొదలగు శబ్దములు విననగును. లోగడనే అచట (నిత్యముగా) నున్న శబ్దము తాల్వాదిసాహ్యమున గుర్తింపదగిన రూపము తాల్చి మ్రోగు చున్నది మనకు ఉపకరణమగు కర్ణము దానిని మాత్రమే వినగలుగును వైయాకరణులీ ప్రక్రి యను స్ఫోటమని అందురు స్ఫోటమనగా బుడగ శబ్దసాగరమున కచటత పాదులు బుడగల వంటివి. ఈ శబ్దము నిత్యమనియు అనిత్యమనియు ద్వివిధము. కచటత పాదు లనిత్యములు, స్ఫోటములు. స్ఫోటము మహాస్ఫోటమునకు స్ఫోరరకము మహాస్ఫోటము నిత్యము కావున శబ్దము బ్రహ్మము ఈ బ్రహ్మము సాంఖ్యులు చెప్పు పురుషతత్త్వము.

ద్వాదశ చక్రధారణ శివయోగమార్గము. పిండ బ్రహ్మాండ మార్గమునందలి షట్చక్రములే కాక బ్రహ్మతాలు లేక రాజదంత- నిర్వాణ- అష్టదళపద్మ- సమష్టి కార్య లేక అహంకార- కారణ లేక మహత్తత్త్వ లేక అక్షర- నిష్కల లేక

12 'నాద ఏవ ఘనీభూతః క్వచి దభ్యేతి బిందుతామ్'

13 కోటి భాగైకరూపా కేశాగ్రస్యాతి సూక్ష్మా. ' షట్చక్ర- శ-

14 యత్ర కుత్రాఽపి వా నాదే లగతి ప్రథమం మనః
తత్ర తత్ర స్థిరీభూతా తేన సార్థం నిలీయతే
విస్మృతా సకలం బాహ్యం నాదే దుగ్ధాంబువ న్మనః
ఏకీభూతాఽథ సహసా చిదాకాశే విలీయతే

గ్రహీతృపురుష- చక్రములను శివయోగమార్గము చెప్పును. ఈ మార్గమున మొదట దేహమునందలి చక్రముల నతిక్రమించి పిదప వెలుపల కల్పితములగు చక్రములను అవస్థలను దాటి సత్యలోకాధిగతి ధారణ చేయవలయును. శ్రుతి నాడీరశ్మిసంబంధము చెప్పును. జ్యోతిర్మయమగు నా ధార నవలంబించి ఊర్ధ్వగతి ధారణ చేయవలయును

బౌద్ధులు పదిధారణలను జెప్పిరి. కబీర్ పంథీ లోని ఒక తెగవారిలో ధారణా చర్చ బహుళము. యోగదర్శనమునం దివి లేవు. ధారణ యేదేని దొడ్డదియే యని చెప్పుటకును తాము పట్టిన కుందేటికి మూడేకాళ్ళన్నటులు మేము చెప్పు ధారణయే దొడ్డదని అనకుండుటకును ఇవి ఇచట సంగ్రహింపబడెను. కేవల ధారణవల్లనే కైవల్యము ఉగ్రవడియముగా ఊడిపడదు. అభ్యాసముచేతను వైరాగ్యముచేతను ధారణయందు నిశ్చలత బడసి పిదప ధ్యానమును పిమ్మట సమాధిని బడయనిదే(15) యే మార్గమేని అపవర్గప్రదము కాదు.

ధ్యాన విశేషములు

ధ్యానమునం దేవిషయమేని ధ్యేయము కావచ్చును. ఈశ్వర ప్రణిధానమునందు ప్రణవజపము ప్రణవార్థభావనయు చేయుటకు ముందు ప్రప్రథమసాధకులు 'యోగారంభమున రూపముతోడి హరిని రూపములేని హరిని ధ్యానించునది' అను అనుశాసనమున(16) నామము జపించుచు రూపమును ధ్యానింతురు. ఇటులొనరించుటవల్ల చిత్తములో వేరొక వృత్తికి సందు ఉండదు. ఈరీతి చేయుచు చేయుచు మూర్త హరిధ్యానములో నామమును విడిచి ధ్యానమను మెట్టెక్కుదురు. అపుడు ప్రణవజపతదర్థ భావనలచే స్మృతి పరిశుద్ధిపొంది అమూర్త హరిధ్యాన మలవరిచికొందురు.

ప్రథమసాధకులు ప్రణవము త్రిమాత్రాకాలముతో పలుకుచు జపింతురు. ఇంతియకాక ఊర్పునిట్టూర్పులతో గలిపి ప్రణవము జపింతురు. పిదప బిదప ఊరుపుతో గలిపి ఓకారపూర్వకముగా ధ్యేయమును స్మరించి త్రిమాత్రాకాలము ఉచ్చరించుచు మకారాంతమగు ధ్యేయమునందు స్థిరత గొందురు. ఈరెండు ప్రయత్నములచేతను నామజపరూపధ్యానముచే బలె చిత్త మన్యాయత్తము కాక ఏకాగ్రమగును. కొంత కాలము తరువాత వాగింద్రియము నించుకయు కదల్పక జపింతురు. ఇది ఉత్తమమగు జపము.

---

15. 'నాఽవిరతో దుశ్చరితాత్ నాఽశాంతో నాఽసమాహితః
నాశాంతమానసో వాపి ప్రజ్ఞానేనైన మాప్నుయాత్. (కఠ- 1-2-23)

16. 'యోగారంభే మూర్తహరి మమూర్తమపి చింతయేత్

మాంత్రికు లుత్తమమగు జప మింకొకటి చెప్పిరి. అది అనాహతనాదము. అనాహతనాదమే మంత్రరూపముగా వినబట్టి నటులు సాధకులు ధ్యాన లయ మగుదురు. అట్టిచో దానిని మంత్ర చైతన్యమని యందురు.... 'మంత్ర చైతన్యము... ఎరుగనివారికి శతకోటి జపమునను సిద్ధికలుగదు'అని తంత్రము. (17)సోఽహం భావమే దొడ్డ యోనిముద్ర యని మంత్రయోగులు. కర్మయోగులు మున్ముందట ఈశ్వర ప్రణిధాన మొనరింతురు. ఆ ఈశ్వరుడు తనకు వేరయినవాడు. కాన అతనికి రూపాదులు కల్పించుకొని అతనియందు ధారణాధ్యానము లొనరింతురు.

ఇక ఈశ్వరుని ఆత్మగా ధారణచేయగోరువారు సోఽహం సోఽహమ్' అని చేయుదురు. తనలో ఈశ్వరు డున్నాడని ధీరులకు శాంతి'అని కఠము(18) సర్వభూత చిత్తవేది సర్వహృదయవాసియు నగు నీశ్వరుని సోఽహమస్మి' యని ధ్యానించునదనియు కలదు

రూపధ్యానమునం దధికారు లీశ్వర ప్రణిధానమును హృదయమున గావింతురు. చిత్తవృత్తి యుదయించు తావు హృదయము. కాని మెరుపోయన పుట్టి మెఱుపువలె వృత్తి మాయమగుటచే హృదయము పట్టుపడదు. సౌహార్దమేని ప్రేమయేని భక్తియేని కలిగినపుడు సుఖము కలుగును. భయమేని వగపేని దిగులేని చెందినపుడు సంభ్రమము కలుగును. అవి యెచట కలుగునో గమనించి కొన్నాళులకు హృదయమునుపసిగొందురు. ఎటులేని అనుభవముచే 'హృదయదేశమిది' యని నిశ్చయించుకొందురు.

హృదయము దైశికమగు అస్మితకు తావు. మెదడు చిత్తమునకు. ఇటులయ్యు చిత్తవృత్తిని కొలది నిమిషములు నిరోధించునెడల మెదడునుండి అస్మిత హృదయములోనికి జారుచున్నటులు తెలియును. నిదురనుండి లేచు తొట్టదొలుతటి క్షణమున సావధానత నొందినయెడల హృదయమునుండి మస్తిష్కమునకు బిరీనబోవు అస్మిత తెలియగలదు. ఈ దెస హృదయమునందు మినుకుమినుకుమను అస్మితను ధ్యానముచే పట్టుకొని ఏకాగ్రతతో మస్తిష్కములోని కెగబ్రాకిన యెడల అస్మితయుండు సూక్ష్మాతి సూక్ష్మప్రదేశము కనబడగలదు. అపుడు హృదయ మస్తిష్కములు ఏకమయినటులు తెలియును. ఇట్టి హృదయమధ్యమునం దీశ్వరుని రూప

17. మంత్రార్థం మంత్ర చైతన్యమ్ యో జానాతి న తత్త్వతః
శతకోటి జపేనాపి యోగ స్తస్య న సిద్ధ్యతి.

18. 'త మాత్మస్థం యేఽను పశ్యంతి ధీరా స్తేషాం ముక్తిః శాశ్వతీ నేతరేషామ్'

మును జ్యోతిర్మయమును కల్పించుకొని దివ్యమగు ఆ రూపములో క్షీరనీరన్యాయముగా కలిసిపోయి ప్రణవము జపించుచు ధ్యానింతురు. దహరమునందలి ఈశ్వర చిత్తములో తమ చిత్తమును ముంచివైచి సంకల్ప శూన్యముగా నుండు టభ్యసింతురు. ముండక మిటు లుపదేశించుచున్నది- 'ప్రణవము విల్లు, మనసు తూపు, బ్రహ్మము లక్ష్యము;పొరపడక వేధచేయునది,తూపునటులు తన్మయత చెందునది' (19) 'యంత్రము అనువింట మంత్రము అను తూపును తంత్రముచే ఎక్కిడి, అంత్రములోని గురిని వేధించునది' అను మంత్రయోగుల మాట పై యుపనిషత్తునకే మాఱు ప్రోఁత.

వ్యాసభాష్యమిటు లనును- జపము విడిచి యోగమును (ఏకాగ్రత) యోగము విడిచి జపమును చేయునెడల పరమాత్మ ప్రకాశించును. (20)

---

19. ప్రణవో ధను శ్శరో హ్యాత్మా
బ్రహ్మ త ల్లక్ష్య ముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం
శరవ త్తన్మయో భవేత్

20. యోగేన యోగో జ్ఞాతవ్యో
యోగో ద్యోగాత్ ప్రవర్తతే
యోఽప్రమ త్తస్తు యోగేన
స యోగే రమతే చిరమ్.'

(వ్యాసభాష్య - 3-6)

★

పంచవటి

శ్రీ కే. వేం. వ్యే. అప్పారావు

*

*

వర్షాకాలమునన్ జలాధికతచే వారాన్నిధిం బోల్చి ధృ
ర్ధర్షం బైన ప్రవాహవేగమునఁ గూల స్థాగముల్ గూల సా
మర్షాహి వ్రజతుల్యభంగముల సంరంభించు గోదావరిన్
హర్షం బొప్పఁగఁగాంచు జానకికి నిల్లయ్యెన్ నదీతీరమే.

ధేను వ్యాఘ్రయుగం బొకండు తటినీ తీవ్ర ప్రవాహస్థమై
మేనుల్మున్గుచుఁ దేలుచుండ శిరముల్మిట్టించుచున్ సాగుచున్
మ్రానొక్కండు నదీ ప్రవాహమునఁగూలన్ బట్టెనొక్కుమ్మడిన్
ప్రాణాపాయము దాపురించు తఱి వైరంబుల్ శమించున్గదా!

ధారావేగము నన్నదింబడి బృహత్తాళద్రుమం బొండు వే
పాఱన్ దానిని జుట్టెఁ బ్రాణభయ మేపారన్ మహాసర్పమొం
డా రెండున్ సుడిఁగ్రుంకి గిఱ్ఱుగిఱు మంచావర్త ముల్సల్పఁగా
క్షీరాంభోనిధి మంథనంపు స్మృతి రేకెత్తెన్ మహీజాహ్వదిన్.

వనగజ హస్తధూత తరుపాతిత పుష్పవిశోభి వేణియై
ఘనరస మిశ్రితోపచిత గైరిక ధాతు కృతాంగ చర్చయై
మునుకొసి మేరమీఱు రసపూర్ణత నిర్మలినాంత రంగయై
తన విభుఁజేరు ధూత దురితన్ సరితన్ గని మెచ్చె సీతయున్.

నీరము తీరముల్ దిగి వినిర్మలమై ప్రవహింప జ్యోత్స్నయున్
చీర ధరించి తెల్లు విరి చిర్నగవుల్ సవిలాసమంద సం
చారములొప్ప హంసగతి సాగెడు నుత్పల చారునేత్ర యా
శారద గౌతమీతటిని శారదయే యనిపించె సీతకున్.

*

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

తత్రావతరణం కార్యం నర్తక్యాః సర్వభాండకమ్
క్షేప ప్రతిక్షేపకృతం భాండోపోహనసంస్కృతమ్. ౨౮౮

గీతకములలో ప్రథమ వస్త్వాదినగల ఉపోహనములను క్షేపములందురు. ద్వితీయవస్త్వాదియందలి ప్రత్యుపోహనములను ప్రతిక్షేపములందురు. అనంతర్భూతములై, వేరుగానున్న తాలాత్మకగీతశేషరూపములు క్షేపప్రతిక్షేపములని ఇతరులు వ్యాఖ్యానించినారు. ఈ క్షేపప్రతిక్షేపములను తంత్రీగాన యుక్తములుగా ప్రయోగించి, భాండవాద్య సహితముగా నర్తకియొక్క అవతరణమును చూపవలెను.

ప్రథమం త్వభినేయం స్యాద్గీతకే సర్వవస్తుకమ్
తదేవచ పునర్వస్తు నృత్తేనాపి ప్రదర్శయేత్ ౨౮౯

మొట్టమొదట గీతముతో సర్వము నభినయించవలెను, తర్వాత ఈ వస్తువునే నృత్తముతో యోజించవలెను.

యో విధిః పూర్వముక్తస్తు నృత్తాభినయ వాదితే
ఆసారితవిధౌ న స్యాద్గీతానాం వస్తుకేష్వపి ౨౯౦
ఏవం వస్తునిబంధానాం గీతకానాం విధిః స్మృతః
శృణుతాంగ నిబద్ధానాం గీతానామపి లక్షణమ్. ౨౯౧

నృత్తముతో నెట్లు యోజించవలెనో ఇచట చెప్పుచున్నాడు. నృత్తము అభినయము, వాద్రితము అను వాటి విషయమున నేయే విధులు పూర్వము విధించబడినవో, వాటినన్నింటిని ఇచటకు ఆవృత్తము చేసికొనవలెను. ఆసారిత విధియందు చెప్పబడిన ప్రకారమే ఇచటగూడ గ్రహించవలెను. సంఖ్యానియమ పూర్వకముగా నర్తకీ వృద్ధితో నృత్తప్రయోగము ఆసారితమున చెప్పబడినది. విశుద్ధకరణ జాతియందలి వాద్యప్రయోగము నర్తకీప్రవేశానంతరము చెప్పబడినది. ఈ విధులనిచట గూడ వర్తింపజేయవలెనని భావము. ఇది వస్తునిబంధనగల గీతములను గురించిన విధి. ఇక అంగ నిబద్ధములగు గీతముల లక్షణమును నిర్వచింప బోవుచున్నాడు.

య ఏవ వస్తుషు విధి ర్నృత్తాభినయవాదితే
తమేవాంగనిబద్ధేషు ఛందకేష్వపి యోజయేత్ ౨౯౨

నృత్తాభినయ వాద్రితముల విషయమున చెప్పబడిన విధిని అంగనిబద్ధములైన ఛందకములలోగూడ యోజించవలెను.

వాద్యం గుర్వక్షరకృతం తథాల్పాక్షరమేవచ
ముఖే సోపోహనే కుర్యా ద్వర్ణానాం విప్రకర్షతః. ౨౯౩

ప్రయత్న శీఘ్రముగా గుర్వక్షరములలో అనేకములను తాలమున ప్రయోగించ వచ్చును. ఉత్సాహసమయమున త్వరత్వరగా గుర్వక్షరములతో తాలమును వేయవీలున్నది. ఇట్లే అల్పాక్షరములను గూడ వాద్యమున యోజించవచ్చును. గుర్వక్షరములతో ఏకకల, లఘువులతో అర్ధకల రాగలవు. ముఖమనబడు ఉపవహాంగమున, వస్తునిబంధకమగు ఉపోహనాంగమున వర్ణముల విప్రకర్షత ననుసరించి వాద్యవిధిని చూపవలెను.

యథా గీతివశాదంగం భూయోభూయో నివర్తతే
తత్రాద్య మభినేయం స్యా చ్ఛేషం నృత్తేన యోజయేత్. ౨౯౪

ముఖ్యాంగములు మాటిమాటికి ఆవృత్తములుకాగా గీతికసామర్ధ్యము ననుసరించి మాటిమాటికి అంగనివృత్తి చెప్పవలెను. మాగధ్యాదిగీతములు నాలుగు విధములు. అంగనివృత్తియైన తర్వాత మొదటి ఆవర్తనము నభినయించవలెను. ఆ వర్తాంతరములు శుద్ధనృత్తమున ప్రయోగింపబడవలసినవి.

ఆవర్తమానమగు గీతసామర్ధ్యముచే శాఖాచారీ ప్రయోగాత్మకమగు అంగము ఆవర్తితముకాగా వాద్యప్రాధాన్యముగా నృత్తమును యోజించవలెను. యథాసంభవముగా వాద్యవైచిత్ర్యమును ప్రదర్శించవలెను. వెనుక ఈ వాద్యవైచిత్ర్యము కావ్యార్థముచే నియంత్రితమైనది. ఇప్పుడు వాద్యవైచిత్ర్యము సంకుచితము కానక్కరలేదు.

త్రిపాణిలయ సంయుక్తం తత్ర వాద్యం ప్రయోజయేత్
యథా లయ స్తథావాద్యం కర్తవ్యమిహ వాదకైః ౨౯౫

సమపాణి, ఉపరిపాణి, అర్ధరవపాణి, అని మూడు విధములుగా పాణివిభేదము కలదు. వీటిద్వారా తాలాభివ్యక్తి కలుగుచున్నది. ద్రుతాదిభేదములతో లయలు కూడ వివిధములు. త్రిపాణి, త్రిలయ సంయుక్తముగా వాద్యమును ప్రయోగించవలెను. లయానుగుణ్యముగా వాద్యమును వివేచకులగు వాదకులు యోజించవలెను. ప్రథమావర్తమున కావ్యార్థాభినయ సామర్థ్యమున ప్రయోగించు అంగమునకు ఏ లయ ఉచితమగునో తదనుసారియగు వాద్యమును యోజించవలెనని భావము.

ఏవ మేష విధిః కార్యో గీతే ష్వాసారితేష్వపి
దేవ స్తుత్యాశ్రయం హ్యేతత్

భగవానుడగు మహేశ్వరుని స్తుతినిమిత్తమై, పరితోషణప్రయోజనము కలిగిన నృత్తమగుటచే, గీతముల విషయమున, ఆసారితవిషయమున పైనచెప్పిన విధుల నతిక్రమించరాదు. గీతకా, సారిత, ఛందకములను గూర్చిన విధులిట పరామర్శింపబడుచున్నవి. పరిమిత శరీరముకలిగిన దగుటచే పాణికతాండవ భాజనము కాజాలదు గనుక నిట చెప్పబడుటలేదు. లాస్యప్రధానమగు సుకుమార పూర్వరంగమున

తత్సత్త్వావెదగ్ధ్యార్థము చెప్పబడు లాస్యస్వరూపముద్వారా పాణికావిషయమును నిశ్చయింపవలెను. గీతకశబ్దముతో ఛందకముకూడ గతార్థమగుచున్నది. స్వతంత్ర మగు ఆసారితమున గీతకమున్నది.

సుకుమారం వినోధత ౨౯౬

స్త్రీ పుంసయోస్తు సంలాపో యస్తు కామసముద్భవః
తజ్జ్ఞేయం సుకుమారంహి శృంగార రస సంభవమ్. ౨౯౭

తాండవవిధియైన తర్వాత సుకుమార ప్రయోగమునుగూర్చి చెప్పుచున్నాడు. కామముద్వారా జన్మించి, శృంగార రససంభవమై, స్త్రీ పురుషసరూపముతో గూడినది సుకుమారప్రయోగము, దీనిని రంజింపజేయునట్లు యోజించుటకు ఊహాపోహ గల బుద్ధితో నిర్మించవలెను. అంగవృద్ధితో నర్తకీవృద్ధి మొదలుగాగల పూర్వోక్త లక్షణములనన్నిటిని ఇచట వర్తింపజేయవలెను.

యస్యాం యస్యా మవస్థాయాం నృత్తం యోజ్యం ప్రయోక్తృభిః
తత్సర్వం సంప్రవక్ష్యామి తచ్చ మే శృణుత ద్విజాః ౨౯౮

సుకుమార కావ్యాశ్రితమైన గాన నృత్తముల నేయేస్థలములలో ప్రయోగించవలెనో తత్సర్వము భరతుడు చెప్పబోవుచున్నాడు.

అంగవస్తు నివృత్తౌతు యథా వర్ణనివృత్తిషు
తథాచా భ్యుదయస్థానే నృత్తం తజ్ఞః ప్రయోజయేత్. ౨౯౯

యత్తు సంద్రుశ్యతే కించి ద్దంపత్యో ర్మదనాశ్రయమ్
నృత్తం తత్ర ప్రయోక్తవ్యం ప్రహర్షార్థ గుణోద్భవమ్ ౩౦౦

అంగవస్తు నివృత్తియందు, గీతక్రియా విస్తారరూపములగు స్థాయ్యాదివర్ణముల నివృత్తియందు, అభ్యుదయస్థానమున సుకుమారనృత్తమును విచక్షణుడు ప్రయోగించవలెను. వాద్యాదివైచిత్ర్యముతో కూడునట్లుగా యోజించవలెను.

స్త్రీ పురుషుల కామకృతసంలాప మేకావ్యమున వాచ్యత్వముగా గలదో అచ్చట ప్రహర్షప్రయోజనగుణ ముద్భవించునట్లుగా నృత్తమును ప్రయోగించవలెను. కామావస్థలయందు, వాసకసజ్జాభిసారికా విషయములలోను నృత్తప్రయోగము విధించబడుచున్నది

యత్ర సన్నిహితే కాంతే ఋతుకాలాది దర్శనమ్
గీతకా ర్థాభిసంబద్ధం నృత్తం తత్రాపి చేష్యతే ౩౦౧

ఖండితా విప్రలబ్ధావా కలహాంతరితాపివా
యస్మి న్నంగే తు యువతి ర్ననృత్తం తత్ర యోజయేత్. ౩౦౨

సఖీ ప్రవృత్తే సంలాపే తథా సన్నిహితే ప్రియే
నహి నృత్తం ప్రయోక్తవ్యం యస్యావా ప్రోషితః ప్రియః. ౩౦౩

యస్మిన్నంగే ప్రసాదంతు గృహ్ణీయా న్నాయికాక్రమాత్
తతః ప్రభృతి నృత్తంతు శేషే ష్వంగేషు యోజయేత్ ౩౦౪

మొదటి శ్లోకమున స్వాధీన భర్తృకయగునాయికా విషయము చెప్పబడు చున్నది. ప్రియుని సన్నిధానమున వసంతాదిఋతువులు, చంద్రోదయాది కాలముల అవలోకనము ఉన్నచో, పాడబడు కావ్యముయొక్క అర్థము నభినయించు నృత్త మును ప్రయోగింపవలెను

ఖండిత విప్రలబ్ధ, కలహాంతరిత అను నాయికల నాధారముగా చేసికొని యున్న కావ్యఖండమున నృత్తమును ప్రయోగించరాదు.

ప్రియుడు సన్నిధానమున లేకున్నచో ప్రియుని విషయకమగు సల్లాప, తత్సమాగమోపాయ పర్యాలోచనాది వృత్తికగల సఖీసంలాపమున గూడ నృత్తము పనికిరాదు ఇది ప్రోషిత భర్తృకయగు నాయికావిషయము. విరహోత్కంఠిత విష యమునగూడ నీ భావమునే గ్రహించవలెను. ప్రియుని అనాగమనమును అనుభ వించు వాసక సజ్జికావిషయమున నృత్తమొకచో పనికివచ్చును.

ప్రసన్నహృదయత్వమును యువతి ఏసమయమున పొందగలదో అట్టిచో నృత్తమును ప్రయోగింపవలెను. తన మనోవాంఛితము నెరవేరినచో నృత్తమును యోజించవలెను. ఇచట వలనావర్తనాది రూపమగు నృత్తమే విధించబడినది.

ఈ విధమగు నృత్తప్రయోగమున గీతకాంతమున ఛందకమును, పాణికాంత మున లాస్యగాన స్వీకారిణియగు చతుష్పదాను ప్రయోగించవలెను.

దేవస్తుత్యాశ్రయకృతం యదంగంతు భవేదథ
మాహేశ్వరై రంగహారై రుద్ధతై స్తత్ప్రయోజయేత్. ౩౦౫
యత్తు శృంగార సంబద్ధం గానం స్త్రీ పురుషాశ్రయమ్
దేవీకృతై రంగహారై ర్లలితై స్తత్ప్రయోజయేత్. ౩౦౬

నృత్తము రెండు రకములు ఒకటి ఉద్ధతరూపమగు తాండవము. రెండవది సుకుమార రూపమగు లాస్యము దేవస్తుతి నాశ్రయించుకొనిన కావ్యభాగము నభిన యించుచో మహేశ్వరకృతములగు ఉద్ధతాంగహారములతో నృత్తమును ప్రయో గించవలెను స్త్రీ పురుషాశ్రయమై శృంగార రసాన్వితమైన గీతికాభినయమున పార్వతీ కృతములగు లలితాంగహారములతో నృత్తమును యోజించవలెను. విద్యు ద్భ్రాంత, గరుడప్లుతకాదులున్న అంగహారము లుద్ధతములు. తలపుష్పపుట, లీన, నితంబాదులచే ఆరబ్ధములగు అంగహారములు లలితములు.

చతుష్పదా నర్కుటకే ఖంజకే పరిగీతకే
విధానం సంప్రవక్ష్యామి భాండవాద్యవిధిం ప్రతి ౩౦౭
ఖంజ నర్కుట సంయుక్తా భవేద్యాతు చతుష్పదా
పాదాంతే సన్నిపాతేతు తస్యాం భాండగ్రహో భవేత్. ౩౦౮

లాస్యగానములను స్వీకరించి చతుష్పదాలో నృత్తవిధి చెప్పబడినది. ఇక భాండవిధిని చెప్పవలెను.

నాలుగు పాదములతో ధ్రువాగీతము వచ్చుచున్నది. పాదాదియందు శుష్కాక్షరములుండగా పాడబడుదానిని గేయ పదమందురు. ధ్రువాగీతము సార్థక

పదములతోకూడ నుండవచ్చును. అట్టిచో వర్ణవృత్తకృతములగు పాదములతోగాని మాత్రావృత్తకృతమగు సమ, అర్ధసమ, విషమ అను ఆకృతితోగాని ఉండగలదు. అట్టి పాదములు ప్రధానముగా ఖంజ, నర్కుటక వృత్తములతో యోజించబడుచున్నవి. త్రివృత్తకముగాని, శుష్కగీతముగాని పరిగీతమని పిలువబడుచున్నది.

ఖంజ, నర్కుటక, పరిగీతము అను మూడుప్రకారములందును భాండవాద్య మనబడు పుష్కరవాద్యము యొక్క విధిని చెప్పబోవుచున్నాడు.

ఖంజక జాతిలోగాని, నర్కుటక జాతిలోగాని నిర్మింపబడు నాల్గుపాదములు గల ధ్రువాగీతములోని మొదటి పాదముయొక్క ఉపాంత్యకల నాశ్రయించుకొని గానమున్నది హస్తద్వయ సమాయోగమున కలుగు శబ్దముచే పరిచ్ఛేద్యమగు సన్నిపాతయను కళ నాలాపించువేళ భాండవాద్యము నారంభించవలెను.

యా ధ్రువా ఛందసా యుక్తా సమపాదా సమాక్షరా
తస్యాః పాదావసానేతు ప్రదేశిన్యాగ్రహో భవేత్. ౩౦౯

నాలుగు సమపాదములు గలది ధ్రువాగీతము. ఇది యుక్తజాతిలోని వర్ణ వృత్తముతో యోజితమైనది. ఆ జాతిలో ధ్రువాగీతముయొక్క ప్రథమపాదము పరిసమాప్తముకాగా, ద్వితీయపాదమును గ్రహించు సమయమున చూపుడువ్రేలితో ఉపలక్షితమై భాండవాద్య ప్రయోగము గావింపబడవలెను చతుష్పదకు ద్వికలాత్మక మగు మార్గము చెప్పబడినది. ద్వితీయపాదమున తర్జనిచే ప్రయోగించబడుచు నిష్క్రామకళ యనబడు సప్తమి విధించబడినది

కృత్వైకం పరివర్తంతు గానస్యాభినయస్యచ
పునః పాదనివృత్తింతు భాండవాద్యే నయోజయేత్ ౩౧౦

పూర్వము పాడిన శుద్ధ విభాగమగు గీతమును పరావర్తింపజేసి, భాండ వాద్యముతో అన్వితమగునట్లుగా అభినయమును చేయింపవలెను ఇచ్చట పాదశబ్ద ము నుపలక్షణముగా గ్రహింపవలెను. ఎంతభాగము భాండవాద్యముతో ముందు నియోజించబడి అభినీతమగుటలేదో, దానితోనే పరావర్తనమనబడు నివృత్తిని చెప్ప వలెనని భావము.

అంగవస్తు నివృత్తౌతు వర్ణాంతర నివృత్తిషు
తథోపస్థాపనేచైవ భాండవాద్యం ప్రయోజయేత్.

భాండవాద్య విశేషాభిధానవ్యాజమున ధ్రువాగీతమున నృత్తస్థానము నిట చూపుచున్నాడు. ఒక అంగమునకుగాని, వస్తువునకుగాని, సర్వధ్రువా శరీరము యొక్క స్థాయ్యాది విశేషమునకుగాని ప్రతిశాఖా న్యాయముతో పరావర్తనమును చెప్పి ఉపస్థాపనమునగూడ భాండవాద్యమును ప్రయోగించవలెను తదనుసారము నృత్తాంగహార యోజనను గావింపవలెనని భావము

యేఽపి చాంతరమార్గాః స్యుః తంత్రీ వాక్కరణైః కృతాః
తేషు సూచీ ప్రయోక్తవ్యా భాండేనసహ తాండవే ౩౧౨

శుష్కాక్షరయగు చతుష్పదాగీతమును గురించి ఇక చెప్పవలసియున్నది. శుష్కాక్షరను మొట్టమొదటనే ప్రయోగింతురు గనుక దీనిని నిర్వచించుచున్నాడు.

పరస్పర వైలక్ష్యముగల అక్షరములతో, అర్థప్రాధాన్యము లేక, కేవలము స్వరముతో ఉపలక్షితమగునది శుష్కాక్షరయగు ధ్రువా. ఇది అంతరమార్గములోనిది. ఇందలి ధ్వనులు నిరర్థకములయ్యును తంత్రీక్రియతోను, వాక్క్రియతోను యోజించబడుచున్నవి.

ఈ ధ్రువాగీతమున లాస్యాంగమగు కావ్యార్థానుసారియైన హస్తాభినయము లేదుగనుక దీనిని సాత్త్వికాంగ వలనాదికముతో, సూచీతో అభినయింపవలెను. ఇచ్చటగూడ తాలగాన సూచ్యభినయనము కలదు. వర్థమానక ప్రయోగము కాని గీతక ప్రయోగముకాని ఛందకప్రయోగముతోను, చతుష్పదా ప్రయోగముతోను పరిపూర్ణమగుచున్నది.

మహేశ్వరస్య చరితం య ఇదం సంప్రయోజయేత్
సర్వపాప విశుద్ధాత్మా శివలోకం స గచ్ఛతి. ३०३

పైనచెప్పబడిన ప్రయోగప్రక్రియకు పూర్వరంగమున ప్రయోజనము కలదు. స్వతంత్రముగా కూడ దీనిని ప్రయోగించవచ్చునని భరతుడే అధ్యాయమును ఉపసంహరించుచున్నాడు.

మహేశ్వరుని చేష్టారూపమై కరణాంగహార, రేచక సంవలితమైన ఈప్రయోగమును ప్రదర్శించినవాడు సమస్తపాపములనుంచి విముక్తుడై, శుద్ధాత్మతో శివలోకమును పొందగలడు. ఈ నాట్యప్రయోక్త, అర్థపతి, సామాజికులు పాపమునుంచి విముక్తులు కాగలరని ఫలశ్రుతి.

ఏవమేషవిధి ర్దృష్టస్తాండవస్య ప్రయోగతః
భూయః కింకథ్యతామన్యన్నాట్య వేదవిధింప్రతి. ३०४

ఇతి శ్రీ భారతీయే నాట్యశాస్త్రే తాండవలక్షణంనామ చతుర్థోఽధ్యాయః.

ప్రయోగమున కుశలులైనవారు ఈ తాండవవిధిని దర్శించిరి. ఇక నాట్యవేద విధిని గురించి మీకు ఇంకా ఏమి వినవలెనని ఉన్నది?

ఇది శ్రీ భారతీయ నాట్యశాస్త్ర వివృతియగు ఆంధ్రభారతియందు తాండవ లక్షణమను నాల్గవ అధ్యాయము.

పురాణవర్ణిత విష్ణువెవరు ?

పండిత, శ్రీ గోపదేవ్

3

పూర్వపు లేఖయందు సముద్రశబ్దమునకు, సూర్యస్థానమున కల్పితుడయిన విష్ణువునకును గల సంబంధమును గూర్చి నవభారతి పాఠకులు కొంత చదివియుందురు ఇప్పుడీ పంక్తులలో 'ఆపః-విష్ణువు'నను విషయమున కొన్ని విషయములు చదువుదురు.

పూర్వపులేఖలో, సముద్రశబ్ద మాకాశవాచకమని నుడివియుంటిమి ఆకాశనామములను గణించుచు సముద్రశబ్దముతో బాటు 'ఆపః' శబ్దమునుగూడ వైదికనిఘంటువు లెక్కించియున్నది

" ఆకాశమ్, ఆపః, పృథివీ, భూమిః ఇతిషోడశ అంతరిక్షనామాని" నిరుక్తం-1-3.

ఈ యాపః శబ్దార్థమును సరిగా గ్రహింపనందున గలిగిన యనర్థమింతయని వర్ణింపనలవికాదు నేటి సంస్కృతజ్ఞులు ఆపః శబ్దమున కర్థము జలమని నుడువుదురు వైదికభాషలో నీశబ్దమున కర్థము ఆకాశమని తెలిసిన వ్యక్తులు లౌకికసాహిత్య విదులలో మిక్కిలి యరుదుగా నున్నారనుట సత్యదూరముకాదు. 'ఆపః శబ్దము సంస్కృతమున నిత్యబహువచనాంతము. దీనికి జలమని యర్థ మంగీకరించినందున ననేక గాథలు కల్పింపబడినవి. ఆ కల్పితగాధలు క్రమముగా నసత్యములను మాట మరచి నిత్యసత్యములుగా నేడు గ్రహింపబడుచున్నవి. దానివలన గలిగిన యనర్థ పరంపరకును నవధిలేదు. విష్ణువునకుగల పర్యాయపదములలో నారాయణుడొకటి పురాణములను జదువువారు నారాయణునకు నివాసస్థానము జలమందురు దీనికి కారణము 'ఆపః' శబ్దమునకు జలమని యర్థము చెప్పుటయే మనుస్మృతిలో నేమున్నదో చూడుడు:

"ఆపోనారా ఇతిప్రోక్తాః
ఆపోవై నరసూనవః
తా యదస్యాయనం పూర్వం
తేన నారాయణః స్మృతః"

మనువు - 1-10.

'ఆపః - నారాః - నరసూనవః ఆపః జలము (నారా) అయనం - స్థానము గాగలవాడు కావున నారాయణు డనబడినాడు.

విష్ణుపురాణమునందును నీ విషయ మిట్లున్నదో పాఠకులు గమనింతురుగాక:

"ఇదంచోదా హరన్త్యత్ర,
శ్లోకం నారాయణం ప్రతి
బ్రహ్మస్వరూపిణం దేవం
జగతః ప్రభవాప్యయాత్"
"ఆపోనారా ఇతిప్రోక్తా
ఆపోవై నరసూనవః
అయనంతస్యతాః పూర్వం
తేననారాయణః స్మృతః"

'జగత్తుయొక్క ప్రభవాప్యయములకు కారణముగ బ్రహ్మస్వరూపియగు దేవుని విషయమున నీశ్లోకము నుదాహరింతురు.

'ఆపః' అన'నారా' అనియు, అవియే అయనముగ గలవాడు కావున నారాయణుడనియు శ్లోకాభిప్రాయము'

వాస్తవమున జగదుత్పత్తి స్థితిలయములకు కారణభూతమగు భగవంతుడు (విష్ణువు) సంపూర్ణ ప్రపంచమునందంతటను వ్యాపించియుండును. కాగా జలమే యతనికి స్థానమెట్లగును? సమస్త ప్రపంచమున వ్యాపించియుండు భగవానుడు జలమునందు లేడని మా యభిప్రాయముకాదు కాని, జలమే యతనికి నివాసస్థానమనుట సంగతముకాదని మాత్రము చెప్పుదుము

పూర్వపు లేఖలందు ఆకాశమున లుంగు సూర్యుడే విష్ణువుగ కల్పింపబడినట్లు పాఠకులు చదివియే యున్నారు. ఈ కల్పకులు ప్రప్రథ

మము తెలిసియే తమ కల్పిత విష్ణువునకు సముద్రమును నివాసస్థానముగ కల్పించియున్నారు. కాని, తరువాతి సాహిత్యకులు, లేక పౌరాణికులు ఆకాశ పర్యాయములగు 'సముద్ర ఆపః' శబ్దములకుగల వాస్తవికమగునర్థమును గుర్తింపనందున ననేకానర్థములను కల్పించి గాథల నల్లిరి. పై శ్లోకములలోని 'ఆపః' శబ్దమునకర్థము ఆకాశము అట్లే 'నారా' అను పదము కూడ ఆకాశమునే తెలుపును కాని జలమును తెలుపదు

'నరః' - జగన్నాయకుడగు పరమాత్ముడు 'నరస్య అపత్యం నారః' - అతని యపత్యము 'నారః' అనబడును - 'నారః' అన ఆకాశమని యర్థము. సర్వ జగజ్జనకుడగు పరమాత్మునకు ఆకాశము అపత్యమగుటలో దోషమావంతయు నుండదు. ఆ యాకాశముకూడ పరమేశ్వరునకు ఉనికిపట్టు. ఇట్టి సుందరమగు నర్థమును గమనింపక పురాణములలో "పరమేశ్వరుడు" విశ్వమునంతటిని నాశమొనర్చి సముద్రజలమున శయనించి యుండునని వర్ణింపబడినది చూడుడు భాగవతమున నేమియున్నదో!

"యస్యాంభసి శయానస్య, యోగనిద్రాంవితన్వతః నాభిహ్రదంబుజా దాసీత్ బ్రహ్మా విశ్వసృజాంపతిః" భా 1-3 2

జలమున శయనించి యోగనిద్రయందున్న భగవానుని నాభికమలమునుండి ప్రజాపతులకు ప్రభువగు బ్రహ్మ యుద్భవించెను' అని శ్లోకాభిప్రాయము ఇట్టి కట్టుకథలకు కారణము 'ఆపః' శబ్దమునకు గల యాకాశమను నర్థమును విడిచి జలమనియర్థము గ్రహించుటయే భారతీయ సాహిత్యమున నిట్టి యనర్థేతి హాసములు అనేకములు కల్పింపబడినవి ఈ యాఖ్యానములు వైదిక సంస్కృతికిగల వైశిష్ట్యమును కళంకపరచినవనుటలో సందేహమిసు మంతయులేదు అంతేకాక విధర్ములకు పలువిధముల శంకించుటకును తావొసంగినవి. మరియును, మనుస్మృతియందు నిట్లున్నది.

"అప ఏవ ససర్జాదౌ తాసువీర్యమవాసృజత్" మ 1.3

ఇందలి 'ఆపః' శబ్దమునకు జలమర్థముగా నెంచి సృష్టికి ప్రథమమున జలము సృజియింపబడినదని చెప్పసాగిరి ఇయ్యది వైదికసృష్టిక్రమమునకు విరుద్ధము. అశుద్ధమును నేటి వైజ్ఞానికదృష్టికి నియ్యది నిజమననొప్పదు వైదిక సృష్టిక్రమ మెట్టిదోయని పాఠకులు తెలిసికొనగోరుదురు ఈ క్రింది వాక్యమును గమనింతురుగాక,

"తస్మాద్వా ఏతస్మాతాత్మన ఆకాశః సంభూతః ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ, పృథివ్యా ఓషధయః "

పరమేశ్వరుడు ప్రథమమున పంచభూతములలోనత్యంతసూక్ష్మము వ్యాపకమునగు నాకాశమును సృజియించి, తదుపరి క్రమముగా స్థూల స్థూలతరములగు వాయువు, అగ్ని, జలము, పృథివి యను భూతములను సృష్టించియున్నాడు తదుపరి ఓషధులు - అన్నము మున్నగు వస్తువు లుత్పన్నములైనవి ఇది వైదిక సృష్టిక్రమము, ఇది యిట్లుండ పరమేశ్వరుడు మొదట జలమును సృష్టించెనని పురాణాదులలో నుండుట సంగతమెట్లగును? కాబట్టి 'అప ఏవససర్జాదౌ' అను స్మృతివాక్యమునగల 'ఆపః' శబ్దమునకు జలమని కాక ఆకాశమని యర్థము చెప్పుకొనుట మిక్కిలి యుపయుక్తమగును

"పరోదివా పరఏనా పృథివ్యా
పరోదేవేభి రసురైర్యదస్తి
కిం స్విద్గర్భం ప్రథమం దధ్ర
ఆపో యత్రదేవా సమపశ్యంతవిశ్వే"

ఋ - 10-82 5

"ఈశ్వరతత్త్వము ద్యులోకమునకు, పృథివికి, (దేవై రసురైః) ప్రాణ ప్రదములగు పదార్థముల కన్నింటికీ, పరమై - సూక్ష్మమై - యున్నచో ఆపః - ఆకాశము, ప్రథమమున దేనిని గర్భమున ధరించినది? సూర్యుడు, నక్షత్రములు, వాయువు మున్నగు దేవతలు దేని

యందు పరస్పర కార్యములను సాధించిరి?' అని మంత్రాభిప్రాయము ఈ మంత్రమునందలి ప్రశ్నములకు అనంతర మంత్రమున నిట్లు సమాధానము చూడనగును

"తమిద్ గర్భం ప్రధమం దధ్ర ఆపో
యత్ర దేవా సమగచ్ఛంత విశేద్
అజస్యనా భావధ్యేకమర్పితం
యస్మిన్ విశ్వా భువనాని తస్థుః"

10 - 82 - 6

'ఆపః - ఆకాశము, ప్రధమం - మొదట, తమిత్ - పరమాత్మరూపమగు, గర్భం-గర్భమును, దధ్ర - ధారణచేసినది యత్ర-ఏ గర్భమునందు, విశ్వేదేవాః సమస్త దేవతలు, సమగచ్ఛంత - కలిసియుండిరో. అజస్య - అజన్ముడైనే పరమాత్ముని. నాభావది-నాభిలో (ణహ బంధనే) అను ధాత్వర్ధమును బట్టి ప్రపంచమును బంధించియుంచు నీశ్వరశక్తియందు - ఏకమర్పితమ్- ఒక యచింత్య తత్త్వ మర్పింపబడెను. యస్మిన్ - దేనియందు విశ్వాభువనాని-సమస్తలోకములు. తస్థుః - స్థిరములై యున్నవో.

ఇందు గర్భశబ్దమాకాశ వాచకమగుట కా శబ్దమునకుగలట్టి లౌకికార్థమే ముఖ్యకారణము గర్భమన గ్రహించునది సమస్త జగత్తు యొక్క గ్రహణధారణ కర్తయగు పరమాత్మని మొదట నాకాశము తనలో ధరించినదని భావము. పరమేశ్వరుడు వ్యాపకుడగుటచే నాకాశములో నుండెనని యెరుంగవలయును.

విద్వాంసులిట్టి మంత్రార్థములను పరికింపక 'ఆపః' శబ్దమునకు జలమని యర్థము జెప్ప నారంభించిరి. అందువలన కలిగిన యనర్థము లేమో పాఠకులు స్వయముగ నిప్పుడూహింప గలరని యెంచెద.

గోవిందరామాయణము

విశ్వామిత్ర శరణాగతి

*

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు

తియ్యనిమాటలన్ దశరథేయునిఁ దన్పుచు మౌనిపల్కు రా
మయ్య ముదావహమ్ము భవదద్భుతశక్తి మఱెవ్వరేని లే
రయ్య మదీయ యాగ పరిరక్షణమూనఁ గలారునీవగా
కయ్యము నెయ్యమున్ సలుపఁగాఁదగు వాఁడవు లోక కోటికిన్

భువనము లన్నిటన్ యశము బొందినవాఁడ త్వదీయుఁడన్నదా
సదనము రక్షసేయఁగల శక్తుఁడవై దరినుండి మంత్ర సం
భవ పరదేవతా మహితమానిత వైభవమేలనాకు భా
రవహముగాదె నీకెతగు రామ గ్రహింపుము ధారవోసెదన్.

ఇలఁగల యట్టి మంత్రములనెన్నిటినో జపియించినాఁడ నేఁ
బలుమఱు మంత్రదేవతల పాల్బడినాఁడఁ దరింపఁజేయఁగాఁ
గలదొకచేని లేదు రిపుకాండము ద్రుంచఁగలట్టివానితో
ఫలితములేదు నాకికను పట్టుము వానిని ధారవోసెదన్.

"అన్యులెవ్వర శరణమ్ము నడుగ, నిన్నె శరణమంటి"ని మనసారఁ దలఁచి
గాథిసూనుండు రాముని గరముబట్టి ధారవోసెను వివిధమంత్రముల నొకట.

చిరతపః ఫలమగు మంత్రసిద్ధి నొసఁగి
ముక్తి గననెంచె నణిమాది రక్తుఁడపుడు
మూడుదినముల క్రిందటఁ బూనియున్న
నాత్మ నర్పించు యోగమ్మునందు నిలిచి.

ఈషణత్రయ రహితుడై యెంచి పరము
విమలుఁడై స్వయంశక్తుల విహితుఁడగుచుఁ
గౌశికుఁడు రాముఁగనికని కాంచుముదము
ఆ నృపసుతుఁడో మునికి దాసోఽహమనుచు,

అంత రాజపుత్రు నాశ్రయించిన వెల్ల చక్ర, పాశ, ముసల, శక్తి, గదలు
నస్త్ర సంచయమ్ము, నసి, శూలమ, శనులు దేవమమ్ముఁ జేరఁదీయుమనుచు.

దేవదానవ సంహార దివ్యశక్తి
వెల్గు శస్త్రాస్త్రదేవతల్ వీరుడాయ
వాని స్పృశియించి గ్రహియించి వానికంత
వర్తిలగ నాజ్ఞనిడె తన భావమరసి.

అఖిల శస్త్రాస్త్ర సంయుతుఁడైన రాఘ
వుండు హృష్టుఁడై పయనమై పోదలంచి
కౌశికుఁడు మంత్రముల ప్రయోగమ్ము నిడుట
నతని నస్త్రోపసంహార మడిగి భక్తి.

కౌశికుఁడు మంత్ర సంహారగతులనన్ని దాశరథిచేతఁ జేయిడి దారవోసి
క్రాలెఁ బరమాత్మ తలఁపొందె కలుగురీతి నితర విషయవిహీన సంగతినిబొంద.

అతఁడేక సంథాగ్రాహి యతులబలుఁడు
వీరవర్యుఁ డథర్వణవేదవిదుఁడు
సకల శస్త్రాస్త్రసంయుక్త సార్వభౌముఁ
డౌచు రాముండు పయనమై యరుగ సాఁగె.

గురుని యనుజ్ఞనొంది తన కూరిమితమ్ము సుమిత్ర సూనునా
దరమునఁ జీరి శాత్రవవిదారణమూనఁగనే ప్రయోగ సం
హారణ విధానసంయుత మహాస్త్రచయంబుల నిచ్చె నివ్వి నే
నెఱుఁగని వోక్కొయంచు మదినెంచినరీతిగఁ దక్షణంబునన్.

తన యెడనున్న ప్రేముడియె తప్ప మఱొండు తలంపులేమిగా
మునికడనున్న విద్యల సమూలముగా గొనె కాని యేలకో
తనకడ గూడనుంచక యెతక్షణమే రఘురాముడంత త
మ్మునకిడె లక్ష్మణుండొకఁడె మూలమొ? గుప్తముసేయ విద్యలన్.

అతఁడు సర్వజ్ఞుఁ డందుమా యనఁగ రాదు
కౌశికునివెంటఁ జనిచని కానలోనఁ
గొంత దవ్వునఁ గని యొక కొండసీమ
ప్రశ్నవేసెను మునికిట్లు పరమభక్తి.

ఆ సుమనోమనోహర విహంగవిహార వనీనివాస స
న్న్యాసి యెవండు మౌనివరయానగ పార్శ్వమహాశ్రమస్థ లీ
వాసము సేయు పూజ్యగుణవంతుఁ డెవండిటు జంతుకోటి హిం
సాసరణి న్త్యజించి మనఁజాలెడి వేని తపోబలంబునన్.

దాఁటితి మన్నమాట బహుదారుణ దుర్గమ తాటకాటవిన్
నేఁటికి సుందరంబును వినీత నివాసమునున్ మనోజ్ఞ మీ
వాటిక యేరివాఁడ భగవంతుఁడ తావక దివ్యతీర్థ మె
చ్చోటఁ ద్వదీయ శత్రుచయ సూదనమెచ్చట యజ్ఞరక్షకై.

అప్రమేయుండు దానయ్యి నడుగుచుండె
ధన్యుఁడును నేనెయని మౌనిదలఁచి యాత్మఁ
దెల్పబూనెను దత్కథ తెల్లముగను
గులుకులొలుకఁగ వినుచుండఁ గుఱ్ఱవాఁడు.

అదెసుమా! మునువిష్ణు వాది నారాయణుం
          డత్యంత తపమున్న యతుల ధాత్రి
అదెసుమా! కాశ్యపుం డతులసిద్ధినిగన్న
          సిద్ధాశ్రమంబను నిద్ధభూమి
అదెసుమా! బలిదాన మర్ధించియుండిన
          వామనమూర్తి తపస్సు తావు
అదెసుమా! నాదు వ్రతావలంబన సీమ
          వైరు లిర్వురు నిను పోరుచోటు

అదెసుమా! నాకుతావు, నా యాశ్రమంబు
కాదు నాయది యోతాత నీదిసుమ్ము
నాది నీ యదికాదె నీనా విభేద
మేమియును లేదు నాసర్వమీవె తండ్రి.

అనుచు సిద్ధాశ్రమ పదమ్మునందు జొచ్చు
రామలక్ష్మణ యుతుఁడైన బ్రహ్మమౌని
మంచు తొలఁగిన చంద్రునిమాడ్కి వెలుగ
నచటఁగల మౌనులెల్లరు నల్లె గనిరి.

ఆ మునికోటి కౌశిక మహాత్మున కున్దగుపూజసేసి, గా
రాముని రాకొమారకుల రాజ సపర్యల గారవించుచున్
సేమ మెఱింగి, రాట్సుతులు సేదతొలంగఁగనుండి యాముని
స్తోమము మధ్యఁ గొంతవడి శుద్ధమనంబులఁ బల్కి రంజలిన్.

మునివర సిద్ధాశ్రమమిదె యను, సార్థకమున జెలగు నాశ్రమమగు నీ
వనుపున నిదె పూనుము దీక్షను దోడనె నీదుమాట సత్యమెయగుతన్.

అని కౌసల్యానందను డనినంతనె కౌశికుండు యజ్ఞవ్రత దీ
క్షను గొనె సిద్ధాశ్రమ మందునఁగల మునులెల్ల భక్తి నుతియింపంగన్.

అంతవఱకు రామా నృపాలాత్మజా, య
టంచు సంబోధనమొనర్చి యాశ్రమంబుఁ
జేరి 'తాతా' యటంచెఁ జిఱుతరాము
కౌశికుం డేమొకోయజ్ఞ కాంక్షనేమొ?

అంతవఱకు సద్గురుఁడంచు నాత్మఁదలఁచి
యప్పుడుప్పు డాశీస్సుల నందుచున్న
బాలరాముండు మౌనికి భద్ర మస్త
టంచనియెనప్డు పూనుమీ యజ్ఞమంచు.

కర్మసాక్షి యంత మర్మమూనిన యట్లు
కనులఁ దోఁపకుండ జనియె నెటకొ
పుడమిఱేని సుతులు పుణ్యాశ్రమంబున
మునులతోడ మైత్రిబొంది బొంది.

ఫుల్ల మనోజ్ఞ పుష్పచయముల్ గల సిద్ధతపోవనంబునన్
జల్లఁగ నాటిరేయినిఁ బ్రశాంతముగా నిదురించి తూర్పు ది
క్కెల్లయుఁ దెల్లవారఁగ, దినేశుభజింపఁగఁ బూర్వసంధ్య సం
ధిల్ల యథాగతి న్విధులదీఱిచి మ్రొక్కిరిగాధి పుత్రకున్.

కావ్యాలలో నీతిబోధ

డాక్టర్, శ్రీ జి. వి. కృష్ణరావు

పువ్వులలో కొన్ని అందానికి ప్రసిద్ధి. కొన్ని వాసనకు ప్రసిద్ధి, కొన్ని యీ రెంటికీ ప్రసిద్ధి. ఈ కడపటివి చాలతక్కువ మన దేశంలో వాసనగల పువ్వుకున్న గౌరవం అందమైన పువ్వునకులేదు. ఈ అర్థాన్నే "వాసనలేనిపూవు బుధవర్గములేని పురమ్ము" అన్న ప్రాచీనోక్తి చాటుతున్నది.

అలాగే భాషా కృతులలోకూడ కొన్ని రామణీయకానికి ప్రసిద్ధి. మరికొన్ని ఉపదేశానికి ప్రసిద్ధి ఒక కొన్ని యీ రెంటికీ ప్రసిద్ధి రామణీయకాత్మక కృతులను కావ్యాలనీ, తత్త్వోపదేశాత్మకాలను శాస్త్రాలనీ, ఉభయాత్మకాలను శాస్త్రకావ్యాలనీ పెద్దలంటారు. వీనికి సంస్కృతంలోని రామాయణం, బ్రహ్మసూత్రాలు, మహాభారతం క్రమంగా ఉదాహరణాలు

పువ్వుల అందం వేరు. వాసన వేరు, అలాగే కృతులలో కావ్యాలు వేరు, శాస్త్రాలు వేరు అందం వాసనకాదు. వాసన అందం కాదు. అలాగే కావ్యం శాస్త్రం కాదు, శాస్త్రం కావ్యం కాదు. కావ్యానికి సహానుభవం, అపరోక్షానుభూతి ప్రధానం. శాస్త్రానికి పరామర్శం, పరోక్షానుభూతి ప్రధానం హితమూ, నీతి, ధర్మమూ శాస్త్రానికి విషయాలు. కాబట్టి సాధారణంగా హితోపదేశం, నీతిబోధ, ధర్మనిరూపణం సాక్షాత్తుగా కావ్యంకాదు కాని కావ్యాలలో ఇవి కనిపిస్తున్నవి. కావుననే తరుచు నీతిబోధను, హితోపదేశాన్ని కావ్యమని ప్రజాసామాన్యం భ్రాంతిపడుతున్నది

అప్పుడప్పుడు రాజకీయులు కొందరు "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్నది ఉత్తమోత్తమ కావ్యోక్తిగా పేర్కొంటూ ఉంటారు. నిజానికి ...

ఏఱకుమీ కసుగాయలు
దూఱకుమీ బంధుజనుల దోషము సుమ్మీ
పాఱకుమీ రణమందున
మీఱకుమీ గురువునాజ్ఞ మేదెనిసుమతీ

అన్న పద్యంలో ఎంతకవిత్వం ఉన్నదో పై దానిలోగూడ అంతకవిత్వమే ఉన్నది

శాస్త్రం ఎప్పుడూ విధినిషేధపూర్వకం ఆ విధినిషేధాలను అది ఒకప్పుడు యుక్తి సహితంగా ప్రదర్శించవచ్చును, మరొకప్పుడు యుక్తివిరహితంగా ప్రదర్శించవచ్చును. దేశమంటే మట్టికాదోయ్ అన్నపాదం నిషేధాత్మకం. దేశమంటే మనుషులోయ్ అన్నపాదం విధిపూర్వకం ఏఱకుమీ కసుగాయలు అన్న పద్యం నిషేధాత్మకం, ఇచట యుక్తి లోపించినా, యీ కావ్యాలు రెండూ శాస్త్రం కోవకు చెందినవి.

కావ్యం అలాకాదు. తాను ప్రతిపాదించే అనుభూతి పాఠకునిది కాకపోవచ్చును పాఠకుడు తనకున్న స్థితిగతులలో అలాంటి అనుభవం పొందలేకపోవచ్చును అయినా కావ్యం అతనిని శరీరసహితంగా తాను చిత్రిస్తున్న వ్యక్తిలోగాని, సన్నివేశాలలోగాని, సంఘటనలలోగాని, స్థితిగతులలోగాని ప్రవేశింపజేసి ఆ సుఖదుఃఖాలు రాగద్వేషాలు కామక్రోధాలు అనుభవింపజేస్తుంది. ఇది ఎలా సంభవం? అదే ప్రతిభామహిమ

ఇలాఅంటే కావ్యం కావ్యమే అవుతుంది, శాస్త్రం శాస్త్రమే అవుతుంది. అప్పుడు ఒక దానిలో మరొకటి ఉండరాదు. కాని కావ్యంలో నీతిబోధ కానవస్తున్నది ఉదాహరణకు-

అడిననమాటను దప్పిన
గాడిద కొడుకంచుఁ దిట్టఁగావిని మదిలో
వీఁడా కొడుకని యేడ్చును
గాడిదయును గుందవరపుఁ గవిచౌడప్పా!

అన్న పద్యంచాలు. ఇది నిశ్చితంగా నీతిబోధే. ఇందులో కవిత్వం లేకపోవాలి. కాని

సహృదయుడైనవాడు ఇందులో కవితాస్ప ర్శకూడ లేదంటే ఒప్పుకోలేడు. ఇక్కడ కొంత చమత్కారం ఉన్నది. పలికి బొంకిన వాణ్ణి గాడిదకొడుకని తిడితే గాడిదకూడ ఇలాంటి దౌర్భాగ్యుడా కొడుకని ఏడుస్తుం దట! అదీ బాహాటంగాకాదు. లోలోపలనే. ఎందుకంటే ఒరులతోచెప్పుకొని ఏడ్వాలన్నా కొంత యోగ్యత కావాలి.ఇలాంటి దౌర్భా గ్యుణ్ణి కనటంవలన అదీలేదు. అందువలన మానాభిమానాలు లేని గాడిదకూడ బావురు మని ఏడ్వలేక లోలోపలనే ఏడుస్తుందట. ఇందులో కవితాస్పర్శలేదని ఎలాఅంటాము? కాగా కవిత్వంలో నీతిబోధ, ధర్మోపదేశం ఉండటానికి వీలున్నది. ఈ అవకాశం ఎలా ఏర్పడుతున్నది? ఇది మొదటిప్రశ్న కావ్యం లోని నీతిబోధకు, శాస్త్రంలోనిబోధకు విశే షం ఉన్నదా? ఇది రెండవప్రశ్న ఉంటే ఆ విశేషమేమిటి? కావ్యం దానిని ఎలా సాధి స్తున్నది? ఇది మూడవ ప్రశ్న.

కావ్యానికి అనుభూతిప్రధానం. చరాచర మైన యీ ప్రపంచమంతా ఈ అనుభవానికి విషయం కాబట్టి కావ్యానికి విషయంకాని వస్తువేదీ ప్రపంచంలోలేదు శాస్త్రాలు, వీని అర్థాలూ ప్రపంచంలోనివేకాని బాహ్యాలు కావు. అందువల్ల కావ్యంలో శాస్త్రార్థాలు ఉంటవి శాస్త్రమంటేనో అనుభూతార్థాన్ని విభజించి యుక్తితో విధినిషేధ పూర్వకంగా తత్త్వం నిర్ణయిస్తుంది అంటే లలితకళాను భూతి ఉపరతమై శాస్త్రార్థవివేచన ఆరబ్ధమౌ తుంది. కాబట్టి శాస్త్రంలో కవిత్వంఉండదు ఉంటే అది శాస్త్రంకాదు కేవలం శాస్త్రాభా సం అవుతుంది గ్రీకుతత్త్వవేత్తఅయిన ప్లేటో రచనల్లో కవిత్వం ఉన్నదని విజ్ఞులుఅంటారు. ఆ కవితాస్పర్శ ఉన్నంతమేర శాస్త్రార్థ దౌర్బల్యం ఉన్నదని విమర్శకులు అంగీకరిస్తు న్నారు.

ఈ విధంగా కవిత్వంలో,నీతిబోధ, ధర్మో పదేశం, తత్త్వనిర్ణయం ఉంటే ఉండవచ్చును కాని శాస్త్రంలోమాత్రం కవిత్వం ఉండదు. కవిశబ్దంకూడ ఈ అర్థమే చెబుతున్నది. ఈ శబ్దం సాహిత్య స్రష్టనేకాక శాస్త్రకారుని కూడ తెలుపుతున్నది. పండితునిచెప్పే విద్వ దాదిశబ్దాలు కవినిచెప్పవు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
  యాధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని
  కవివృషభులు మహాకావ్యమనియు....

అన్న నన్నయ భట్టారకునిపద్యం ప్రకృ తార్థాన్ని పాదుకొల్పుతున్నది.భరతమహర్షి కూడ సర్వశాస్త్రాలు సర్వజ్ఞానాలు నాట్యాంతర్భూతాలని ఘంటాపథంగా పేర్కొన్నాడు

ఇక బ్రహ్మసూత్రాలు ప్రఖ్యాతశాస్త్ర గ్రంథంకదా! వానిలో కవిత్వం ఉన్నదని ప్రస్తావించినవారు లేరు. కాబట్టి కావ్యంలో శాస్త్రం ఉండవచ్చును కాని శాస్త్రంలో కవిత్వం ఉండదు

మరి రెండవ ప్రశ్నకు సమాధానం- కావ్యంలో గోచరించే శాస్త్రార్థం 'శాస్త్రం లో ఉన్నట్లుగా విధినిషేధ రూపంలో ఉం డదు శాస్త్రం ప్రభువువలె శాసిస్తుంది. కాక కొంత క్రిందిమెట్టుకు దిగిచెప్పటం జరిగితే మిత్రునిలాగా బోధిస్తుంది కావ్యం అలాకాక ప్రియురాలివలె దానిని హావభావవిలాసాల తోనే వెలారుస్తుంది. దీనినే ఆలంకారికులు కాంతా సమ్మితత్వమంటారు.

ఈ కాంతా సమ్మితత్వలక్షణాలు ఏమిటి అంటే, ఏ ఆలంకారికుడైనా, ఏ విమర్శకు డైనా దిఙ్మాత్రంగా సూచించగలడు కాని సమగ్రంగా పేర్కొనలేడు అంతమాత్రంచేత అది గోచరించినప్పుడు సహృదయుడు గుర్తింపలేడనరాదు. ఎంత నిభృతరూపం తాల్చినా దానిని చూడగానే అతని హృద యం స్పందిస్తుంది మరి దాని సమగ్ర లక్ష ణాలు ఎందుకు చెప్పలేడు? కావ్యసంసారం అపారం. నక్షత్రాలను చూస్తున్నాము.

వాటిని ఎవడు లెక్కించగలడు? షడింద్రియాలతో ఈ ప్రపంచాన్ని దర్శిస్తున్నాము. అయినా దీనితత్త్వాన్ని నిజంగా ఎవడు ఆకళించుకొన్నాడు?

ఈ కావ్యజగత్తూ అంతే. బ్రహ్మ తన ఇచ్ఛవచ్చినట్లుగా కర్మానుభోగ్యంగా ఈ ప్రపంచాన్ని సృష్టించాడని మనవారు అంటారు. వ్యావహారిక ప్రపంచ విషయంలో ఇది యధార్థం అయినా, కాకపోయినా, కావ్యజగత్తులోమాత్రం అక్షరాల నిజం. కవి తాను బోధించదలచుకొన్న అర్థానికి అనుగుణంగా పాత్రల గుణకర్మల కనురోధంగా సహృదయానుభోగ్యంగా కథను కల్పిస్తాడు. ఈకథ నేరుగా శాస్త్రంలోవలె సప్రమాణంగా విధినిషేధపూర్వకంగా నీతినిగాని, ధర్మాన్నిగాని, తత్త్వాన్నిగాని నిర్దేశించదు కేవలం వ్యంజితం చేస్తుంది ఇందుకు మహాభారతమే నిదర్శనం. అందలి ఊర్జితకథ లోకాన్ని ఆశ్చర్యచకితం చేస్తుంది నానాపాత్రలు, పరస్పరతనన్ని వేశాలు, విభిన్నప్రకృతులు విచిత్ర పరిణామాలు పాఠకుణ్ణి అద్భుతంలోముంచి తేలుస్తాయి. అతని సంస్కారం, అనుభవం ఎంత ఉన్నదో అంత విస్తృతార్థం గోచరిస్తుంది. సామాన్య మహాకావ్యాలు చదివినవాడు జీవితతాత్పర్యం, పరమార్థం స్మరించకపోయినా అర్థం చేసికోవచ్చును. కాని ఆంధ్ర మహాభారతం ఆమూలాగ్రం చదివినవానికి తత్త్వజిజ్ఞాస అంకురించికపోతే తప్పకుండా ఆశ్చర్యపడవలసిందే అతనికి అర్థజ్ఞానం ఉన్నదా అని సందేహించవలసిందే కురుపాండవ జననం వైరస్నేహవృద్ధి, సుహృద్ద్యూతానుద్యూతాలు, వనవాసాజ్ఞాతవాసాలు, అష్టాదశాక్షోహిణులతో జరిగిన యుద్ధం, పరాజయకల్పకమైన పాండవవిజయం, భీష్మద్రోణకర్ణ వికర్ణ కృపాశ్వత్థామాదుల ప్రవృత్తి, శ్రీకృష్ణ నిర్యాణం, ఎవరిని రసోత్తుంగ తరంగ పంక్తులపై ఉర్రూతలూచవు? ఎవనిని పర్యుత్సుకుణ్ణి చేయవు?

మహాకావ్యార్థం నీతినికాని, ధర్మాన్నికాని ఎంతకోమలంగా మధురమధురంగా వ్యంజితం చేస్తుందో భారతసుహృద్ద్యూతార్థమే నిదర్శనం. దుర్యోధనుడు పాండవలక్ష్మీసమాపహరణమే ఉద్దేశించాడుకాని ద్రౌపదీవస్త్రాపహరణం కలలోకూడ తలపెట్టలేదు. విజయోన్మాదం, సంభూతానుసంభూత ఘట్టాలు, ప్రసంగానుప్రసంగాలు హీనమతులను కీలుబొమ్మలనుచేసి ఎంతనీచంగా ఆడిస్తాయో, స్థిరసంకల్పులు వాటినే ఆత్మాభ్యున్నతికి ఎంతచక్కగా వాడుకొంటారో ఈ ఘట్టంకంటె ఎక్కువగా ఏశాస్త్రం ఏయుక్తి చేత హృద్గతం చేస్తుంది?

అయితే కథాముఖాన నీతిబోధం సాగిస్తున్నప్పుడు కవి అత్యంత జాగృతి వహిస్తాడు. కథ ఆదిమధ్యాంతసహితంగా అనపేక్షితార్థవ్యపేతంగా నీతిబోధ కావిస్తాడు. ఉదాహరణకు ధర్మజు డనుద్యూతంలో ఓడిన సందర్భం గ్రహించవచ్చు. నన్నయభట్టారకుడు

ధర్మసుతు డొడ్డె శకుని క
ధర్మస్థితి నోటువడియె దైవము చెయిదిన్
నిర్మితమయిన శుభాశుభ
కర్మఫలంబెట్లు దేహి గడవఁగనేర్చున్...

అని అంటూ ఒక్క అర్థాంతరన్యాసోక్తి విన్యసిస్తాడు. ఈసూక్తి ధర్మజునిచరితాన్ని అభిగుప్తంచేస్తూ హృదయంలో గాఢంగా నాటుకొంటున్నది. ఇల్లాకాక కవి విధిబలీయత్వాన్ని ప్రస్తరించి ఉన్నట్లైతే అది కవిత్వమై ఉండేదికాదు.

మొత్తముమీద కథా ప్రధానాలైన కావ్యాలలో నీతిబోధం, ధర్మోపదేశం సాధారణంగా వస్తువ్యంగ్యం అవుతుంది. ఆయా సన్నివేశాలలో కవిజాగరూకుడై ఉపమాద్యలంకారముఖాన అత్యంత క్లుప్తంగా నీతిబోధ చేస్తాడు. అంతేకాని శాస్త్రంలోవలె బాహాటంగా పరామర్శాత్మకంగా విధి ప్రతినిషేధ పూర్వకంగా మాత్రంచేయడు.

కథలోని పాత్రలద్వారా కూడ నీతిబోధ సంభవమే. వివిధపాత్రలకు ఆదర్శ స్పర్ధలుకాని మఱొకవిధమైన ఆవశ్యకత కాని ఏర్పడినప్పుడు వానివాని స్థితిగతులను బట్టి సంస్కారాలనుబట్టి, సన్నివేశాలనుబట్టి నీతిని శాస్త్రంలోవలె అభిధా తాత్పర్య వృత్తులు ప్రధానంగా చేసికొని విధినిషేధ రూపంతో చెప్పవచ్చును. దీనికి విదురనీతి, ధౌమ్యుని సేవాధర్మనిరూపణం తార్కాణం. స్వాభావికంగా భావాలంకార విరహితాలైన ఇలాంటివి ప్రాకరణిక కవిత్వం అవుతాయి. హేంలెంట్ రూపకంలో పొలోనియస్ లియార్టిస్‌కు చేసిన హితోపదేశం ఇలాంటిదే. ప్రకరణ ప్రచ్యుతాలైనప్పుడు ఇవి కవితాకోటికి చేరవు రసపిచ్చ గల కొంతమంది నవ్యులు కలిత ప్రకరణాలైనా విగళిత ప్రకరణాలైనా ఇలాంటివి కవిత్వం కాందంటున్నారు. వీరు కవితాతత్త్వదూరగులు కావటమే కాక కాళిదాసభవభూత్యాది మహాకవుల పట్లగూడ మహాపచారులవుతున్నారు.

కథయందలి నాయక జీవనవర్ణనముఖాన గూడ నీతిని, అవినీతిని సూచించటంకూడ కావ్యాలలో కనిపిస్తున్నది. దీనికి...

చలిచేమ వేనియుఁ జాద్రౌఁక్క శంకించుఁ

బలుకఁడెన్నఁడు మృషాభాషణములు

అన్న పుండరీకునికథ యందలి పద్యము.

బ్రాహ్మణాచారంబు పరిహాసకము సేయు

నగ్నిహోత్ర విధానమన్న నలుగు

అన్న గుణనిధికథ యందలి పద్యమూ క్రమోదాహరణాలు.

మొత్తముమీద శ్రవ్యకావ్యాలలోని నీతిబోధ కథ కావశ్యకంగా పాత్రలస్వభావశీల సంభావ్యతలకు అవిరుద్ధమైనమార్గంలో నడుస్తుంది ఇకదృశ్యకావ్యాలలోని సూక్తిఅత్యంతసంగ్రహరూపం పొంది కథాపోషకంగా, నాయకాది స్వభావ శీలోచితంగాఉంటుంది. కణ్వుడు శకుంతలను అత్తవారింటికి పంపేటప్పుడు సతీధర్మం ఉపదేశించటానికి అవకాశం ఉన్నది. కాని కణ్వుని మహర్షిత్వం, దృశ్యకావ్యత్వం పాటించి కవి యీ సందర్భంలో అత్యంత సంగ్రహంగా గంభీరంగా మహాతపస్విచేత ఇలా అనిపిస్తాడు.

శుశ్రూష స్వ గురూన్ కురు ప్రియసఖీ
వృత్తం సపత్నీజనే
భర్తుర్వి ప్రకృతాపి రోషణతయా మ స్మ
ప్రతీపంగమః
భూయిష్ఠం భవ దక్షిణాపరిజనే, భాగ్యే
ష్వనుత్సేకినీ
యాన్త్యేవం గృహిణీపదం యువతయో,
వామాఃకులాస్యాధయః

కవి నేరుగా నీతిబోధాచరణ తత్పరుడైనప్పుడు అతనిఉక్తి ఏదో ఒక అర్థాలంకారంతో మిళితమై ఉంటుంది. లేదా ఉజ్జ్వల భావాభివ్యంజకంగా ఉంటుంది. మొదటిదానికి వేమనపద్యాలు నిదర్శనం, తరుచుగా ఇవి దృష్టాంతసహితాలని విదితమే. ఇంక రెండవదానికి లక్ష్యాలు -

తరగల్ పిప్పలపత్త్రముల్ మెఱుఁగు
టద్దంబుల్ మరుద్దీపముల్
కరి కర్ణాంతము లెండమావుల తతుల్
ఖద్యోతకీట ప్రభల్
సురవీథీ లిఖితాక్షరంబు లసువుల్,
జ్యోత్స్నాపయః పిండముల్
సిరులందేల మదాంధులౌదురు జనుల్
శ్రీ కాళహస్తీశ్వరా!

ఈ పద్యమందలి రూపకాలు, విస్మయ భావమూ యీసూక్తిని శాస్త్రోక్తినుంచి వేరుచేస్తున్నవి

అంతా సంశయమే శరీరఘటనంబంతా
విచారంబె లో
నంతా దుఃఖపరంపరార్జితమె మేనంతా
భయభ్రాంతమే
యంతా నంతశరీరశోషణమె దుర్వ్యా
పారమే దేహికిన్

జితతన్నిన్నుదలంచి పొందరునరుల్
శ్రీ కాళహస్తీశ్వరా.

ఈ పద్యంలో అలంకారం లేదు. కాని యిందలి భావధ్వని, చిమ్మచీకటులు గ్రమ్మె లోకనిస్పృహ యీ వాక్కును కవిత్వం చేస్తున్నవి.

నీపైఁ గావ్యము చెప్పుచున్న యతఁడు
న్నీపద్యముల్ వ్రాసియి
మ్మాపారం బొనరింతునన్న యతఁడున్
మంజు ప్రబంధంబు ని
ష్ఠాపూర్తిం బరియింతునన్న యతఁడున్
సద్బాంధవుల్ గాక

అని యిలాగే రచయిత శేషంపూరించి ఉంటే యిది కావ్యేతరోక్తి అయ్యేది కాని-

ఛీ! పృష్టాగత బాంధవంబు నిజమా
శ్రీ కాళహస్తీశ్వరా...

అన్న సంజీవనితో కవి పద్యానికి ప్రాణం పోస్తున్నాడు. పరుసవేది సోకిన లోహంవలె పద్యమంతా పచ్చి బంగారమై పోయింది.

ఈరీతిగా కావ్యంలోని నీతిబోధ శాస్త్రం లోని నీతిబోధవలె కాక విలక్షణంగా ఉంటుంది. కవి ప్రతిభ అనంతం. దాని విలాసాలను బేరీజులేని లెక్కకట్టలేము. కొన్నిచోట్ల అది శాస్త్రవాక్యాలనే యథాతథంగా స్వీకరించి ప్రకరణతా కల్పన ద్వారా కావ్యత్వం పొందిస్తుంది. కొన్నిచోట్ల ఆ సూక్తులను పాత్రశీల మనస్తత్వవ్యంజకంగా వినియోగించి కవిత్వంగా మార్చివేస్తుంది. కొన్నిచోట్ల అనుపానాలతో మందులనువాడే వైద్యునివలె ఉపమానాది అలంకారాలతో రంగరించి నీతులను ఆస్వాద్యం చేస్తుంది. మరి కొన్నిచోట్ల అనిర్వచనీయ చమత్కారంతో మేళవిస్తుంది మరి కొన్నిచోట్ల భావ పరితప్తంచేసి నీతిని కరిగిపోస్తుంది. ఇలా కవితాప్రతిభ ఎన్నో విచిత్రదోహదాలు కల్పించి నీతిని చివురింపచేస్తుంది. అంతేకాని శాస్త్రమట్లు కావ్యం నేరుగా యుక్తాయుక్తంగా విధి నిషేధముఖాన నీతిని వెలార్చదు.

ఇంకొక్క విశేషం. ఉష్ణమండలమందలి పువ్వులు ప్రాయికంగా సుగంధబంధురాలు, సమశీతోష్ణ మండలమందలి పువ్వులు వర్ణ సంస్థానసుందరాలు అలాగే ధర్మగ్లాని యుగాలలో పుట్టిన కావ్యాలు హితోక్తి ప్రపూర్ణాలు, ధర్మ విశ్రాంతి యుగాలలో పుట్టిన కావ్యాలు రసమయాలు.

మనము - సంస్కృతము

శ్రీ "కౌటిల్యుడు"

సంస్కృత భాషనుగురించి వాదోపవాదములు వినిపించుచున్నవి. సంస్కృతభాష సజీవమైనదా? లేక నిర్జీవమైనదా? యని తర్కించబడుచున్నది. భాష యనునది నిర్జీవముకాదు; సజీవముకాదు ఒక్కొక్కభాష ఒక్కొక్క కాలములో ప్రత్యేక ప్రతిభాసంపన్నమై వికసించియుండును. ఇది యిలా యెందుకు వికసించి యుండునో తర్కించి నిర్ధారణ చేసికొనవచ్చును.

మనము భారతీయులము. భారతదేశమునకు ఒక సంప్రదాయమున్నది, ఒక సంస్కారమున్నది, ఒక సంస్కృతి యున్నది. వీటిని అర్థము చేసుకొనుటకు విద్యావికాసములనునవి యున్నవి. ఇవి యెలా తరచి తర్కించి వివేచించి అర్థము చేసికొనవలయునో దానిని సూచన చేయునది భాషయని మనమనుకొనుచుంటిమి. మనమనుకొనునది గ్రహించుటకు చదువను, వ్రాయను నేర్చుకొనుచుంటిమి

మనవేదములు సంస్కృతమున నున్నవి. మన రామాయణ, భారత, భాగవతములు సంస్కృతమున రచించబడి యున్నవి. మన నాట్య, నృత్య, చిత్ర, కళా రూప భావములు సంస్కృతమున ప్రకటింపబడియున్నవి ఒకటేమిటి? మన సకలశాస్త్రములు సంస్కృత భాషాభ్యాసమువల్లనే మనము తెలిసికొనవలసి యున్నది. కాని జైన, బౌద్ధకాలములలో సంస్కృత భాషాప్రాభవము తగ్గి తదితర భాషలు వ్యాప్తిచెందినటుల కనుపించుచున్నది. ప్రత్యేకముగా బుద్ధునికాలమున అంత యు పాళీభాషలోననే విలసిల్లినది బుద్ధునికాలమున సంస్కృతమునకు ఎందువల్లనో అనాదరణ కలిగినదని తెలియుచున్నది. అటులనే జైనులకాలమున, మహమ్మదీయుల కాలమున, బ్రిటీషువారి కాలమున, నేటి కాలమున సంస్కృతభాషపై అనాదరణ పెరిగియున్నది. ఎందుకు పెరిగినదో మనము చర్చించి తెలిసికొనవచ్చును.

భాషాభావములు అన్యోన్యాశ్రయములు. భారత జాతీయజీవనమున ఒక అగాధము యేర్పడి, బౌద్ధమతము భారతమున వ్యాప్తి గాంచినది. బౌద్ధ జైనమతములు భారతమతమునకు భిన్నములు. భారత సంప్రదాయమునకు భిన్నములు. భారత నాగరికతకు భిన్నములు. భారతసంస్కృతికి భిన్నములు. సంస్కృతభాషకు భిన్నములు. ఒకటేమిటి? భారతజీవిత విధానమునకే అవి ఒక ప్రత్యేక లక్షణములను కల్పించియున్నవి. ఇవి యిలా యెందుకు కల్పింపబడియున్నవో యెన్ని విధముల తర్కించినను మనకు బోధపడకనే యున్నది. మనతర్కబుద్ధికి, ఆత్మశక్తికి అతీతముగా నున్నది అయితే శంకరుడు వచ్చి పాళీ జైన భాషాప్రాభవముల ప్రాబల్యము తగ్గించి సంస్కృత భాషావ్యాప్తికి భారత జాతీయ జీవనధర్మమును పునరుద్ధరించ ప్రయత్నించినటుల కన్పించుచున్నది. భావవ్యాప్తి భాషావ్యాప్తి పరస్పరాశ్రయములని ఆదిశంకరుల భాష్యములే చెప్పకచెప్పుచున్నవి.

కాని మహమ్మదీయుల కాలమున, బ్రిటీషు వారి కాలమున, మన జాతీయ సంస్కృతీవికాసమునకు ప్రతీఘాతము జరిగినది. మనమతముపైన మమకారము తగ్గి, మహమ్మదీయ మతముపైన, మహమ్మదీయ భాషపైన, మహమ్మదీయసంస్కృతిపైన. మహమ్మదీయ నాగరికతపైన, క్రైస్తవమతముపైన, క్రైస్తవసంస్కృతిపైన, క్రైస్తవనాగరికతపైన క్రైస్తవభాషపైన వ్యామోహము పెరిగి మనకుమనమే అపచారము చేసికొనియుంటిమి. నేటికిని చేసికొనెదమని వాదోపవాదములు చేయుచుంటిమి.

భారతజాతీయ ధర్మముపై, భారతజాతీయ జీవనముపై ఆదరాభిమానములు భక్తివిశ్వాసములు కలిగినవారమని చెప్పిన యీ మధ్యకాల

ములోని వారందరూ అన్ని మతములు సమానమని, అన్నిభాషలు సమానమని, అందరమూ సమానమని చెప్పియే యుండిరి.

అన్ని మతములు సమానముకావు. అన్ని భాషలు సమానముకావు అన్ని సంస్కృతులు సమానముకావు. అన్ని నాగరికతలు సమానముకావు. అన్నికళలు సమానము కావు, అన్ని శాస్త్రములు సమానముకావు అన్నిపదార్థములు సమానముకావు అన్నిజీవులు సమానముకావు. అన్నియూ సమానముకావు అన్నిజీవనపద్ధతులు సమానముకావు.ఏది యేఅర్హత కలిగియున్నదో ఏది యేశక్తి కలిగియున్నదో, ఏది యేగుణము కలిగియున్నదో, ఏది యే స్వరూపము కలిగియున్నదో, ఏది యే విధమున దర్శన మిచ్చుచున్నదో అది అది అవునేకాని వేరొకటికాదనీ, అది అదే అవునని ఎవరు గుర్తించెదరో వారికి దాని మూలస్వరూప స్వభావములు బోధపడి, దానిని దానినిగానే యెరింగి, దానిని దానినిగానే గుర్తించి, దానిని దానినిగానే తెలిసికొని, దానిని దానినిగానే భావించి దేని అర్హతలు దానివేనని రుజుమార్గమున తెలియజేయుటకు సమభావముతో సరిచూచి ఆయా విలువలను నిర్ణయించెదరు ఆయా విలువలను నిర్ణయించుటకు ఏయే ప్రమాణములను వ్యవహార ధర్మములుగా మనము యేర్పరచుకొని యుంటిమో ఆయా ధర్మములను పాటించక అందరమూ తాత్త్వికదృష్టి శిలవారమైన విధమున వాటివాటి విలువలను నిర్ణయించ ప్రయత్నించి విఫలమనోరథులమై నేటి యీ స్థితికి పాల్పడి యుంటిమి.

భాష ప్రధానమా? భావము ప్రధానమా? విద్య ప్రధానమా? వివేకము ప్రధానమా? మతము ప్రధానమా? మనసు ప్రధానమా? బుద్ధి ప్రధానమా? జ్ఞానము ప్రధానమా? ఆత్మ ప్రధానమా? పరమాత్మ ప్రధానమా? దేశము ప్రధానమా? దేవుడు ప్రధానమా? ఈ మొదలైన ప్రశ్నలు యెప్పటికప్పుడు యేర్పడి హేతువాద మీమాంసలతో సమాధానము చెప్పుకొన ప్రయత్నించి మనము తెలిసికొనజాలని విషయములను తెలిసికొనగలమని ప్రయత్నించి ఫలించక పరాభవముపొంది పరితప్త హృదయులమై చింతించుచుంటిమి. మన చింతనకు తుది మొదలుతెలియదు. మనము భాషాస్వరూపమును, భావస్వరూపమును వివేచన చేసి ప్రమాణబుద్ధికి తెలియగల విధమున నిరూపించుటకు ప్రయత్నముకూడ చేయుట లేదు. మనము యే భాషను గౌరవించలేము యేభావమును గౌరవించలేము. మనకు మనమేకాము ప్రపంచమంతయును మనమే అన్నియూ సమానమే అందరూ సమానమే సమానముకానివి యీ లోకమున లేనేలేవు ఇంక యీ వాదములెందుకు? ఈ చర్చలెందుకు? ఇవి యెవరిని యెంతవరకు బాగుచేయును? ఎవరికి ఎంతవరకు తోడ్పడును? ఎవరికి ఎంతవరకు లాభించును?

నేటికాలమున, అనగా యీకాలమున,అంటే యిప్పుడు, సంస్కృత భాషపైన మమకారము వెల్లడించువారు, సంస్కృతభాషను సమర్థించి వ్రాయువారు, యింగ్లీషులో విదేశీయులు చెప్పిన అభిప్రాయములను ఉదాహరించి సంస్కృతిభాషను ప్రశంసించి సమర్ధించుకోవలసిన స్థితికి దిగజారియున్నారు.ఇది భాషపై మమకారమో, భావముపై మమకారమో, సంప్రదాయముపై మమకారమో, జీవనవిధానముపై మమకారమో, జీవితలక్ష్యముపై మమకారమో, జీవనముపై మమకారమో, జీవనధర్మముపై మమకారమో, విద్యపై మమకారమో, విద్వత్తుపై మమకారమో విజ్ఞతపై మమకారమో మరి దేనిపై మమకారమో తెలియదుకాని సంస్కృత భాషయనిన జాలిని కనబరచుచున్నారు. వీరికి మతమన్న కంపరము దైవమన్న నిరసనము. కుటుంబపద్ధతులన్న కలవరము కుటుంబ వ్యవహారములన్న కోపము తాపము ఎవరికిని ఉత్తమాదర్శమను భావము ఉండనక్కరలేదు. ఇదియే సంఘజీవనము ఇదియే మనసాంఘిక విధానము ఇదియే మన న్యాయశాస్త్ర సమ్మతము ఇందుకు మన

జీవితవిధానముతో సంబంధములేదు. ఇందుకు మన సంప్రదాయముతో సంబంధములేదు ఇందుకు మన సంస్కృతితో పొత్తులేదు. మన భావములను పరభావములను వేరుచేయని విధమున మన ప్రవర్తనను రూపొందించి మన కన్నియూ సమానములే నని నిత్యము బోధించు వారే ఏది హితమైనది ఏదిఅహితమైనది యెలా నిరూపించగలరో! ఏది మంచిని కలిగించునో ఏది చెడును కలిగించునో యెలా తెలియజెప్ప గలరో! పైకి చెప్పునది యొకటి లోపల అనుకొనునది యింకొకటి. లోలోపల మనము చేయునది వేరొకటి అనునదియొకటి ఆచరించునది యింకొకటి. ఇదియే నేటి జీవితవిధానము ఈ విధానమును ఆచరించి, ఆశ్రయించి నిత్యము పొట్టపోసికొని యెటులనో బ్రతుకును వెళ్లబుచ్చుట ఒక్కటే ఉత్తమ జీవితప్రమాణముగానెంచబడుచున్న కాలములో భారత సంస్కృతికి, భారత సంస్కృతభాషకు సజీవ సద్భావ ప్రకటనార్హతలు యెక్కడనుండి వచ్చును? ఆత్మోన్నత్యముకాని, ఆత్మానందము కాని ఆత్మవికాసముకాని లేని యీకాలమున వాక్శుద్ధిగాని వాక్పటిమగాని, లేని యీకాలమున వాగమృతవిలసితమైన సంస్కృతభాషా సంపన్నతలు యెచటనుండి వెలువడును? జీవితమునకు శీలప్రమాణములేని యీ కాలమున ఇవి యవి లేవని వాపోవుటకన్న సిగ్గుమాలిన కార్యమింకొకటి యుండదు.

మనమే అన్నింటికి కర్తలమని యనుకొను కాలమున సంస్కృత భాషయొక్క ప్రయోజన మేమున్నది? యని ప్రశ్నించుకొనువారికి సమాధానము చెప్పగలమా?

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల
10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు,
వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా
బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు : *నవభారతి*

చీకటి - వెలుగులు

శ్రీ జూలూరి హనుమంతరావు

అది నిరుపేదగుండె దిగులా నలుమూలల నావరించి యా
పదలకు పుట్టినిల్లయిన భాతి ప్రపంచ హృదంతరమ్ములో
వదలిన భానుభాగ్యకర పంక్తుల జాలులుగట్టి అంగముల్
విదలిచి భీతిదమ్మయి స్రవించె తమోనది పొంగులెత్తుచున్.

అది నిశాభామినీ హృదయ వాసంతికా
        సౌరభమ్మయి జగచ్చరితమౌచు
అది కాళరాత్రి దుర్మద ఘోర వికటాట్ట
        హాసమ్ములోని వికాసమౌచు
అది యామినీనాథ హావభావ ప్రతీ
        త జ్యోత్స్నలోని చైతన్యమౌచు
అది త్రియామాభావ విదిత కౌటిల్య సం
        పదలగాచెడి పాప పటలమౌచు

సుహృదమై భయదంబునై సుందరంబు
నై కుటిలమై యనంత విశ్వాత్మలోని
జడము నిర్జడమునయి సౌజన్యవైర
భావముల సృష్టితానయి ప్రబలె తమము.

జడముల్ సేతనమొందు నాధునిక విజ్ఞానంబు పెంపొందు నీ
పుడమిన్ జూచెడునాసతో నభము సమ్మోదమ్ముతో పొంగి యే
ర్పడగా దట్టపు గారు చీకటులు తెప్పల్ వాల్పకేచూచుఁ దా
నొడ లెల్ల న్వికసింపఁ జేసికొని విద్యుత్తారకా నేత్రముల్.

ఓసీ తిమిరమ! నీ సహవాసము లేకున్న తెల్లవారునె! జగతీ
హాసముకొఱకై నీలో వాసించు వెలుంగులెంత పరిణతమతివే!

చండ ప్రచండాంశు మండలమ్మును మంచు
        ముద్దగా పొట్టలో ముడిచికొనును
సకల ప్రపంచమ్ము నొక ముద్దుబిడ్డగా
        నిదురపోయెడు వేళ నెనరుజూపు

తన ప్రశాంతత నింపికొనిన గుండియవిప్పి
చంద్రమః కళల విస్తరణ సేయు
నొకచోటకాదు వేఱొక చోటనైన ఎ
ల్లెడల తానేయౌచు నెనయుచుండు

కాల గర్భంబుగ ప్రకృతి కాంతగా అనంత తేజోనిగూఢ విన్యాసవతిగ
కృష్ణలీలాత్మగా తగు రీతి మారి తన యలౌకిక మహిమచూపును తమమ్ము.

తనలో కల్మషమేమి దాచికొనెనో దానిన్ విసర్జించుచున్
దనకుందానె, పరోపకారవతియై దాతృత్వ మేపార శో
ణనమౌ స్వీయనిగూఢ విజ్ఞతను పర్వంబౌనటుల్ నిండు చం
ద్రుని హాసోజ్జ్వల కాంతిగా నిడు తమస్తోమమ్ము చిద్రూపమై.

హృదయ ముప్పొంగగా రేగ నంబుధికి సం
బరము లాకసమంటః బడచి పడచి
కటిక చీకటిగుండె దిటవును సడలించి
వెలుగు వెల్లువలోన నిలిపి నిలిపి
చవులూర కనులువిచ్చని పూల మేల్కొల్పి
బ్రతుకు వెన్నెలపాట పాడిపాడి
చెలువార ప్రకృతి పెంచిన అందములకు వం
పులుదీర ప్రాణముల్ పోసిపోసి

సకలజీవ ప్రశాంత విస్తారసీమ
పుడమి యొడలెల్ల వెన్నెలపూతగాగ
నిండు జాబిల్లి చందాలు నింపికొన్న
శ్వేతకిరణ ప్రసారమ్ము చెలగునదియె.

అల దివినిభువి గలిపి యలరుచందురు హాస
ముల కిరణముల తతులు నిండెన్
వెలుగులను నెఱపి తమసులకు చెలువులగఱపి
కల బ్రతుకు విలువలను తెలిపెన్.

కలువలకు చలువలిడి వలపులను కలుములిడి తళతళ మెఱసి పయనించెన్
జలజలల సెలయేటి యలలలో పరుగులిడి మిలమిలల వెలుగు కలిగించెన్.

పువ్వుల హృదయములందు మధుకణములను నిలిపి
చవ్రుల రచింయించి పులకించెన్
కవలుగా కువకువల ముదముతో తిరుగు జ
క్కవల కమృతము చిలకరించెన్,

జగము పులకింప సొంపౌలయ తెలిజిలుగులను
అగణితముగా పఱచుచుండెన్
పగలు విడనాడి శాంతముగ జనహృదయములు
మిగుల సుకముల మునుగుచుండెన్.

STATEMENT ABOUT OWNERSHIP & OTHER PARTICULARS ABOUT

NAVA-BHARATHI

A Literary & Cultural Telugu Monthly

FormIV.(See Rule 8). The Registration of News-Papers(Central)Rules,1956

1. Place of publication	:	Gandhinagar, Vijayawada-2
2. Periodicity of its Publication	·	First week of Every month
3. Printer's Name		Sri J Radhakrishna Reddy
Nationality Indian.	·	Address Vijayawada
4. Publisher's name	.	Sri J. Radhakrishna Reddy
Nationality Indian.		Address Vijayawada.
5. Editor's Name	·	Sri J. Radhakrishna Reddy
Nationality Indian		Address Vijayawada

6. Names and Addresses of Individuals who own the News-Paper and Partners or Share - holders, holding more than one per-cent of the total capital ·

Names ·	*Addresses:*
SRI CHADALAVADA PITCHAYYA.	VIJAYAWADA
SRI J. RADHAKRISHNA REDDY.	VIJAYAWADA.

I, J. Radhakrishna Reddy, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1—3—'60

J. RADHAKRISHNA REDDY
Signature of publisher.

యథార్థము - అయథార్థము

బెర్ ట్రండ్ రసెల్

అనువాదం జి. ఎస్. ఎన్.

౧౨

సత్యములను గూర్చిన జ్ఞానము మనకు కలుగవలెననిన, అసత్యములనుగూర్చి మనకు కొంత తెలియవలసిన యావశ్యకత గలదు. కాని వస్తుజ్ఞానము విషయమై యట్లుగాదు. వస్తువులకు సంబంధించినంత వఱకు, మనకు యథార్థజ్ఞానము కలుగవచ్చును. కలుగక పోవచ్చును కాని మనకు నెట్ట యెదుట నున్న వస్తువును గూర్చి మనకుగల్గిన యనుభవమునకు మనదృష్టిని పరిమితమొనరించు నంతవఱకు, ఇది అయథార్థజ్ఞానమని మనము గట్టిగా చెప్పదగిన జ్ఞానమేమియు నున్నట్టు కన్పింపదు. తత్కాలమున మనకు ప్రత్యక్షముగ ననుభూతిని గలిగించినదేదియైనను, అది మొత్తముమీద నేదో యొక వస్తువై యుండవలెననుటలో విప్రతిపత్తి లేదు. మనకు అప్పుడు కలిగిన ప్రత్యక్షానుభవమును బట్టి యనుమితులను సిద్ధాంతీకరించుటలో పొరపాటు జరుగవచ్చును. కాని యప్పుడు మనకు గలిగిన యనుభవమును కాదనుట కెవ్వనికిని తరముగాదు. కాని విషయమై రెండవమాట చెప్పుటకే వీలు లేదు. కాని ఆ యనుభవములను గూర్చి మనకు గల్గిన జ్ఞానము విషయమై రెండవ మాట చెప్పుట కెప్పుడు నవకాశము గలదు మనము యథార్థ విషయములను నమ్మవచ్చును అట్లే అయథార్థ విషయములను గూడ మనము నమ్మవచ్చును. అనేక విషయములపై అనేకులకు విభిన్నములైన యభిప్రాయము లుండవచ్చును. కావున నా విశ్వాసములలో ననేకములు భ్రమమూలకములై యుండవచ్చును. కాని యథార్థములైన వానిని లోకులెంత దృఢముగ విశ్వసించుచున్నారో. అయథార్థములైన వానిని గూడ నంత దృఢముగ విశ్వసించుచున్నారు. అందుచే, మనకు గల విశ్వాసములలో నేవి యథార్థములు. నేవి యయథార్థములన్న విషయమై వివేచనము చేయుట దుష్కరము. ఒక ప్రత్యేక సందర్భములో మనకు గల విశ్వాసము అయథార్థము కాదని యెట్లు చెప్పగలము? ఇది చాల క్లిష్టమైన విషయము.

దీనికి తృప్తికరమగు సమాధానము లభించుట దుర్లభము దీనికి ప్రాతిపదికగా నంతకంటె తక్కువ క్లిష్టమైన సమస్య యొకటి గలదు. అది యిది. యథార్థమనగానేమి? అయథార్థమనగా నేమి? ఈ యధ్యాయమున మనము విచారింపవలసిన సమస్య యిదియే.

ఈ యధ్యాయమున ఒక విశ్వాసము యథార్థమగునా కాదా యన్న విషయము మనకెట్లు తెలియునన్న విషయము గాదు మనము చర్చింపవలసినది. మరి ఒక విశ్వాసము యథార్థము ఇంకొకటి కాదు అనుటలో నర్థమేమను సంగతియే ప్రస్తుతము చర్చింపవలసినది. ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానము లభించినచో, నే విశ్వాసములు యథార్థము లనుదానికి సమాధానము వచ్చినట్లే కాని ప్రస్తుతము యథార్థమనగా నేమి, అయథార్థమనగా నేమి? అను సమస్య విషయమై విచారింతము. మరి ఏ విశ్వాసములు యథార్థములు? ఏవి తద్వ్యతిరేకములు? అను సమస్యకాదు విచారణీయము. ఏది ఎట్లున్నను, ఈ సమస్యలను విడివిడిగా విచారణము చేయుట మంచిది లేనిచో తికమక యేర్పడి; వేనికిని అన్వయింపని సమాధానము వచ్చుట కద్దు.

సత్యము స్వరూప స్వభావములను తెలిసికొనుటకు ప్రయత్నించునపుడు మూడు విషయములు స్పష్టమగును. సత్యమునుగూర్చిన సిద్ధాంతమునకు పై మూడు విషయముల యావశ్యకత యెక్కువగా గలదు

1. సత్యమును గూర్చి (యథార్థమైన దానిని గూర్చి)న సిద్ధాంతమున దానికి ప్రతియోగి యగు నసత్యమునకు గూడ తగిన స్థానము నీయవలెను అనేక తత్త్వవేత్తలు ఈ నియమమును తృప్తికరముగా పాలింపలేకపోయిరి. వారు నిర్మించిన సత్య సిద్ధాంతములలో- నసత్యమునకు స్థానము లేకుండ జేసిరి. ఈ విషయమున, విశ్వాసమును గూర్చిన మన సిద్ధాంతము, ప్రత్యక్షానుభవమునకు సంబంధించిన మన సిద్ధాంతమునకు పూర్తిగా విభిన్నమై యుండవలెను. ఏలన ప్రత్యక్షానుభవ విషయములో, ఎట్టి ప్రతియోగిని పరామర్శింప నావశ్యకత లేకుండెను.

అసలు విశ్వాసము లనునవియే లేకపోయినచో నీ విశ్వాసములు యథార్థములు, ఇవి యయథార్థములు అని చెప్పుట కవకాశమెక్కడ ? ఏలన యథార్థములగు విశ్వాసములకు నయథార్థములగు వానికి గల యవినాభావ సంబంధమును కాదనుటకు వీలు లేదుగదా. కేవలము ద్రవ్యముచే వ్యాప్తినొందిన జగత్తునే మన మనోనేత్రమున రూపొందించుకొన్నచో, నట్టి ప్రపంచమున నయథార్థతకు నెట్టి తావును లేకుండ బోయెడిది. అట్టి ప్రపంచమున కొన్ని సంగతులకు(జరిగిన సంఘటనలు లేక ఉన్నది ఉన్నట్లుగా తెలియుటకు వీలైన విషయములు) నవకాశమున్నను, అందు యథార్థతకు తావులేదు ఏలన యథార్థత యేజాతికి చెందినదో అయథార్థతగూడ నదేజాతికి జెందినదై యున్నది. వాస్తవమునకీ సత్యాసత్యములు విశ్వాసములకును, వాక్యములకును సంబంధించిన లక్షణములై యున్నవి. కావున ద్రవ్యమయమగు ప్రపంచమున విశ్వాసములకు గాని ప్రకటనలకు గాని తావులేనందున దానిలో సత్యాసత్యములకు రెండింటికిని అవకాశము లేదు

కాని ఇంతకు పూర్వము మనము చెప్పియున్నదానికి విరుద్ధముగా ఒక విశ్వాసములోని సత్యాసత్యములు ఆవిశ్వాసమునకు వెలియైయున్న వేఱొక విషయముపై నాధారపడియుండును. 1వ ఛార్లెస్ వధ్యశిలపై మరణించెనన్న సంగతిని నేను విశ్వసించినచో, నేనా విశ్వాసమును యథార్థముగనే విశ్వసింతును అందుకుగల కారణము నా విశ్వాసములోని గాఢత్వముకాదు. కొంత పరిశీలన యొనర్చినచో దాని సంగతి తేలును. మఱి రెండున్నర శతాబ్దముల క్రిందట జరిగిన యొక చారిత్రకమగు సంఘటన. 1వ ఛార్లెస్ శయ్యపై మరణించెనని నేను విశ్వసించుచో, నందు యథార్థతకు నెట్టి యవకాశమును లేదు నా యీ విశ్వాసము నెంత తర్కించి సిద్ధాంతీకరించుకొనినను' ఎంత స్పష్టముగా నా విశ్వాసమేర్పడినను' ఆ విశ్వాసము యథార్థమని చెప్ప వీలులేదు. కావున, సత్యాసత్యము లనునవి విశ్వాసములకు సంబంధించిన ధర్మములైనను, అవి విశ్వాసములకును తదితరములగు బాహ్య సంఘటనలకును గల సంబంధములపై నాధారపడియున్న ధర్మములేగాని కేవల విశ్వాసములోని గాఢత్వా గాఢత్వములను బట్టికాదు

సత్యమనునది విశ్వాసమునకును, వస్తుస్థితికిని నడుమగల యానుగుణ్యములో వ్యక్తమగునను నభిప్రాయమునకే- తత్త్వవేత్తలలో సర్వ సాధారణమగు నభిప్రాయమునకే - ఈ పైవాదము త్రోవదీయుచున్నది. అసలు విశ్వాసమునకు వస్తుస్థితికి యానుగుణ్యమును తేలికగా సాధింపలేము. ఒకవేళ శ్రమపడి కొంత యానుగుణ్యమును సాధించినను, దానికి విప్రతిపత్తులు లేకపోలేదు సత్యమనునది ఆలోచనకు వెలుపలగా నున్నదానికి సంబంధించిన సంఘటనము

నకు ననుగుణముగా నుండుటలోనే, దాని మనుగడ వ్యక్తమైనచో, సత్యమెప్పుడు వెలువడినది ఆలోచనకు నందదు. విశ్వాస మునకు బాహ్యమై యొప్పు సంఘటనతో సంబంధింపని విధముగా నీ సత్యమును అనేక తత్త్వచింతకులు నిర్వచింపవలసి వచ్చి నది. సత్యమనునది సందర్భశుద్ధిపై నాధార పడి యున్నదను వాదమే యిట్టి ప్రయత్న మునకు సద్యఃఫలము విశ్వాసములలో సందర్భశుద్ధి లేకపోవుటయే యథార్థతకు చిహ్నమని నేడనుకొనుచున్నారు స్వవచో వ్యాఘాతములేని దానికే సత్యమని చెప్పు చున్నారు.

ఇట్లనుకొనుటలో పెద్దచిక్కు గన్పించు చున్నది. పరస్పరమును విరోధింపని విశ్వాస పరంపర ఒక్కటే యుండునని చెప్పుటకుప పత్తియేమియును లేదు ఒక నవలా రచ యిత అందులోని పాత్రకు విలక్షణమైన గత చరిత్రను కల్పింపవచ్చును. కాని వాని అసలు గత చరిత్ర అందుకు విభిన్నమై యుండనచ్చును. పరస్పరము విరుద్ధముగా లేని లక్షణము రెండింటిలో నుండవచ్చును. గణితశాస్త్రమున పరస్పర విరోధములేని హేతుపద్ధతు లనేకము లుండవచ్చును.

అట్లే తత్త్వశాస్త్రమున రెండు వేర్వేరు వాదములు సమానముగనే కొన్ని విషయ ములను నిరూపించు నవకాశము గలదు. ఈ జీవితమంతయు నొక పెద్ద స్వప్న మనియు, బాహ్యప్రపంచము కు స్వప్నము లోని వస్తువులకు మించిన యథార్థతలేద నియు ననువాదమొకటి కలదు. ఇది మనకు తెలిసిన విషయములకు విరోధము లేకుండ సత్యమని నిరూపించుట కవకాశము కలదు. కాని ప్రపంచములోని వస్తువుల కస్తిత్వము గలదు. అవి యథార్థములన్న వాదము గూడ గలదు. కాని ఈ రెండవవాదమే మనకు నచ్చును. కాబట్టి పరస్పరవిరోధము లేని విశ్వాసపరంపర యొక్కటే యుండు నని చెప్పుటకు వీలులేదు.

సత్యమనగానేమో నిర్వచింపబూనుకొను నపు డింకొక యవరోధమేర్పడును. అది యిది. అట్టి నిర్వచనము సందర్భశుద్ధి యన నేమో అర్థమైనట్లే యెంచును. కాని యీ సందర్భశుద్ధి యనునది విరోధసూత్రముపై నాధారపడియున్నది. రెండు హేతువాక్య ములు యథార్థములైనప్పుడా రెండింటికిని సందర్భశుద్ధి యుండును. ఆ రెండింటిలో నొకటి యయథార్థమైనపుడు వానికి సందర్భ శుద్ధి లోపించును రెండు హేతువాక్యములు యథార్థములగునా కాదాయని తెలిసికొన వలెనన్న, విరోధసూత్రము వంటి సత్యముల నవగతము చేసికొనవలెను ఉదాహరణకు ఈ వృక్షము రసాలవృక్షము, ఈ వృక్షము రసాలవృక్షము కాదు, అను నీ రెండు వాక్యములును విరోధసూత్రము ననుసరించి సందర్భశుద్ధితో గూడిన వాక్యములు గావు. కాని ఈ విరోధసూత్రమునే ఈప్రమాణము ననుసరించి పరీక్షకు బెట్టినచో నది నిలువ బడుట కవకాశము లేదు. మనమా విరోధ సూత్రమునే అయథార్థమని త్రోసిపుచ్చితి మేని, ఒక వాక్యమునకు వేఱొక వాక్యము నకు సందర్భశుద్ధి లేకపోవుట యనునది యుండనే యుండదు. కావున నీ సందర్భ శుద్ధి యన్వయించుటకు తగిన క్షేత్రమును హేతుశాస్త్ర నియమములే సమకూర్చును. మరి యీసూత్రములు వైపరీత్యమునకు నిలువవు.

పై రెండు కారణములను బట్టి, సందర్భ శుద్ధి సత్యమనగానేమో నిర్వచించుటకు సాహాయ్యకారిగాదు: మరి ఇది సత్యమగునా కాదా యని నిశ్చయించుటకొక ప్రమా ణమే సందర్భశుద్ధియని గ్రహింపనగును.

కావున సత్యమనగానేమో నిర్వచించు టకు వస్తుస్థితిలో విశ్వాసమునకు గల యాను గుణ్యమే యావశ్యకమని మనము సిద్ధీక రింప వచ్చును. అసలు మన విశ్వాసము యథార్థము కావలయునన్న ఆయానుగుణ్యా

మెంతవర కావశ్యకమోగూడ తెలిసికొన వలయును.

ప్రస్తుతము ముందువిషయములు మనము జ్ఞప్తిలో నుంచుకొనవలెను. సత్యమనగా నేమో అవగతము చేసికొనవలెనన్న అందుకు ప్రతియోగియగు నసత్యమునకు గూడ దాని నిర్వచనమున స్థానముండవలెను. అదికొన్ని విశ్వాసములపైనను, వానిని వ్యక్తపఱచు వాక్యములపైనను ఆధారపడియుండును. విశ్వాసమునకు దానికి నతిరిక్తమగు భావ సంఘటనకును గల సంబంధముపై నాధార పడి యున్నది

సత్య నిర్వచనమున నసత్యమునకుగూడ స్థానమును కల్పింపవలసిన యావశ్యకత యేర్పడుటచే విశ్వాసమనగా విశ్వసించు వాని మనస్సునకును విశ్వసింపబడునదిగా చెప్పుటకు వీలైన ఒకానొక విషయమున కును నడుమగల సంబంధమని భావించుట సాధ్యముకాదు. విశ్వాసమనుదాని నావిధ ముగా భావించినచో, నది కేవలము యథా ర్థమైనదే యగును. అందు అయథార్థత కొకింతగూడ నవకాశముండదు దీనిని కొన్ని యుదాహరణములను బట్టి గ్రహింప వచ్చును డెస్డెమోనా, ఒథెల్లో యెడల నను రక్తురాలై యున్నదని ఒథెల్లోవిశ్వసించును. ఈ విశ్వాసము కాసియో యెడల డెస్టె మోనాకుగల యనురాగమును నొకప్రత్యేక విషయమునకు పంబంధించియుండుటలోనే సంపూర్ణాభివ్యక్తి గాంచుచున్నదని మనము చెప్పలేము అట్టి విషయమొకటి జరిగి యున్నచో నా విశ్వాసము యథార్థమై యుండెడిది కాని అట్టి విషయమున కాధా రము మొదలేలేదు. కావున ఒథెల్లోకును. ఆ సంగతికిని సంబంధమేమియును లేదు. కావున నీవిషయముతో సంబంధించియుండు టలో నాతని విశ్వాసమున కస్తిత్వములేదు.

(సశేషము)

ఉపనిషద్వాక్యములు

శ్రీ ధూళిపాళ రామచంద్రశాస్త్రి

ఇతీమా మహాసగ్ంహితాః

ఈ వాక్యము మొదలుకొని సంహితావయవము లను ఉపసంహరించు గ్రంథము ప్రవృత్తమైనది.

య ఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా
వేద । సంధీయతే ప్రజయాపశుభిః । బ్ర
హ్మవర్చ సేనాన్నాద్యేనసువర్గేణలోకేన

ఏ పురుషుడు ఈ విధముగ ఉపాసనము చేయు చున్నాడో ఆ పురుషుడు ప్రజాపశు సమృద్ధి, బ్రహ్మ వర్చసము, అన్నాద్యము, సువర్ణలోకము మున్నగు మహాఫలములను బొందునని భావము

మూ॥ (1) యశ్ఛంద సామృషభో విశ్వరూపః
(2) ఛందోఽభ్యోఽభ్య మృతాత్సం బభూవ
(3) సమేంద్రోమేధ యాస్పృణోతు
(4) అమృతస్య దేవధారణో భూయాసమ్

మూడవ అనువాకమున ప్రజాది ఫలసిద్ధికొరకు సంహితోపాసనము చెప్పబడినది అచట బ్రహ్మ జ్ఞాన సాధనమగు చిత్తైకాగ్రతగూఢ తాత్పర్యబలము వలన ఆవశ్యకమని తేలుచున్నది మేధారహితునికి శృత గ్రంథార్థమున విస్మృతి కలుగును విస్మృతి కలవానికి బ్రహ్మజ్ఞాన ముదయించదు మరియు రోగాదులవలన శరీరారోగ్యము లేనివానికిని, అశనా చ్ఛాదనాదిరహితునికిని, బ్రహ్మజ్ఞాన కారణములగు శ్రవణాదులయందు ప్రవృత్తి సంభవించదు కావున మేధాసిద్ధికి కారణములగు మంత్రములు ఈ నాల్గవ అనువాకమున ప్రతిపాదింపబడు చున్నవి. అందు మేధాకామునిచే అవశ్యము జప్యమగు మంత్రము లిందు ఉదహరింపబడు చున్నవి

(1) యశ్ఛంద సామృషభో విశ్వరూపః.

ఏ ప్రణవము గాయత్ర్యాదిఛందో యుక్తములగు వేదముల మధ్యన శ్రేష్ఠమైనదో యని భావము గను కనే కఠవల్లి యందీవిధముగా చెప్పబడినది

"సర్వే వేదా యత్పదమామనంతి- అని ఉపక్ర మించి- "తత్తేపదం సంగ్రహేణబ్రవీమ్యోమిత్యే తత్" అని ఆప్రణవము విశ్వరూపః సర్వజగదాత్మ కము

(2) ఛందోభ్యోఽధ్య మృతాత్సంబభూవ

ఆ ప్రణవము వేదములవలన అధికసారరూపమై ప్రజాపతి వలన బాగుగా ఆవిర్భవించెను ఈ యావి ర్భావమునకు నిమిత్తము, అమృతాత్ అను పదము వలన సూచితమైనది. మరణరహితము, మోక్షరూప మగు అమృతమే ఓంకార ప్రాదుర్భావమున నిమి త్తము

(3) సమేంద్రోమేధ యాస్పృణోతు

ప్రణవ వాచ్యమగు ఆ పరమేశ్వరుడు గ్రంథ తదర్థావధారణ రూపమగు మేధాసంపత్తిచే విద్యార్థి స్థితిని బొందియున్న నన్ను సంతోషము నొందించు గాక యని భావము

(4) అమృతస్య దేవధారణో భూయాసమ్

ప్రణవ ప్రతిపాద్యమగు ఓ పరమేశ్వరుడా! నీ యనుగ్రహము వలన మోక్షోపలక్షితమగు ముక్తి హేతువగు గ్రంథమును తదర్థమును ధారణచేయు సామర్థ్యము కలవాడనగుదునని భావము

చందాదారులకు వినతి

"నవభారతి" పత్రికకు అన్నివిధాలా సహాయ, సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియజేస్తున్నాము.

ఇం కూ తమ చందాలను పంపటం పడనివారు, వెంటనే తమ చందాసొమ్మును పంపి, యథాతథంగా తమ సహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

మేనేజరు, నవభారతి

ఆంధ్రతర్కసంగ్రహదీపిక

శ్రీ కుప్పా బైరాగిశాస్త్రి

3

మూ॥ లక్ష్యైకశేశావృత్తిత్వమవ్యాప్తిః
యథాగోః కపిలత్వం॥

ముందు దూషణత్రయ రహితమైన ధర్మమును లక్షణముగా చెప్పదలచి మొదట దూషణత్రయమును చెప్పుచున్నాడు మూడు దూషణములలో మొదటి దూషణము అవ్యాప్తి. అవ్యాప్తి అనగా ఒకానొక లక్ష్యమందు అనగా లక్ష్యతావచ్ఛేదమునకు ఆశ్రయమైన ఒకదాని యందు లక్షణము ఉండకపోవుట. ఆవుకు కపిలరూపము కలిగియుండుట లక్షణముగా చెప్పిన తెల్ల ఆవుయందు కపిలరూపము లేదు గాన అవ్యాప్తి. లక్ష్యము ఆవు, లక్షణము కపిల రూపము. లక్ష్యతావచ్ఛేదము ఆవుయందలి జాతి విశేషము. దానిని సంస్కృతములో గోత్వం అని అందురు. ఆ గోత్వమునకు అన్నిగోవులు (ఆవులు) ఆశ్రయములు. అన్ని గోవులయందు గోత్వ రూపజాతి కలదు లక్ష్యతావచ్ఛేదకమైన గోత్వమునకు ఆశ్రయమైన ఒకటి అనగా తెల్ల ఆవుగూడా కావచ్చును. దానియందు కపిల రూపములేదు. గాన ఒకానొక లక్ష్యమందు కపిలరూపము లేకపోవుట అను అవ్యాప్తి వచ్చినది. గోవునకు లక్షణముగా చెప్పిన కపిల రూపమందు అవ్యాప్తి రూపదోషము పట్టినది. అవ్యాప్తి స్వరూపము ఏమన లక్ష్యతావచ్ఛేదకము ఉన్న కొన్నిచోట్ల ఉండి, లక్ష్యతావచ్ఛేదకము ఉన్న కొన్నిచోట్ల ఉండకపోవుట (లక్ష్యతావచ్ఛేదక సమానాధికరణత్వేసతి. లక్ష్యతావచ్ఛేదక సమానాధికరణాభావ ప్రతియోగిత్వం.)లక్ష్యము ఏరూపముతో ఉండునో ఆరూపము లక్ష్యతావచ్ఛేదకము, లక్ష్యమైన గోవు గోత్వరూపముతో ఉండును గాన లక్ష్యతావచ్ఛేదకము గోత్వము, గోత్వము ఉన్న కొన్నిచోట్లు అనగా కపిలగోవులు. అక్కడ కపిలరూపము ఉన్నది. అటులనే లక్ష్యతావచ్ఛేదకమైన గోత్వము ఉన్న కొన్నిచోట్ల తెల్లని గోవులు, అచ్చట కపిలరూపములేదు. అనగా అచ్చట ఉన్న అభావము, కపిల రూపాభావము. ఆ అభావమునకు ప్రతియోగియు కపిలరూపమైనది.

మూ॥ అలక్ష్యే లక్షణస్య సత్యం అతివ్యాప్తిః
యథాగోః శృంగిత్వం.

లక్ష్యము కానివాని యందుగూడా లక్షణము ఉండుట. శృంగిత్వమనగా కొమ్ములు కలిగి యుండుట. కొమ్ములు కలిగియుండుట గోవు (ఆవు) కాని మహిషము (దున్నపోతు)యందు గూడా ఉన్నది. లక్ష్యతావచ్ఛేదక సమానాధికరణత్వేసతి, లక్ష్యతావచ్ఛేనకా వచ్ఛిన్న భేద సామానాధికరణ్యం అతివ్యాప్తిః॥ లక్ష్యతావచ్ఛేదకము ఉన్నచోట ఉంటూ లక్ష్యము కానటువంటివాట్లయందును ఉండుట. లక్ష్యతావచ్ఛేదకావచ్ఛిన్నభేదమనగా లక్ష్యముకాదు అనుభేదము. (గౌఃన ఇత్యాకారక ప్రతీతిసిద్ధభేదః) గౌఃన అను ప్రతీతి సిద్ధమైన భేదము గోవు ప్రతియోగి గాగల భేదము. గోవుయందు ప్రతియోగిత యుండును. ఆ ప్రతియోగితా నిరూపకము భేదము గోవుయందలి (గోనిష్ఠ) భేదము గోత్వావచ్ఛిన్నమైనది. గోవుయందు, గోత్వము,ప్రతియోగిత అను రెండు ధర్మములు కలవు. ఒకచోట నున్న రెండు ధర్మములకు అవచ్ఛేద్యావచ్ఛేదక భావముగాన గోత్వావచ్ఛిన్న ప్రతియోగిత, ప్రతియోగితావచ్ఛేదకము గోత్వము అటులనే గోవు లక్ష్యముగాన లక్ష్యత, గోత్వము అను రెండు ధర్మములు గోవుయందుగలవు గోత్వం లక్ష్యతావచ్ఛేదకము గోత్వావచ్ఛిన్నము లక్ష్యత నా అగును ప్రకృతములో లక్ష్యతావచ్ఛేదకాధి కరణవృత్తిత్వేసతి లక్ష్యతావచ్ఛేదకా వచ్ఛిన్న ప్రతియోగితాక భేదాధికరణ వృత్తిత్వం అను అతివ్యాప్తిని

(శృంగిత్వం) కొమ్ములు కలిగియుండుట అను దానియందు సమన్వయము చేయవలయును. గాన ఇచ్చట లక్ష్యము గోవు. లక్ష్యతావచ్ఛేదకము గోత్వము దానికి అధికరణము గోవు తద్వృత్తి అనగా అక్కడ ఉన్నది శృంగిత్వం గాన ఉండుట అనుధర్మము శృంగిత్వమందు కలదు లక్ష్యము గోవు లక్ష్యతావచ్ఛేదకము గోత్వము.తదవచ్ఛిన్న ప్రతియోగిత గౌఃనఅను ప్రతీతి సిద్ధమైన గోభేద నిరూపితమైన గోవు యందలి ప్రతియోగిత, ఆ ప్రతియోగితా నిరూపకమైన భేదము గౌఃన అను ప్రతీతి సిద్ధమైన గోభేదము. ఆభేదము మహిషమందు గలదు గాన భేదాధికరణము మహిషము తద్వృత్తి అనగా అచ్చట ఉన్నది, శృంగిత్వం(కొమ్ములు కలిగియుండుట) ఉండుట శృంగిత్వమందు గలదు గాన సమన్వయమైనది.

మూ॥ లక్ష్యమాత్రా వృత్తిత్వ మసంభవః॥ యథా గోరేక శఫవత్వం.

ఏలక్ష్యమందు ఉండకపోవుట అసంభవము, గోవుకు ఏకశఫవత్వం (ఒకగిట్ట కలిగి యుండుట) లక్షణముగా చెప్పిన లక్ష్యమైన యే గోవుకు ఏకశఫవత్వంలేదు గాన ఏకశఫవత్వమందు సమన్వయమైనది. లక్ష్యతావచ్ఛేదక వ్యాపకీభూతాభావ ప్రతియోగిత్వము అసంభవ స్వరూపము. అనగా లక్ష్యతావచ్ఛేదకము ఉన్న చోట్ల ఉన్న అభావమునకు అప్రతియోగియైన ఏ అభావము గలదో దానికి ప్రతియోగియగుట లక్ష్యతావచ్ఛేదక సమానాధి కరణాత్యంతాభావా ప్రతియోగ్యభావ ప్రతియోగిత్వం - ఇచ్చటను లక్ష్యతావచ్ఛేదకము గోత్వము. అది ఉన్న చోటు గోవు అచ్చట ఉన్న అభావము ఏకశఫవత్వాభావముయొక్క అభావముగాదు (ఒకగిట్ట కలిగియుండుట అను దానియొక్క అభావముయొక్క అభావము గాదు) అనగా ఏకశఫవత్వాభావము ఉన్నచోట ఏకశఫవత్వా భావాభావము ఉండదు. ఉన్న ఏకశఫవత్వా భావమునకు ఏకశఫవత్వము ప్రతియోగి అప్రతియోగి ఏకశఫవత్వాభావము, ఏకశఫవత్వాభావము ఏకశఫవత్వాభావాభావమునకు ప్రతియోగిగాని ఏకశఫవత్వాభావమునకు ప్రతియోగిగాదు. అప్రతియోగి ఏకశఫవత్వా భావమునకు ప్రతియోగి ఏకశఫవత్వముగాన లక్ష్యతావచ్ఛేదకసమానాధికరణమైన అభావమునకు అప్రతియోగియైన అభావమునకు ప్రతియోగిత్వ రూప అసంభవ రూపదోషము, దుష్టమైన ఏకశఫవత్వమునందు ఉండుటచేత సమన్వయమైనది.

మూ॥ ఏతద్దూషణత్రయ రహితోధర్మః లక్షణం। యథాగోః సాస్నాదిమత్వం। సఏవాసాధారణధర్మ ఇత్యుచ్యతె।

పైన చెప్పిన అవ్యాప్తి, అతివ్యాప్తి, అసంభవముఃను మూడు దోషములులేని ధర్మము లక్షణమని చెప్పబడును గోవుకు సాస్నాదిమత్వము (గంగడోలు కలిగియుండుట) లక్షణముగా చెప్పిన సాస్నాదిమత్వమందు మూడు దోషములులేవుగాన గోవుకు సాస్నాదిమత్వము (గంగడోలు కలిగియుండుట) లక్షణముగా చెప్పబడినది - దీనినే అసాధారణ ధర్మమని చెప్పుదురు.

మూ॥ లక్ష్యతావచ్ఛేదక సమనియతత్వం అసాధారణత్వం.

అసాధారణ్యమనగా లక్ష్యతావచ్ఛేదక సమనియతత్వం. లక్ష్యతావచ్ఛేదక సమనియతత్వమనగా లక్ష్యతావచ్ఛేదక వ్యాపకత్వేసతి, లక్ష్యతావచ్ఛేదక వ్యాప్యత్వం. లక్ష్యతావచ్ఛేదక వ్యాపకత్వమనగా లక్ష్యతావచ్ఛేదకాధికరణ వృత్తియైన అభావమునకు అప్రతియోగియగుట. లక్ష్యతావచ్ఛేదక వ్యాప్యత్వ మనగా లక్ష్యతావచ్ఛేదకముయొక్క అభావమునకు అధికరణమైన దానియందు ఉండకపోవుట. ప్రకృతములో లక్షణమునకు అసాధారణము పర్యాయపదము. అసాధారణమునకు అనగా లక్షణమునకు లక్షణము చెప్పినాడు. లక్ష్యతావచ్ఛేదక సమనియతత్వమని ఈలక్షణము గోవుకు లక్షణముగా చెప్పిన సాస్నాదిమత్వమందు సమన్వయము కావలయును. లక్ష్యము గోవు లక్ష్యతావచ్ఛేదకము గోత్వము. దానికి అధికర

ణము గోవు. అచ్చట ఉన్న అభావము సాస్నా
దిమత్త్వాభావముగాదు. గోవుయందు సాస్నాది
మత్త్వమే ఉండుటచేత దాని అభావములేదు
ఉన్న అభావము ఘటాదుల అభావము. దానికి
ప్రతియోగులు ఘటాదులు అప్రతియోగి
సాస్నాదిమత్త్వము గాన సాస్నాదిమత్త్వమందు
లక్ష్యతావచ్ఛేదక వ్యాపకత్వము వచ్చినది. అటు
లనే లక్ష్యతావచ్ఛేదక వ్యాప్యత్వము గూడా
చూపించుచున్నాము. లక్ష్యము గోవు లక్ష్యతావ
చ్ఛేదకము గోత్వం. దానియొక్క అభావము
గోత్వాభావము, దానికిఅధికరణము మహిషము
అక్కడ ఉన్నది మహిషత్వము ఉండనిది
సాస్నాదిమత్త్వం ఉండకపోవుట అను లక్ష్య
తావచ్ఛేదక వ్యాప్యత్వమున్ను సాస్నాదిమత్త్వ
మందు గలదుగాన సమన్వయమైనది ఇప్పుడు
లక్షణమునకు లక్షణముగా చెప్పినది రెండు
దళములు ఒకటి లక్ష్యతావచ్ఛేదకాధికరణవృత్తి
యైన అభావమునకు అప్రతియోగి యగుట
అనునది.లక్ష్యతావచ్ఛేదకాభావమునకుఅధికరణ
మైన దానియందు ఉండకపోవుట అనునది
రెండవది. ఇచట మొదటిదళము లేకుండగా
రెండవదళము మాత్రమే లక్షణముగా చెప్పిన
అవ్యాప్తి రూపదోషగ్రస్తమైన కపిలరూప
మందు అతివ్యాప్తి వచ్చును. కపిలరూపము
కపిలగోవుయందు మాత్రమే యుండును. కపిల
గోవుకాని దానియందు ఉండదు గోవుకాని దాని
యందు అసలే ఉండదు. లక్ష్యతావచ్ఛేదకము
గోత్వము. దానియొక్క అభావమునకు అధికర
ణము మహిషము. దానియందు మహిషత్వం
ఉండును. ఉండనిది కపిలరూపత్వంగాన ఉం
డకపోవుట కపిలరూపత్వ రూపఅవ్యాప్తి రూప
దోషగ్రస్తమైన దానియందు గలదుగాన లక్షణ
లక్షణమునకు అతివ్యాప్తి వచ్చినది. దాని నివా
రణకొరకు లక్ష్యతావచ్ఛేదక వ్యాపకత్వరూప
దళమునుగూడా లక్షణ లక్షణములో జేర్చిన
అతివ్యాప్తి వారించును. లక్ష్యతావచ్ఛేదకాధికర
ణముగోవు.అనగా తెల్లగోవుగూడా కావచ్చును.
అక్కడ ఉన్న అభావము కపిలరూపము
యొక్క అభావము. దానికి ప్రతియోగియే
కపిలరూపము (కపిలరూపవత్త్వము). అప్రతి
యోగికాదు గాన అతివ్యాప్తిలేదు. అటులనే
వ్యాపకత్వము మాత్రమే లక్షణముగా చెప్పిన
శృంగిత్వమందు (కొమ్ములు కలిగియుండుట)
అతివ్యాప్తివచ్చిన లక్ష్యతావచ్ఛేదకసమానాధికర
ణమైన అభావము శృంగిత్వాభావముగాదు.
గోత్వము ఉన్నచోట శృంగిత్వము ఉండుటచేత
లక్ష్యతావచ్ఛేదక సమానాధికరణాభావము శృంగి
త్వాభావముగాదు ఘటాభావము అగును.దానికి
ప్రతియోగి ఘటము. అప్రతియోగి శృంగి
త్వము, అప్రతియోగిత్వము శృంగిత్వమందు
గలదు గాన అతివ్యాప్తి రూపదోషగ్రస్తమైన
శృంగిత్వమందు అతివ్యాప్తి వచ్చినది. దాని
కొరకు వ్యాప్యత్వదళమును గూడా వేసిన ఆ
దోషవారణ అగును. లక్ష్యతావచ్ఛేదకాభావము
గోత్వాభావము దానికి అధికరణము మహిషము.
తద్వృత్తి (అచ్చట ఉండునవి) శంగిత్వము
అవృత్తి గాదుగాన అవృత్తిత్వము శృంగిత్వము
నందు లేదుగాన అతివ్యాప్తి వారించినది
లక్ష్యతావచ్ఛేదక సమానాధికరణమైన అభావ
మునకు అప్రతియోగియైన లక్ష్యతావచ్ఛేదకా
భావము ఉన్నచోటు ఉండపోవు లక్షణమునకు
లక్షణము అని తేలినది.

మూ॥ వ్యావర్తక స్యైవలక్షణత్వే వ్యావృత్తా
వభిధేయత్వా దౌచ అతివ్యాప్తి వారణాయ
తద్భిన్నత్వం ధర్మవిశేషణం దేయం వ్యవ
హారస్యాపి లక్షణప్రయోజనత్వే తన్న
దేయం వ్యావృత్తేరపి వ్యవహార సాధన
త్వాత్॥

లక్షణములు రెండు విధములు వ్యావహారిక
ములనియు వ్యావర్తకములనియు. వ్యావహారిక
ములనగా వ్యవహారమునకుమాత్రము ఉపయో
గపడునవి వ్యావర్తకములనగా ఇతర భేదాను
మితిని కలుగజేయునవి గోవుకు సాస్నాది
మత్త్వము లక్షణమైనప్పుడు సాస్నాదిమత్త్వము
గోవుయందు ఇతరభేదానుమితిని కలుగ
జేయును గోవు, ఇతరములకంటెభిన్నమైనది,
సాస్నాదులు కలిగియుండుటవలన, అను అను

మానములో సాస్నాదిమత్వం హేతువు, ఇతర భేదవ్యాప్యమైన సాస్నాదిమత్వముకలది. గోవు అను పరామర్శవలన గోవు ఇతరభిన్నమైనది అను అనుమితి కలుగుటచేత సాస్నాదిమత్వము వ్యావర్తక లక్షణమైనది. మూలములో చెప్పిన లక్ష్యతావచ్ఛేదక సమనియతత్వ రూపలక్షణ లక్షణము వ్యావర్తకలక్షణమునకే లక్షణమైన యడల వ్యావర్తకముగాని అనగా వ్యావర్తక లక్షణముగాని ఇతర భేదమందు, అభిధేయత్వమందు యీ లక్షణము పట్టుటచేత అతివ్యాప్తి వచ్చును.

లక్ష్యతావచ్ఛేదకము గోత్వము. ఆ గోత్వ వ్యాపకము, వ్యాప్యమున్నూ గో ఇతరభేదము అగును. లక్ష్యతావచ్ఛేదకమైన గోత్వము ఉన్న చోట్ల గవేతరభేదము ఉండుటచేత వ్యాపకమైనది. గోత్వము లేనిచోట గవేతరభేదము లేదుగాన గోత్వవ్యాప్యమున్నూ అయినది. లక్షణమునకు లక్షణమైన లక్ష్యతావచ్ఛేదక సమనియతత్వము లక్షణలక్షణమునకు లక్ష్యముగాని ఇతర భేదమందుననూ, అభిధేయత్వమందుననూ సమన్వయమగుటచేత అభిధేయత్వమునందు ఇతర భేదమునందు అతివ్యాప్తి వచ్చినది అందుకొరకు లక్షణ లక్షణములో వాట్ల భేదముగూడా వేయవలయును. ఇతర భేదభిన్నత్వేసతి అభిధేయత్వ భిన్నత్వేసతి లక్ష్యతావచ్ఛేదక సమనియ తత్వమని, (ఇతరభేదముకంటె భిన్నమై అభిధేయత్వముకంటె భిన్నమై లక్ష్యతావచ్ఛేదక సమనియతమైనది లక్షణము) మూలమునకు అర్థము చెప్పు ప్రకారము-వ్యావర్తకస్యైవలక్షణత్వే-ఈ చెప్పబడిన లక్ష్యతావచ్ఛేదక సమనియతత్వ రూప లక్షణము, వ్యావర్తకలక్షణమునకే లక్షణమైన, వ్యావృత్తే అభిధేయత్వాదౌచ అతివ్యాప్తి వారణాయ-వ్యావృత్తియందు అనగా ఇతరభేదమందు అభిధేయత్వమందుననూ ఈ పై లక్షణము పట్టుటచేత అతివ్యాప్తి వచ్చును, ఆ అతివ్యాప్తి వారణ కొరకు, తద్భిన్నత్వం ధర్మవిశేషణం దేయం. వ్యావృత్తి భిన్నత్వమనియు అభిధేయభిన్నత్వమనియు లక్షణములో అధికముగా రెండు విశేషణములు వేయవలయును అటులగాక యీ చెప్పిన లక్షణలక్షణము వ్యావర్తక లక్షణమునకే లక్షణముగాక వ్యావహారిక లక్షణమునను గూడా లక్షణమే. అనగా యీ లక్షణలక్షణమునకు వ్యావహారిక లక్షణము లక్ష్యమే అటులనే వ్యావర్తక లక్షణము లక్ష్యమే అనినచో పై రెండు విశేషణములు, అనగా ఇతర భేదభిన్నత్వము అభిధేయత్వ భిన్నత్వము అను విశేషణములు ధర్మవిశేషణములుగా-అనగా లక్ష్యతావచ్ఛేదక సమనియతత్వము అను లక్షణములో విశేషణములుగా వాడవలసిన అవసరములేదు. కారణ మేమనగా వ్యవహారమును గురించి వ్యావృత్తిగూడా వ్యవహార సాధనముగాన, "వ్యావృత్తి వ్యవహారోవా లక్షణస్యప్రయోజనం" అను వాక్యముచేత, అచ్చట లక్షణము ఉండుట ఇష్టమేగాన- అనగా వ్యావహారిక వ్యావృత్తి. అభిధేయత్వములు గూడా వ్యావర్తకమైన సాస్నాది మత్వాదులవలె యీ లక్షణ లక్షణమునకు లక్ష్యములేగాన అచ్చట సమన్వయము అగుట లక్ష్యమందే లక్షణసమన్వయముగాన దోషములేదని తాత్పర్యము.

ఆదిమ చిత్రకళ

శ్రీమతి కె. ఎల్. దివ్యజ్ఞాన సరోజినీదేవి

చిత్రకళ మొట్టమొదట ప్రపంచమునందు ప్రాచీన యుగమందలి ఉత్తరభాగమున, అనగా శిలాయుగపు తొలిసంవత్సరములందు జన్మించినదని చరిత్రకారులు, చిత్రకారులు, శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుచున్నారు. కాని ఈ ప్రాచీన యుగ కాలమునుగాని, శిలాయుగ కాలమునుగాని ఒక నిర్ణీత సంవత్సరకాలములో చెప్పుట కష్టతరము అన్ని దేశములందును ప్రాచీన యుగముగాని, శిలాయుగముగాని ఒకే సమయమందు ఉండి యుండలేదు. హిందూదేశములో ప్రాచీన యుగము ఐరోపాలో ప్రాచీనయుగము ఒకే కాలమునందు సంభవించలేదు కొన్ని దేశములలో ఇప్పటికిని ప్రాచీన యుగచ్ఛాయలు కనబడుచునేయున్నవి మరికొన్ని దేశములలో ప్రాచీనయుగము సమాప్తమై అనేక వేలసంవత్సరములైనది కొన్ని దేశములందు కొన్ని కొన్ని జాతులవారు ఇంకను ఈ ప్రాచీన చిత్రకళనే అవలంబించు చున్నప్పటికిని సాధారణముగా క్రీ పూ 20,000 సంవత్సరముల నుండి క్రీస్తుశకారంభమువరకు గల మధ్యకాలము నాటి చిత్రకళయే ఆదిమ చిత్రకళగా పేర్కొనబడుచున్నది

ఆదిమవాసులు ఈ ఆదిమ చిత్రకళ కర్తలు. ఆదిమవాసులనగా కొందరికి 'అనాగరికులు' అనెడి అభిప్రాయమున్నది కాని ఈ భావము ఎంతమాత్రము సమంజసము కాదు కొందరు ఆదిమవాసుల నాగరికతను ఈనాటి నాగరికతతో సరిపోల్చిన, మత విషయమునందుగాని, నైతిక సాంఘిక విషయములందుగాని, శాస్త్రవిషయములందు గాని, శిల్పాది సాంకేతిక విద్యలందుగాని వారేమాత్రము అనాగరికులుగా కనపడరు కావున ప్రస్తుత చరిత్రకారులు ఆదిమవాసులను అనాగరికులుగా భావింపరాదనియు, కాని వారి నాగరికత మన ఈనాటి నాగరికతకన్న ఒకపాలు తక్కువగా నుండి యుండవచ్చుననియు అభిప్రాయపడుచున్నారు ఈ విధముగా ఆదిమవాసుల గురించి దురభిప్రాయమున్నట్లే, వారి చిత్రకళను గురించి కూడ కొన్ని దురభిప్రాయములున్నవి నిజమునకు ఆదిమ చిత్రకళ అని పిలవబడుచున్న చిత్రకళలు పెక్కుభంగులు గాను, వివిధ రీతులుగాను ఉన్నవి ఆదిమవాసులు వివిధ దేశములలో వేరు వేరు శీతోష్ణ, సాంఘిక పరిస్థితులలో జీవించుచు, భిన్నమానసిక స్థితులు కలవారగుటచే వారి చిత్రకళయు వివిధ రీతులలో నుండుట సహజమే కానీ విభేదములున్నప్పటికి ఆదిమవాసులు కొన్ని కొన్ని విషయములందు పోలిక కలిగియున్నట్లు మన కగుపడుదురు పిల్లలు వివిధరీతులుగా నుందురు. కాని పెద్దవారితో పోల్చినప్పుడు పిల్లలందరు ఒక్కరీతిగానే ఉన్నట్లు కనబడుదురు ఆ విధముగానే ఆనాటి ఆదిమవాసులను మనతో పోల్చుకొన్ననూ, ఆనాటి చిత్రలేఖనమును ఈనాటి చిత్రలేఖనముతో పోల్చిననూ, ఆనాటి వివిధ దేశముల ఆదిమవాసుల మధ్యనూ, పలుదేశముల ఆదిమ చిత్రకళ మధ్యనూ పోలికలు కానవచ్చును

'ఆది' అను పదము ఏ పదార్థముయొక్కగాని ప్రాథమిక దశను తెలుపుటకే వాడుదురు గావునను, ఆ పదార్థము ఆ ప్రాథమిక దశలో సర్వసామాన్యముగా మోటుగాను, అసంపూర్ణముగాను ఉండును గావుననూ, పలువురు ఆదిమ చిత్రకళ మోటుగా నుండుననియు, ఆదిమవాసులకు శిల్పాది సాంకేతిక విద్యలు తెలియకపోవుటయే యిందులకు కారణమనియు అభిప్రాయపడు చున్నారు. కాని యిందు ఏమాత్రము నిజములేదు ఆనాటి చిత్రకారులు వృత్తి జాతుల నుండి గైకొని ఉపయోగించిన వర్ణములు, వారు చిత్రించుటకు వాడిన శిలాయి, దంతము, ఎముక, కఱ్ఱ, మట్టి, లోహాది వస్తుసముదాయములు, ఆనాటి చిత్రకారులకు శిల్పాది విద్యలందుండిన నైపుణ్యమును చెప్పకనే చెప్పుచున్నది

ఆనాటి ఆదిమవాసులు తమ వేషభాషలందుగాని తాము చిత్రించు చిత్రములందుగాని అనవసరమైన వివరముల జోలికి పోలేదు వారు శరీర శుభ్రతకు కావలసిన వస్త్రములనే ధరించెడివారు ఆ విధముగానే వారు చిత్రించునప్పుడు నైతము ఆ వస్తువుయొక్క ప్రతిభాగము చిత్రించెడివారు గాదు ఆ వస్తువుయొక్క ప్రధానాంశమును మాత్రమే చిత్రించెడివారు ఇదే ఆదిమ చిత్రకళయందలి ముఖ్యాంశము అందుచేతనే వారు పక్షిరాజైన రాబందును చిత్రించునప్పుడు అతి వాడియై దాని ముక్కును, భయంకరమైన దాని కాలి గోళ్ళను మాత్రమే చిత్రించెడివారు

కాని కొన్నికొన్ని ఆదిమ చిత్రములు పైచెప్పబడిన దానికి పూర్తిగా భిన్నాంశములు కలిగియున్నవి. ఆ చిత్రములు చిత్రించుటయందు ఆ చిత్రకారులు పక్షులను గాని, జంతువులనుగాని (వా రెక్కువగా పశుపక్ష్యాదులనే చిత్రించెడివారు) శల్యపరీక్ష చేసి చూచినట్లు వాని శరీరములందు గల ఎముకలు, కండరములు మొదలగు వివిధ భాగములను శాస్త్రజ్ఞుడు చిత్రించినట్లు చిత్రించెడివారు

సాంకేతిక చిత్రీకరణ ఆదిమ చిత్రకళయందలి మరొక లక్షణము.

ఆ రోజులలో చిత్రలేఖనమునకు అంత విశిష్ట స్థానము లభించుటకు కారణము కేవలము ఆనాటి వారికి అందు వుండే మమత మాత్రమేకాదు చిత్రలేఖనము ఆనాటి సంఘమునకు అనేకవిధాల సహాయకారిగా నుండెడిది ఆదిమవాసులకు ప్రప్రథమముగా లిపి తెలియకపోవుటచే వారు తమ భావములను వ్యక్తపరుచుటకుగాని, తమ చరిత్రను తమ తరువాతి తరముల వారికి తెలియచేయుటకు గాని చిత్రలేఖనమును అవలంబించెడివారు ఈ పద్ధతి ఎక్కువగా ఈజిప్టు చైనాలలో వాడుకలో నుండెడిది ఎస్కిమో వనితలు బాలికలు కథలు చెప్పుటకై ఆ కథలను నేలమీద బొమికతో చిత్రముల రూపమున చిత్రించెడివారు

అనేక వేల సంవత్సరముల నుండి చిత్రకళలో ప్రముఖస్థానము ఆక్రమించుకొనగలిగినది మతము హైందవమతము క్రీ పూ మూడు వేల సంవత్సరముల కాలమునాటికే చిత్రకళయందు, ఒక విశిష్ట స్థానమాక్రమించుకొన్నది బౌద్ధమతము క్రీ పూ మూడవ శతాబ్దమునుండి, క్రీ శ పదునెనిమిదవ శతాబ్ది ప్రారంభమువరకు పలుదేశముల చిత్రకళలందును ఒక విశిష్టాన మేర్పరుచుకొన్నది. క్రైస్తవ మతముకూడ చిత్రలేఖనమందు రెండువేల సంవత్సరముల కాలము అలరారినది బాబిలోను, అసిరియా, ఈజిప్టు, గ్రీసు, మెక్సికో, మధ్య అమెరికా, కొలంబియా మొదలగు దేశముల చిత్రకళలందు నైతము మతము చోటుచేసుకొన్నది ఆ విధముగానే ఆదిప్రాచీన చిత్రకళయందును మతమునకు ఒక ప్రధానపాత్ర కలదు కాని ఆనాటి ఆదిమవాసుల మతమునకు ఈనాటి మతములకును అనేక భేదములున్నవి ఆనాటివారి మతము మంత్రతంత్రములతో ఇంద్రజాలములతో కూడుకొని యుండెడివి వారు పూజ, బలి, నృత్యము, అనుకరుణ, కేకలతో మిశితమైన గీతములు మొదలగు అట్టహాసములతో ఆ దేవతలను పూజించెడివారు ఇట్టి అట్టహాసములకు చిత్రకళ ఎంతో తోడ్పడెడిది ఇట్టి పూజలలో పాల్గొను వారందరు తమ ముఖములకు కృత్రిమ ముఖములు తగిలించుకొని, దేవతలకు దెయ్యములకు రూపములు కల్పించి పూజించెడివారు వీటన్నిటికి చిత్రలేఖనము మిగుల నవసరముకదా! రైతులైన హోపి యిండియనులు సకాలములో వర్షములు కురియుటకై పెద్ద ఉత్సవములుచేసి వరుణదేవుని పూజించెడివారు ఆ వరుణదేవుని మానవాకారములోనే చెక్కి, అతని ముఖమున మాత్రము చెక్కిళ్ళపై స్పష్టముగా కనబడునట్లు మూడు అర్ధచంద్రాకార గీతలు (మేఘములు) పాములవలె వంపుతిరిగి పైకిపోవుచున్నట్లున్న రెండు రేఖలు (మెఱుపులు), చిన్నచిన్న నిలువు గీతలు (వర్షము) చిత్రించబడియున్నవి. బోర్నియో అందు బోలి అతప్ అను ఆదివాసులు తమ కేటువంటి వ్యాధులు రాకుండుటకై ఒక దయ్యమునకు మానవాకారము కల్పించి పూజించెడివారు ఆఫ్రికాలోని నీగ్రో స్త్రీలు తమకు బిడ్డలు కలుగుటకై పిల్లల ప్రతిమలను నడుముకి కట్టుకొనెడివారు.

ఈ ఆదివాసులు కేవలము దేవతల దయ్యముల పూజలేకాక మూల పురుషులను, తమ పూర్వీకులను కూడా పూజించెడివారు ఈ పూర్వీకుల ప్రతిమలను పెద్దపెద్ద పండుగల ఉత్సవ సందర్భములలో పూజించెడివారు కొన్ని తెగలలోని నాయకులు తాము కూర్చొనెడి ఆసనముల వెనుక భాగములందు తమ పూర్వీకుల విగ్రహములను చెక్కించుకొనెడివారు. ఈ పూర్వీకుల పూజ ఖండ ఖండాతరములకును వ్యాపించినప్పటికిని, పశ్చిమ ఆఫ్రికా, న్యూగినీ, మెలనిసియో పశ్చిమోత్తర అమెరికాలలో ఎక్కువగా నున్నది ఆనాటి శిల్పులు ఈ ప్రతిమలను, ఎంతో చాతుర్యముతో చెక్కియున్నారు వారు కొన్ని ప్రతిమలందు ఆ పూర్వీకుల స్వరూపము చాలవరకు యథాతథముగాను, మరికొన్నింటియందు ఆ పూర్వీకుని స్వరూపముతో సంబంధము లేకుండ కేవలమొక మానవాకారమును, చిత్రించియున్నారు

ఆ కాలమున దైవ ప్రతిమలకు దైవత్వము కలుగచేయుటకై ఆ ప్రతిమలకు కొన్ని అలంకరణలు చేసెడివారు పశ్చిమ ఆఫ్రికాలోని కఱ్ఱప్రతిమలకు కొన్ని వర్ణములు పూసినగాని వానిని దైవప్రతిమలగా పరిగణించెడివారు కాదు టిబెట్టు చైనాలందు బుద్ధ, బోధిసత్వ విగ్రహములకు వర్ణములతో నోరు, కనులు చిత్రించినగాని అవి బుద్ధుని విగ్రహములుగా పరిగణింపబడవట

అమెరికా ఆదిమవాసులు తమ కులగోత్రములను తెలుపుటకై తమ శరీరములమీద పలు వర్ణములతో మృగముల సాంకేతిక చిత్రములను చిత్రించుకొనెడివారు ఆనాటి ఆదిమవాసులు జంతువులను తమకన్న హీనముగా ఎప్పుడు పరిగణించలేదు పైగా వాని వేగమును, బలమును, యుక్తిని ఎంతో మెచ్చుకొని వానిని అనుకరించుటకు ప్రయత్నించెడివారు తత్ఫలితమే వారి శరీరములందుగల వివిధజంతువుల చిత్రములు ఒక్కొక్క తెగవారు ఒక్కొక్క జంతువు పేరుతో పిలువబడుచుండెడివారు ఈ జంతువులను వారు భగవత్ స్వరూపములుగా పరిగణించనప్పటికి, ఒక్కొక్క తెగవారు వారివారి జంతువుల మాంసమును భక్షించక, వాని రూపములను సదా తమ శరీరములపై సాంకేతికముగా చిత్రించుకొనుచు ఆ జంతువులందు వారికిగల అభిమానమును తెల్పుకొనెడివారు

ఆ కాలమున నైతము చిత్రముల నిచ్చి పుచ్చుకొను వ్యాపారము కలదు. కొందరు చిత్రకారులు జీవితావసరములైన వస్తువుల కొనుగోలుకై తమ చిత్రముల నిచ్చెడివారు ఆనాటి స్త్రీలు- తమ పాత్రవస్తుసముదాయములపై చిత్రించెడివారు ఈ విధముగా ఆనాటి ఆదిమ చిత్రకళ కేవలము అందమైన వస్తువుల చిత్రీకరణకుగాక, యుపయోగకరమైన వస్తువుల చిత్రీకరణకు ఉపయోగపరచబడినది ఇందులకు కారణము, ఆనాటివారు సాధారణముగా కొన్ని సంవత్సరముల పాటు ఒకేచోటున నుండక పోవుటయే అందుచే వారెప్పుడు తమకు ఉపయోగపడు సామాన్లను, సులభముగా మోసికొనిపోగల సామాన్లను మాత్రమే ఉంచుకొనవలసి వచ్చెడిది

కాని అంతమాత్రముచే ఆదిమవాసులు కేవలము చిత్రకళను తమ అవసరములు తీర్చుకొనుటకే వాడిరని భావించుట సమంజసముకాదు. ఆఫ్రికాలోని నీగ్రోలలో ఒక తెగవారు కేవలము కళ కోసరమే చిత్రములు వేసెడివారు. పండుగ రోజులలో ఆ చిత్రకారుడు తన చిత్రములన్ని బైటికి తీసి దుమ్ముదులిపి, వానిని చూచుచు ఆనందించువాడట!

ఆనాటి ఆదిమ చిత్రకళ ఆనాటి ఆదిమవాసులకే కాక మనకుకూడ ఒక విధముగా చాల ఉపయోగపడుచున్నది. ఉత్తర ఆఫ్రికాలోని అట్లాసు ప్రాంతములలో నివసించిన ఆదిమవాసులు తమ చిత్రములందు ఏనుగులు, ఎనుములు, జిరాఫీలు, ఖడ్గమృగములు, నిప్పుకోళ్ళు మొదలగు వేడి ప్రదేశములలో నివసించు జంతుపక్ష్యాదులను చిత్రీకరించియున్నారు. ఆ జంతువులిప్పుడు అట్లాసు పర్వత ప్రాంతములలో ఎచ్చటను లేవు. అందుచే ఆనాడు ఆ ప్రాంతము ఇంత చల్లగా నుండి యుండలేదనియు, అప్పుడా జంతువులు అక్కడ నివసించుచుండెడివనియు, మనము ఈనాడు ఈ చిత్రములద్వారా తెలిసికొనగలుగు చున్నాము

ఆదిమవాసులందు స్త్రీ పురుషుల కిరువురకునుచిత్రకళ యందు ప్రవేశముండెడిది. కాని ఆనాడు చిత్రలేఖనమునకు అవసరమైన వస్తువులు ఈనాడువలె సులభముగా దొరికెడివిగావు. ఉత్తర అమెరికాలోని ఆదిమవాసులు చిత్రములు చిత్రించుటకై మొట్టమొదట ఎనుము చర్మమును తీసికొనివచ్చి శుభ్రపరిచెడివారు తరువాత,ఆకులలములనుండి కొన్నికొన్ని ప్రదేశములలో ఖనిజములనుండి నైతము కొన్ని పదార్థములను గ్రహించి, వానిని ఉడకబెట్టిగాని పిండిచేసిగాని జంతువుల క్రొవ్వుతో కలిపి వర్ణములు తయారు చేసెడివారు అటుపిమ్మట వారు చిత్రింపదలచుకొన్న చర్మమును ఎత్తు పల్లములు లేకుండుటకు నేలమీద అదిమిపట్టి, దానిమీద బలముగా ఒక్కొక్క గీతనే, చర్మములోకి రంగు బాగుగా నింకునట్లు మరల మరల గీసెడివారు ఆనాటి చిత్రలేఖనము ఇన్ని కష్టములతో కూడుకొనిన పని!

ఆదిమవాసులు పలు లోహ విగ్రహములనుకూడ చేసెడివారు మనదేశము నందలి ఆదిమవాసులు రాగి విగ్రహములు చేయుటయందు ప్రసిద్ధిచెందిరి వారు ముందు మట్టి ప్రతిమను చేసి, ఆ ప్రతిమను మైనముతో కప్పి, దానికి పైన క్రింద రెండు ప్రక్కలందును రెండు సన్నటి లోహపు గొట్టములను అతికించి, మరల ప్రతిమనంతటిని మృదువైన మట్టితో కప్పివేసెడివారు ఆ మట్టి గట్టిపడిన పిమ్మట పై గొట్టమునుండి కరగబెట్టబడిన లోహమును పోసెడివారు ఆ లోహము మట్టి అచ్చులకు మధ్య మైనముతో నిండిన భాగమున ప్రవేశించి మైనమును కరిగించివేసి దానిచోటు తానాక్రమించు కొనును. కరిగిపోయిన మైనము క్రింది గొట్టముద్వారా బైటకివచ్చివేయును. ఆ లోహము చల్లారిన పిదప పైనా, లోపల ఉన్న మట్టి అచ్చులను జాగ్రత్తగాతీసివేసెడివారు. ఆ విధముగా ఆనాడు రాగి విగ్రహములు రూపొందెడివి కాని యట్లు తయారైన విగ్రహములు కొంచెము కరుకుగా నుండును గావున వానిని మరల ఉలి,ఆకు రాళ్ళతో సరిదిద్దెడివారు. ఈ పద్ధతినే యితరమైన లోహ విగ్రహములు కూడా చేయబడుచుండెడివి. కొందరు ఈ పద్ధతి మన దేశమునుండి ఈజిప్టుకు వ్యాపించినదని అభిప్రాయపడుచున్నారు. ఆదిమవాసులు ఈ లోహ విగ్రహములతోపాటు దంతము, మ్రానుప్రతిమలను కూడ అతినేర్పుతో చేయుచుండెడివారు.

ఆదిమ చిత్రకళ ఆ కాలమునందు ఖండఖండాంతరముల చోటు చేసికొన్నది. ఐరోపా, ఆసియా, ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియా, ఓసియానో మొదలగు సమస్త ఖండములందు ఈ చిత్రకళ ఆనాడు అలరారుచుండెడిది ఐరోపాలో మొట్టమొదట చేతివ్రేళ్ళతోనే మట్టిగోడలమీద చిత్రించెడివారు ఆఫ్రికాలోని ఆదిమవాసుల చిత్రకళ భిన్నరీతులుగా నుండెడిది. ఉత్తర ఆఫ్రికాలోని ఆదిమవాసులు గుహల, గోడలమీద నేలమీద జంతువుల చిత్రములను, మానవ ప్రతిమలను మలచియున్నారు వారెక్కువగా వర్ణములను వాడలేదు కాని, దక్షిణఆఫ్రికాలోని ఆదిమవాసులు (బుష్‌మెన్) వర్ణములను విరివిగా వాడిరి వారు బాగుగ అరగదీయబడి సన్నని కొన గలిగిన ఎముక ముక్కలను కుంచెలుగా వాడెడివారు. వీరు వర్ణములను ఉత్తర అమెరికాలో చేసెడి విధానముననే తయారు చేసికొనెడి

వారు. పశ్చిమ ఆఫ్రికాలోని నీగ్రోలు ఎక్కువగా కంచు, దంతపు విగ్రహములనే చేసెడివారు.

ఆసియాలోని ఆదిమవాసులు అనేకమగు తెగలకు, జాతులకు చెందినవారగుటచేతను, భిన్నభిన్న శీతోష్ణ పరిస్థితులలో జీవించుటచేతను, వారి చిత్రకళలలో భేదములుండుట సహజమే చైనా ఆదిమవాసుల మృణ్మయ, కంచు పాత్రలందలి చిత్రకళ ఈనాటి చిత్రకారులను సంభ్రమ ఆశ్చర్యచకితులను చేయుచున్నది. భారత దేశమునందలి ఆదిమవాసుల చిత్రకళ, వారికానాడు శిల్పసాంకేతిక విద్యలందుండిన నేర్పరితనమును చెప్పకనే చెప్పుచున్నది కాని పాశ్చాత్య చరిత్రకారులు ఈ కళాపుంజములు ఏ కాలమునాటివో యింకను నిర్ణయించలేకున్నారు. కొందరివి క్రీ పూ నాలుగువేల సంవత్సరములనాటివి మాత్రమే అని అభిప్రాయపడుచున్నారు. ఏది ఎట్లున్నను మహెంజోదారో, హరప్పాలలోని శిల్పవిశిష్టత అందరికి విశదమైనది ఈ మహెంజోదారో,హరప్పా వాసులు మట్టి, రాగి, జాయి, స్టియాటైట్ (Soap stone) లతో ప్రతిమలు చేసెడివారు. మన దేశమున ఈ ఆదిమ చిత్రకళ యిప్పటికిని పూర్తిగా నశించిపోలేదు నీలగిరి కొండలలో నివసించుచున్న తోటీలు, అస్సాము కొండలలో నివసించుచున్న నాగాలు ఈ చిత్రకళనే అవలంబించుచున్నారు. కొద్ది మార్పులతో ఈ ఆదిమ చిత్రకళ గంజాము జిల్లాలో కూడ వాడుకలో నున్నది ఇచట చేయబడిన బొమ్మలు కొన్ని దక్షిణ కెన్సింగ్‌టన్ మ్యూజియములో నుంచబడి, పాశ్చాత్యులనేకుల దృష్టిని ఆకర్షించుచున్నవి. ఇండోనేషియాలో కూడ నిప్పటికిని అచ్చటచ్చట ఈ చిత్రకళ ఛాయలు కనపడుచునే యున్నవి ఆ కాలమున సుమిత్రా, బోర్నియో, ఫిలప్పైయిన్ మొదలుగాగల ద్వీపములందును ఈ ఆదిమ చిత్రకళ ప్రసిద్ధికెక్కియుండెను సుమిత్రాలో ఇత్తడి విగ్రహములను, మన దేశములో రాగి ప్రతిమలను చేసెడి విధానముననే చేసెడివారు.

చరిత్రకారులు ఆస్ట్రేలియా యందలి ఆదిమవాసులు దక్షిణ భారత దేశమునుండి వలసవచ్చినవారై యుందురని అభిప్రాయపడుచున్నారు. వారు సూక్ష్మగ్రాహులట: సారవంతమైన ప్రదేశముల నన్వేషించుచు ఒకచోట నుండి మరియొక చోటుకి ఎల్లప్పుడు పయనించుటచే వారికి మృణ్మయపాత్రలుగాని, జాతి లోహాది విగ్రహములుగాని చేయుటకు అవకాశము కలుగలేదు వారెక్కువగా గుహల గోడలమీదనో, నేలమీదనో, చెట్టుపట్టల (Bark) మీదనో చిత్రించెడివారు. ఉత్తర ఆస్ట్రేలియాలోని ఆదిమవాసులు పశుపక్ష్యాదులను చిత్రించునప్పుడు వానిని కోసి శస్త్రపరీక్ష చేసినట్లు ప్రతి ఎముక కండర సహితముగా చిత్రించెడివారు మధ్య ఆస్ట్రేలియాలోని ఆదిమవాసులు బహు సాంకేతికముగా చిత్రములు చిత్రించెడివారు. ఉత్తర కింబర్లీలోని ఆదిమవాసులు ఒక రకమైన ప్రతిమలు చేసెడివారు. ఈ ప్రతిమల ముఖములు చిత్రించునప్పుడు కన్నులు, ముక్కు తెలుపుటకు నల్లని మచ్చలు చిత్రించెడివారు. నోరు మాత్రము ఎప్పుడు చిత్రించెడివారుకాదు ఆ ప్రతిమలకు నోరు చిత్రించిన కుంభవర్షము వచ్చి సర్వప్రజ నాశనమగునని, కాగలదని వారి దృఢ విశ్వాసము.

ఇప్పటి చరిత్రకారులు అమెరికాలోని ఆదిమవాసులు ఆసియాఖండమునుండి పూర్వము కొన్ని సంవత్సరముల పర్యంతము గుంపులు గుంపులుగా వలసవచ్చిన వారే అని అభిప్రాయపడుచున్నారు అమెరికా ఆదిమవాసులు, ఆసియా ఆదిమవాసులు ఒకే తెగకు చెందినవారగుటచేత, వారిరువురి మానసిక పరిస్థితి యొకటే అగుటచేతనే, కాబోలు ఆసియా ఆదిమ చిత్రకళకును, అమెరికా ఆదిమ చిత్రకళకును పోలికలు కనపడుచున్నవి. ఉత్తర అమెరికాలోని ఎస్కిమోలు దంతము మీదనో లేదా నేలమీదనో తమ జీవితములలో నెంతో ఉపయోగపడు శునకములను చిత్రించెడివారు. అమెరికాలో ముఖములకు తగిలించుకొను కృత్రిమ ముఖములు విరివిగా తయారు చేయబడుచుండెడివి. ఇవి దేవదారు చెక్కపై నలుపు, తెలుపు, ఎఱుపు, నీలము, లేత ఆకుపచ్చ వర్ణములతో చిత్రింపబడెడివి వారు ఎనుము చర్మముమీదను, జాతిమీదను, మృణ్మయ పాత్రల మీదను, గుహలమీదను కూడ చిత్రించెడివారు. వారు పూసలతో సైతము సాంకేతిక చిత్రములు చిత్రించుటయందు బహు నేర్పరులు. వీరు ధూలిచిత్రములు (ముగ్గులు) కూడా వేసెడివారు. ఈ 'ధూలి' చిత్రములను ఇసుకలో ఉత్సవ సందర్భములలో చిత్రించి మరల సాయంకాలములోగా తుడిచివేసెడివారు వీరు ఈ ముగ్గుల విషయమందేకాక రాక్షసుల చిత్రీకరణలో కూడ మన దేశీయులను పోలియున్నారు. వారుకూడ రాక్షసులను కోరలతో చిత్రించెడివారు మేదరి, నేతపనులందు కూడ వారు ప్రసిద్ధిచెందిరి. అమెరికాలో కొన్నిచోట్ల ఈ ఆది ప్రాచీన చిత్రకళ ఇప్పటికిని నిలచియున్నది.

ఆనాటి ఆదిమవాసుల చిత్రకళ ఇట్టిది. ఈనాడు అధునాతన చిత్రకారులైన గాగిన్, మొదగ్లాని, పికాసో వంటివారు, ఈ ఆదిమ చిత్రకళ ఔన్నత్యము గ్రహించి ఆ చిత్రకళయందలి కొన్ని అంశములను అనుకరించుచు, అధునాతన చిత్రకళఅన్న క్రొత్తపేరుతో దానికి ఒక విధముగా పునర్జన్మ యిచ్చుటకు ప్రయత్నించుచున్నారు కాని ఆ చిత్రకళకు దోహదమిచ్చిన ఆనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, నైతిక, మత పరిస్థితులకు ఈనాటి పరిస్థితులకు భేదమున్నప్పుడు, ఆనాటి చిత్రకళను ఈనాడు అవలంబింప ప్రయత్నించుట నిరుపయోగము. ఇంకను అచ్చటచ్చట మిగిలియున్న ఆదిమవాసులు ఈచిత్రకళకే అంటిపెట్టుకొనుటకై కొన్ని దేశముల ప్రభుత్వములవారు ప్రయత్నములు చేయుచున్నారు. కానీ స్పుత్నిక్ యుగములో ఇంకెంత కాలము ఈ ఆదిమవాసులు, ఈ ఆదిమచిత్రకళ నిలువగలదు? అసహజమైన జీవనముకంటె సహజమైన మృత్యువే మేలుగదా!

విశ్వనాథ మధ్యాక్కఱలు

నందమూరు శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౩౪

ఒక యాతనా శరీరమ్ము కలదేని ఉండనీ లేని
సుకములు సుకములుగాఁగ గల్లగాఁజూపించు దీని
నకట! గోరనుగాక నీదు గుండెలో నంతగాఁ గరుణ
వికటింప నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

మనిసిపై నాయెత్తు క్రుమ్మరించినఁ మన్ను లోలోన
మనసి తా నిటునటు కొట్టుకోరాద మసలను రాద
తనువున నే దారిఁ బ్రాణములు పోవుదారి యద్రంధ్ర
వినతమ్ము నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఈ శరీరమ్మిది జీవునకు నహంకృతి పూను పీఠ
దేశమ్ము దేహమువీడి యెచ్చటఁ దిరుగు నే మౌను
లేశమ్ము గూడ నా జీవుని స్థితి తెలియద యెట్లోపు
వేశమ్ము నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

పర్వతం బొక్కండు పైన బడి చావఁ బ్రాణముల్ పోవ
పర్వత భేదంబు చేసి జీవుఁడు పయనింపఁ గలడొ
పర్వతాణువు లందున నతనికి నభివ్యాప్తి కల్గెడునొ
వేర్వేర నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

జీవుడన్నది గాలియా ప్రకాశమా చిల్లేశమా సు
ధీ వేదమైనట్టి బ్రహ్మయందేక దేశమా యెందు
కో వాడు నేకాకియై చరించెడు నురక యెందులకొ
వేవిళ్లు నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ప్రకట తైజస శరీరములు పయనించుఁ బాంచ భౌతికము
నకె గాని యిబ్బంది గాలిలో గగనంబు నందునను
నకట జీవున కచ్చమైన వానికి నాకృతి కలదె
వికృతమై నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఆకాశముఁగూడ పంచభూతమ్ము లందునఁ గలదు
ఆకాశ మాకార మగుచు నుండునా యతఁడు జీవుండు
ఆకాశమం దేక దేశమై యుండునా వాడు వట్టి
వీకాశి నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

కడలియుఁ బొంగుగా వచ్చినదియు వెన్కకుఁ దగ్గినదియు
పడియగా నొకచోట నిల్చెఁ బల్లానఁ బడియ తానయ్యెఁ
గడుతెల్వి నే నంచుఁ బొంగె జీవుండుగా నిల్చిపోయె
వెడఁగయి నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

పల్లమ్ములో వచ్చి పడిన యంతలోఁ బడియ కానేల
నల్లనై నీరమ్ము పుట్టి వాసన నాచును నత్త
గుల్ల లేర్పడ నేల కడలి యెపుడు పొంగుగవచ్చు మరల
వెల్లుగా నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఉన్నది యెచ్చటఁబడిన నచటనే యుంటి నంచు నను
కొన్నది యనుకొన్న యంతలో నొక్క కోణ మేర్పడుచు
కొన్నవి యింకఁ జెప్పితివా వట్టిన గుబ్బిసలాట
వెన్నుడా నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఆనతమయి భావమైన యట్టిది యాత్మయు ద్రవ్య
మైనట్టిది శరీరమగుట పరికింప న్యాయము మాయ
యైనది భావమే యది శరీరమెట్లయ్యెఁ జీవునకు
వీనగ నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

నిన్ను నాలోచించిన కొలఁదిగ నవనీతమ్ము లూహా
లిన్నిన్ని వచ్చెడు దీని హేతువు నెఱిఁగితి నేను
మున్ను వే జన్మలందుననూ నీ భావమున మున్కి వచ్చు
వెన్నంటి నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

నా జాతకంబులో ప్రబల మౌచు నున్నది యెవ్వరు గ్రహ
రాజ మో హరిహరాఖ్యంబు వెలుఁగు సారమ్మో ముకుంద!
నేఁజెల్ల నా మానసంబో బృందావనీ ప్రపాలిత గ
వీ జాల నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[చిత్రప్రదీప ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

కొన్ని రోజులలో నగుచున్న దార
ములు నశించు పిదప వస్త్రములు నశించు
నంచుఁ దార్కికుల్ వాదించు నపుడు మేము
అయ్యవిద్య నశింపఁ గల్పాదినుండి
వచ్చు తనువు నశింపగా వలదె వ్యవధిః
కుమ్మరియుఁ జక్రముం ద్రిప్పఁ గొంత కాల
మగును గాదె యాగగ నప్డె యాగునొక్కొః

అప్రమాణముల్ తార్కికు లనున వెల్ల
అనుభవము యుక్తి శ్రుతిని మే మనుసరించి
పలికెదము, మా కశక్యము గలుగు దెందు
అనుభవము చెప్పుదురు జ్ఞానులైనవారు
కుమ్మరియుఁ ద్రిప్పి విడువగఁ గొంతసేపు
చక్ర మట్టులె తిరుగగాఁ జనెడుఁగాదె?
ఆ యవిద్య నశించిన యంతమీద
తనువు కొంత కాలంబుండె నవియె శ్రుతియు.

తార్కికుల వాద మట్లుండు దానికేమి,
స్వయ మనెడు పదార్థమయిన ప్రత్యగాత్మ
అహమనెడు పదార్థమగు జీవాత్మ యొక్క
టనెడు భావము భ్రాంతిచే నావహిల్లె.

పండితమ్మన్యులగుచుఁ బ్రాపంచికంపు
జ్ఞానమే కల్గు తార్కికుల్ మానరాని
మౌర్ఖ్య మూనియు వేద ప్రమాణమును ద్య
జించి, యుక్తినె గొని, భ్రాంతిఁజెంది, ప్రత్య
గాత్మ జీవుఁడు నొక్కఁడేయనుచు నుంద్రు

కొంద ఱా లౌకికులు తార్కికులును గూడ
పూర్వపరము లాలోచింపఁ బోక తమదు
వాదమే సత్యమని యన్యవాదమే య
సత్యమని పల్కుచుంద్రు లజ్జయును వీడి.

పామరులగు చార్వాకులు భ్రాంతిచేత
అక్షిగతమగు స్థూలదేహమె నిజమని
అమల కూటస్థుఁ డాదిదేహాంతమైన
యట్టి సంఘాతమే యాత్మయని వచింత్రు.

తమ మతముగూడ శ్రుతిసమ్మతంబటంచు
పురుషుఁ డన్న మయుడని చెప్పు శ్రుతివాక్య
మునకు దేహ మన్నుండాత్మయనెడు శ్రుతికి
నేమొ చార్వాకులును నర్థమేమొ యంద్రు.

అందులోఁ గొంద ఱీ దేహమందు నుండి
జీవుఁడు వెడలఁ దనువు నశించుటయును
గనఁబడుచునుండెఁ గానఁ దత్తనువుకంటె
నన్యమగు నాత్మ యొకఁ డుండెనని వచింత్రు.

ఏను జెప్పుచున్నానను దానిఁ బట్టి
తనువు కంటె నన్యమయి నేననెడు బుద్ధి
వలనఁ బ్రత్యక్షముగ నెర్గఁబడెడు నింద్రి
యములె యాత్మయటంచు వారనుచు నుంద్రు.

ఇంద్రియము లొకప్పుడు కలహించినట్లు
కనఁబడెడు శ్రుతులందుఁ జేతనము లేక
ఇంద్రియము లెట్లుగాఁ గలహింపఁగలవు
గాన నింద్రియములె యాత్మ యౌ నటంద్రు.

అవని హైరణ్యగర్భాఖ్యులైన వార
లింద్రియములు నిద్రను లోపమొందఁ బురుషు
డుంట ప్రత్యక్షముగఁ జూచుచుంటి, మింద్రి
యములుగా వాత్మ, ప్రాణము లాత్మయంద్రు.

నిదురయపుడు జాగ్రదవస్థ యొదవు నపుడు
ప్రాణవాయువు శ్వాసించు పని యొనర్చు
నదియుఁగాన ప్రాణమె శ్రేష్ఠమనియు శ్రుతులు
ననియె నద్దానఁ బ్రాణమే యాత్మయంద్రు.

ప్రాణమున కనుభవమేమి లేని కతన
మనసునకె యనుభవము నుండిన కతమున
అ యుపాసన పరులయినట్టి వారు
మనసె యాత్మయనియుఁ గొందఱనుచు నుంద్రు.

మోక్షమున కేనియును బంధమునకు నేని
మనమె కారణమనియుఁ దన్మనమె యాత్మ
యనియు శ్రుతులెల్ల ఘోషించు నట్టి కతన
ఆ యుపాసకులు మనస్సె యాత్మ యంద్రు.

బుద్ధి మతికిని గారణమునయి యంత
కంటె లోపలిదై యుండు కారణమున
బుద్ధియే ఆత్మయంచును బౌద్ధులైన
క్షణికవాదులు చెప్పగాఁ గడగు చుంద్రు.

అంతరింద్రియ మే నను నట్లుగాగ
నిది యనియు గాగ ద్వివిధమైనదిగ నుండు
నే ననెడు బుద్ధి నిందు విజ్ఞానమనియు
ఇది యనెడు బాహ్యావృత్తి మది యటంద్రు
కార్య కారణ భావముల్ కలవు చీన

ఇది యనెడు పదార్థమును గ్రహింప నేను
ననెడు నంతః కరణమె యగును నిమిత్త
మే ననెడు బుద్ధి లేకయె యిదియు ననెడు
మనము గలుగదు, కార్యకారణము లివియె.

ఏ ననెడు బుద్ధి వ్యక్తికి నెల్ల యపుడు
ప్రభవమును నాశమును గానఁబడుటచేత
అట్టి విజ్ఞానము క్షణిక మనుచుఁ దనదు
చేతనే తెలియఁబడుటచేత క్షణిక
వాదులదె స్వప్రకాశ రూపమనియంద్రు.

బుద్ధియే జీవుఁడని వేదములు వచించె
జనన నాశ సుఖాదికమ్మును మొదలుగ
అఖిల సంసృతి జీవున కగు నటంచు
క్షణిక విజ్ఞానవాదులే యనుచు నుంద్రు.

మెఱపు మెఱసి యంతనెపోవు తెఱఁగు గాగ
బుద్ధి పుట్టి తత్ క్షణమందె పోవుఁగాన
నాత్మగాదు విజ్ఞానముకన్న నవ్య
మేమి కనుపింపకుండిన హేతువునను
మాధ్యమికులు శూన్యమ్మె యాత్మయని యంద్రు.

సృష్టికిని బూర్వ మీ జగమ్మేమి లే ద
టంచు వేదంబులే వచియించెఁ గాన
జ్ఞానరూపము నజ్ఞాన కల్పితంబు
నగు జగము భ్రాంతిచేతనే యయ్యె నంద్రు

భ్రాంతియును నిరాధారమై పరగబోదు
భ్రాంతి పడువా డొకండుండ వలయుఁగాదె.
శూన్యమని చెప్పువాడు తచ్ఛూన్య మెఱిఁగి
చెప్పవలయు, శూన్యము దెలిసికొనుచుండు
వాని నొక్కని నొప్పగా వలయుఁగాదె?
అట్టి శూన్య సాక్షియె ఆత్మయగును గాన
ఆత్మ యొకఁడున్నదని యొప్పనగును, నొప్ప
కున్న శూన్యవాదమె శూన్యమన్నది యగు.

అట్టి విజ్ఞానమయమున కాంతరమగు
నట్టి యానంద మయ ముండెననియె శ్రుతియు
అట్టి యానందమయమె తదాత్మ యంచు
వేదముల నెఱింగిన వారి వాద మగును.

నిగమమే తమకుఁ బ్రమాణమగు నటంచు
ఆత్మ పరిమాణమును గొంద అణువటంద్రు
కొందఱాత్మ మధ్యమమంద్రు, కొందఱాత్మ
అంతమును లేనిదని వాద మాచరింత్రు.

అధిక సూక్ష్మములౌ నాడులందు నాత్మ
తిరుగుచుంటచే నణువని తెలుపుచుంద్రు,
వెంట్రుకకు సహస్రాంశమై యుండు నాడు
లందు నాత్మ సంచారము నాచరించు.

ఆత్మ యణువంతవాడు తదణువుకంటె
నధిక సూక్ష్మమౌ పరమాణు వంతవాడు
సూక్ష్మమునకంటె సూక్ష్మ దంచును సహస్ర
ముఖములుగ నణువును వేదములు వచించు.

జీవుఁడన వెంట్రుకను నూఱు చీలికలుగఁ
జేయ నది యెంత సూక్ష్మమో జీవుడంత
సూక్ష్మతము డంచు మఱియొక శ్రుతియుఁ జెప్పు
అందుచే జీవుఁడతి సూక్ష్మఁడనఁగఁదగును

బౌద్ధ వాదులందున దిగంబరులు, పాద
మాదిగా మస్తకంబు పర్యంతముగను
ఆత్మ వ్యాపించియుండిన యట్టి కతన
ఆత్మ మధ్యమ పరిణామమంద్రు వారు.

తనువునందు చొక్కా దొడ్గికొనిన నదియు
దేహమెల్ల వ్యాపించిన తీఱు గాగ
ఆత్మ సూక్ష్మావయవము లైనట్టి నాడు
లందు సంచారమును జేయునట్టి కతన
ఆత్మకును చలనము కల్గి నట్లె కాదె?

ఆత్మ మధ్యమ పరిణామ మైనయెడల
పాపపుణ్య కర్మంబుల వశముచేత
నొక్కయెడ గొప్ప దేహంబు నొక్కయెడను
అల్పదేహంబు కలుగదే యందు వేని
గొప్పదేహంబుగాని యా కొద్ది దేహ

అలా ఉంచి చరిత్రలో కానవస్తున్న సంఘటనలు, గుణపాఠాలు దీనికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నవి. 1905 లో ఒక బ్రిటిష్ సైనికదళం లాసాపై దండెత్తిన విషయం మనకందరకు తెలిసినదే ఈ దండయాత్రను టిబెట్ సైనికులు మొదట్లో చాల ధైర్యసాహసాలతో ఎదిరించారు 'సీసం మిమ్ములను ఏమీచేయకుండ మామంత్రశక్తులు మిమ్ము రక్షిస్తుంటాయి, అని టిబెట్ మతగురువులు వారిలో కలిగించిన విశ్వాసమే దీనికికారణం. కాని గురువులు తమ మంత్రశక్తులను గురించి ఎంతగా ప్రబోధించినా టిబెట్ సైనికులు మృత్యుముఖాన పడనే పడ్డారు; వెంటనే గురువులు కారణం వివరించారు బ్రిటిషువాళ్ళ తుపాకిగుండ్లకు నికెల్ ఉన్నదనీ, అందుచేత సీసంమీద ప్రయోగించిన తమ శక్తులు నికెల్‌మీద పని చేయలేకపోయినవనీ సాకు చెప్పుకొన్నారు. గురువులు; ఈ సంఘటన అనంతరం బ్రిటిషు సైనికులను టిబెట్‌లో ఎదిరించినవారేలేరు మొదట్లో అంధవిశ్వాసంతో తీవ్రపోరాటం సాగించిన సైనికులు చచ్చిపోవటంచేత, చావక మిగిలిన వారు ఈ అంధవిశ్వాసంతో మోసపోయామని విసిగి పశ్చాత్తప్తులు కావటంచేత బ్రిటిషు సేనలను ఎదిరించేవారు లేకపోయారు. అలాగే స్పెయిన్‌రాజు రెండవ ఫిలిప్‌నికూడ ఈ సందర్భంలో ఉదాహరణగా చూడవచ్చు. మతవిశ్వాసంలేని ద్రోహులపై, దైవద్వేషులపై తాను సాగిస్తున్న యుద్ధాన్ని దేవతలు తప్పక దీవించి విజయం సిద్ధించేటట్లు ఆశీర్వదిస్తారన్న విశ్వాసంతో ఆంగ్లేయులతోను టర్కులతోను యుద్ధం చేయటంలో గల తారతమ్యాన్ని గమనించనవసరంలేదనుకొన్నాడు రెండవ ఫిలిప్, ఫలితంగా పరాజయం పొందాడు ఇది ఇలా ఉండగా నేటి ప్రపంచంలో మరొక భావంకూడ ప్రబలంగా ఉన్నది ఒకప్రక్క అంధవిశ్వాసాలకు అంటిపెట్టుకొని ఉంటూ మరొకప్రక్క ప్రజలు శాస్త్రీయదృక్పథంతో వ్యవహరించగల అవకాశమున్నదని చాలమంది భావిస్తున్నారు వాస్తవిక పరిస్థితికి సత్యానికి విరుద్ధమైన అంధవిశ్వాసాలను ప్రజలకు ప్రబోధిస్తూనే మరొకవంక మరికొన్ని విషయాలలో ఆ ప్రజలే శాస్త్రీయ మనస్తత్వం పెంపొందించుకొనగలరని ఆశిస్తున్నారు. ఇది సత్యమూకాదు, సంభవమూకాదు మానవుడు ఒకవంక అంధవిశ్వాసాలతో మరొకవంక హేతువిచారంతో ప్రపంచంలో వ్యవహరించలేడు. వీటిరెంటిని సమ్మేళనం చేయబూనటం జరగనిపని హేతువిచారాన్ని అనుసరించటమంటే ప్రపంచంలో కానవస్తున్న సాక్ష్యాలను వాస్తవ పరిస్థితులను గమనించటం, వాటి కనుగుణంగ తన భావాలను దృక్పథాన్ని మార్చుకోవటం. మానవుడుకొన్ని విషయాలలో ఈ దృక్పథాన్ని అనుసరిస్తూ మరికొన్ని విషయాలలో ఈమార్గాన్ని త్యజించి దానికి విరుద్ధమైన అంధవిశ్వాసాలకు తల ఒగ్గటం అసంభవం ఒకవంక సాక్ష్యంతో వాస్తవికాధారాలతో నిరూపించలేని గుడ్డినమ్మకాలను విశ్వసించమంటూ మరొకవంక శాస్త్రీయ మనస్తత్వం అభివృద్ధి చెందిందని ఆశించటం గగనకుసుమాన్ని ఆఘ్రాణించ యత్నించటమే అవుతుంది

ప్రయోజనకారులూ సుఖదాయకాలు అయిన అబద్ధాలసాయం లేకుండా జీవితంలోని ఎగుడుదిగుళ్ళను, కష్టనష్టాలను, ఆటుపోటులను ఎదుర్కొనలేని మానవునిలో ఏదో బలహీనత, కొంత నైచ్యంకూడ ఉన్నదనే చెప్పాలి. జీవితాన్ని ఎదుర్కొనలేనివారు జీవితంలోని ఆటుపోటులను తేలిగ్గా నివారించగల కొన్ని అబద్ధాలచాటున దాగుకొని, అవేతమను కాపాడుతాయన్న విశ్వాసంతో బ్రతుకును దొర్లిస్తుంటారు కాని ఈ విశ్వాసం కేవలం నిర్హేతుకమైనదని అబద్ధమనీ అతనికి కూడతన అంతరంగంలో ఎక్కడో ఒకచోట తెలిసే ఉంటుంది అయినా ఆవిశ్వాసం తనకు కొంత సుఖదాయకంగా ఉండటంచేత దానిని విశ్వసిస్తాడు; విశ్వసిస్తున్నట్లు భావించుకొంటాడు. ఈ విశ్వాసం కేవలం నిరాధారమైన భావమని అతనికీ తెలుసు, కాని ఈ భావాన్ని అతడు ఎదుర్కొనలేడు, ఈ విశ్వాసం కేవలం అబద్ధంఅన్న సత్యాన్ని

మతము - పరివర్తన - విశ్వజనీనత

డాక్టర్, శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ

ప్రపంచము నందలి మతము లన్నిటి నడు నొక సమైక్యము కలదని నేను తలంచునది నిజమే. వాస్తవమునకు ఆయా మతములు వానివాని చారిత్రక మైన ఉపాధినిబట్టియు మనస్తత్వ రీతిని బట్టియు విశిష్టములైన ఆకార ప్రకార ములను కలిగియున్నవి తక్కిన దేశము లందు వలెనే భారతదేశము నందుగూడ మతమనగా మానవ స్వభావక్రమ పరి ణతియే యని వక్కాణింప బడు చున్నది. ఇది కేవల బాహ్యావరణము కాక ఆంతర మనోరూపమైనది మొహంజదారో హర ప్పాల నాటినుండి గాని,బుద్ధాదియోగుల నాటి నుండిగాని భారతీయ మత చరిత్ర చిహ్నములను గమనించినచో, తమతమ మనోంతరములందు కళ్యాణగుణ పరిణా హమునకై ధ్యానసమాధి నిష్ఠులును, నిమీలిత నేత్రులును, పద్మాసనస్థులు నగు మహావ్యక్తులు కానవత్తురు.

నేడు మనము బుద్ధి ప్రధానమగు యుగమున నుంటిమని మన యుపనిష త్తొకటి చెప్పుచున్నది. విశ్వజనీనమైన యీ నవపరిణామమున మనకు పదార్థ ము ప్రాణము జాంతవమనస్సు బుద్ధివిభ్ర మము కలిగియే యున్నవి. విభేదవిరోధ ములకు కారణమైన యీ బుద్ధి విభ్ర మము విస్తృతమై వికాసవంతమైన చైత న్యముగా రూపెత్తవలెను. తమ అసం తృప్తికర పునరుజ్జీవనరహిత పరిస్థితినుండి వివేకమును ప్రేమను పొందజాలుటకు వ్యక్తులకు సహాయపడుటయే మతము యొక్క పరమార్థము. మనోనిశ్చలత సంఘప్రేమ- ఈరెండే మతమునకు సార భూతములని యుపనిషద్వాక్యము. ఆంతర మనస్సునకు సంబంధించినంతవరకు నిర్భయముగానుండుట, ప్రాపంచికదృక్ప థము మేరకు సర్వజీవుల యందును ప్రేమ బద్ధులగుట- అను నివి మతముయొక్క ఆంతర బాహిర చిహ్నములు. బుద్ధబోధ పరికించినచో- మన మవిద్యాదశయం దుంటిమనియు, విజ్ఞానసీమల నుండ వలయుననియు నాతడు సైతము చెప్పు చున్నాడు. తన తొలినాళ్ళలో విజ్ఞాన సాధనకై బుద్ధుడు ముప్పదియైదేండ్లు పరిశ్రమించినాడు. తత్సాధనానంతరము మానవజాతి ముక్తికొరకై తన జీవితము నందలి మిగిలిన నలువదియైదేండ్లును తన సిద్ధాంతమును, ఆంతరనైశ్చల్య బాహిర ప్రేమతత్త్వమును వ్యాపింప జేయుట కాతడు కృషి యొనర్చెను

అంతేకాదు. మాయా వాదముపై నాధారపడిన మతములన్నియు నిదే తత్త్వమును బోధించినవి గ్రీసును తీసి కొన్నచో- ప్రాపంచిక విషయముల నుగ్గ డించుట కాక మనల నొక నవీనమానసిక స్థితి యందుంచుటయే మతమునకు లక్ష్య మని అరిస్టాటిలు వాదము. ఇదే మాయా వాద మతముల లక్ష్యము. నీడలనే పరమ సత్యములుగా భ్రమించుచు మనము కేవ లము ఛాయాజగత్తునందే నివసించు చున్నామనియు, ఒక బుద్ధిమంతుడు ఈ సంకెళ్ళను పగుల్చుకొని, తల తిరిగి, సత్యము గ్రహించి, గుహాయందలి యగ్ని యాకసమున ప్రకాశించు సూర్యుని

యొక్క చిన్న ప్రతిబింబము మాత్రమే యని కన్గొనెననియును ప్లేటో కూడ పేర్కొనినాడు. నీ ఆత్మచుట్టును పరిభ్ర మించుచు, ఈ కానవచ్చు నీడలన్నియు తనయొక్క అల్పాల్ప ప్రతిబింబములుగా గల ఆ పరమార్థమును నీ యాత్మ గోచర మొనర్చుటయందే వేదాంతసార మిమిడి యున్నది. దృక్పథముల్లో భేదము, దర్శ నములో భేదము, ఒకానొక మానసిక స్థితి-ఇదే వేదాంతసారము. సుందరమైన ఆత్మసిద్ధిని గూర్చి మాట్లాడునెడ ప్లాటినస్ ఇట్లు చెప్పెను. నీ స్వభావములో నేదేని వికారము కానవచ్చినచో, ఒక చక్కని విగ్రహమును నిర్మించుశిల్పి యెట్లొకచో చిత్రిక పట్టియు,నింకొకచో నరకివేసియు వేఱొకచో పుష్టి గూర్చియు, మఱొ క్కచో మెరుగులుదిద్దియు దానినిసుందర మొనర్చునో, అట్లే నీవును చేయుము. నీ స్వభావమును సుశిక్షితముచేసికో,అప్పుడు నీవు నీ జీవితమును నీ స్వభావమును ఈ నిర్మలదేవాలయ సమ్ముఖమున నిలుచు, నొకానొక వస్తువుగా మలచుకో గలవు. మత మనగా ప్లాటినస్ భావమదే.

యూదుల విషయము చూతము.వారి దృష్టిలో మానవాత్మ అనగా దేవుని చేతి దీపము. అది వెలిగించబడియున్నచో నీవు దేవతాత్మను దర్శించగలవు. ఎజ్‌కిల్ భగ వంతునిచే నిట్లు పలికించినాడు. "నేను నీలో నూత్నశక్తిని ప్రవేశపెట్టెదను. రాతిగుండెను తీసివేసి, దాని స్థానమున మృదుమాంసల హృదయమును పెట్టె దను" అని. మతమనగా నాంతర పరిణ తియేయని యిచటఁగూడ నాతనియుద్ఘా టన. ఇది నీ దృక్పథముయొక్క యొక నూతనావిష్కృతి. ఇది బయటి ప్రపంచ మునకు సంబంధించినది కాదు; నీలో నీవే చేసికోవలసినది. మానవుడు మేధాసంప న్నుడైన మాత్రమున నాతఁడు పూర్ణ పరిణామము నందినట్లు కాదు. తరువాతి పరిణతి యాతని భౌతికరూపమునఁ గాఁజాలదు ఆంతరపరిణామ సాధకమైన భౌతిక పరివర్తనను తేఁగలరీతిగా నాతని భౌతికప్రకృతిలో పరిణతి కలుగవలెను. అదే మతమునకు పరమార్థము.

"నేనే సత్యమను" అని ఏసుక్రీస్తు చెప్పినప్పుడు, పునర్జన్మ పొందనివాడు దివ్యసామ్రాజ్యమునఁ బ్రవేశింపఁజాలడని యాయన చెప్పినప్పుడు, మనము ఉత్త ములుగా పెంపొందవలయునని బాప్టిస్టు జాను చెప్పెనని ఏసుక్రీస్తు' క్రైస్తవ మతము పేర్కొనినప్పుడు, మనము వేఱొక్క రూపెత్తవలయు ననుటయే యుద్దిష్టము. Metanoia అన్న గ్రీకుపద మునకు ఆ సందర్భమున Repentance అని చేసిన అనువాదము సరికాదు. Metanoia అనగా చైతన్య శక్తియందలి మార్పు. అసలు ఉనికియందే మార్పు. భౌతికజన్మ పొందిన వాడీ భౌతికజగత్తును మాత్రమే చూచుననియు, స్వాంతర్భా తుడైనవాడు పరలోకమును గాంచు ననియు మహమ్మదును గురించి వ్యాఖ్యానించుచు నాతని యనుచరు డొకఁడు చెప్పెను. ఈ మతప్రవక్తలు మాటాడినతీరును గమనించినచో, వారు పరిసరముల పునర్నిర్మాణమును లక్షిం చుటలేదని స్పష్టపడును మానవుని ఆత్మ పునర్నిర్మితమైనప్పుడు పరిసరములన్నియు దానితోపాటే మారిపోవును. కనుక

మతముయొక్క లక్ష్యము ఆత్మ పునర్ని ర్మితియే. దీనినే పునర్జన్మ అని, ద్విజత్వ మని, పరిణామమని, విజ్ఞతచే నజ్ఞతా విచ్ఛేదమని, వెలుగుచేత చీకటి తొలగిం చుటయని యందుము. ఈ పునర్జన్మయే మన మాశించిన పరమ పరిణామమునకు మనలను కొంపోవునది. తానేమిగా పరిణ మించవలెనో ఇంతవరకు మానవునకు స్పష్టముగా తెలియదు. "కై స్త్రవేతర మతములందు బుద్ధిమంతులును ఆత్మవేత్త లును ఆత్మస్థుడైన పరమపురుషుని ప్రతి పాదించువారును కానవచ్చుట నాకు సంతృప్తిని సంతసమును గల్గించు విష యము." అని విలియమ్‌లా చెప్పి యున్నాడు.

అది యాతనికంత సంతృప్తి సౌఖ్యా ముల నొడగూర్చునట!

మనము మతమును- సంకుచిత స్తబ్ధ మార్గమునగాక మూర్ఖ విచ్ఛిన్నమార్గ మున గాక, మన దృక్పథమునలో మనము తేవలసిన సచేతన పరిణామమను దృష్టితోఁ జూచినచో అన్ని మతముల యొక్క మూలసిద్ధాంతములకు సంబం ధించినంతవరకు అత్యంతమైత్రియే మనకు గానుపించును. ఆత్మపరిణామ సమర్థు లును, అసంకుచిత దృష్టులై, పరిణత బుద్ధులయందొక సామాన్యము దర్శించు వారికి అన్యమతస్థులలో నిశిత మతదృష్టి కలవారితోడి సంబంధమే, తమ అను యాయులతోడి సంబంధముకంటె నధిక ముగా నుండును. వారి అనుయాయు లకు మతదృష్టి ప్రధానముకాదు, వారు మతమును బుద్ధితోగాక, ఆవేశముతో గ్రహింతురు. అట్టివారితో కంటె మత దృష్టికల యన్యమతస్థులతోడనే వారికి ఏకీభవనము. ఈనాడు పరస్పర సుదూర ములుగా గానవచ్చు మత వృక్షముల మూలములన్నియు నొక్కచోఁ గలి యును, తలలు నొండొంటితోఁ గూడి యాడును.

ప్రపంచమునకు ఒక బలవత్తరమైన పునాది కావలెనని నచో, అందుకు ఆర్థిక రాజకీయములు పనికిరావు. విశ్వమానవ సమాజమును నిర్మించుట మనస్సు యొక్కయు ఆత్మయొక్కయు విలువల పైనె మాత్రమే సాధ్యము. ఒక జాతీ యుల నందరను గలియగట్టు జాతీయాశ యముల మాదిరిగానే,విశ్వమానవ సమాజ మునకును గొన్ని యాశయము లవశ్య ము కావలెను. ఎల్లమానవుల నేకీభవింప జేయవలసిన మతము దురదృష్టవశమున నేడు పరస్పరవిభేదములకు కారణమగు చున్నది. అది ఒకజాతి రాజ్యమువలె నైనది ఒక కొఱగాని పౌరుని మనవా డనియు, ఒకఉత్తముడైన క్రొత్తవానిని మనవాడు కాడనియు విజాతీయుడని యుఁ జెప్పుచున్నాము. మన మనుస రించుచున్నదృక్పథమిదే కనుక ఈనాడు మన కన్నులముందు రూపొందుచున్న ఈ విశ్వమానవసమాజము మనకు స్వాగత మిచ్చుచున్నది ఆ సమాజమున మనలఁ జేరఁగోరు చున్నది. నిస్తంద్రులైన నిరం తర సత్యాన్వేషకులు, జాతి మతముల అవధులు దాటిన ప్రేమారాధకులు అగు వారే నేడు మనము నిర్మింపఁజూచుచున్న నవసమాజమునకు మూలస్తంభములు.

పదిదేండ్లు ఇట్టి తాత్విక విషయము లపై వెచ్చింపఁబడిన నాసుదీర్ఘ జీవితాను

భవముతో నేనిదే యనుకొనుచున్నాను. ఆక్స్‌ఫర్డ్ మున్నగుచోట్ల నేను క్రైస్తవుల చర్చిలలోను, ముసల్మాన్ల మసీదులలోను, బౌద్ధారామములలోను, యూదు కేంద్రములలోను, హైందవ దేవస్థానములందును నేను నాబుద్ధికిగాని ఆత్మవిశ్వాసములకు గాని నిర్బాధముగా ప్రసంగించియున్నాను. నే నీరోజాక ప్రార్థనామందిరముననుండగా నొక నీగ్రోగీతము వింటిని. "వారు నా ప్రభువును బలిగొన్నప్పుడు నీవక్కడ నుంటివా?" యని యాగీత మారంభమగును. దానిపై నాయభిప్రాయమును వారు కోరిరి "ప్రభువును అధికారమనెడు సిలువపై, ఆక్రమణమును సిలువపై, విగ్రహపూజయను సిలువపై, జాతీయ దురహంకారమను సిలువపై మనము బలి చేసినప్పుడు మనమక్కడనే యుంటిమి. మనము ప్రభువును బలిగొనుచున్నప్పుడు మన మచ్చటనే యుంటిమి." టాబర్నాకిల్ నుండి ప్రసారితమైన గీతముపై నేను చేసిన వ్యాఖ్యానమిది నేను పొరపడి యుండవచ్చును. నా వాఖ్యానములో దోషము ఉండగూడదని నేనను. మేము కేవలము విద్యార్థులము, కృషి చేయుచున్న వారము. ఈ సమస్యపై నా కొలది యనుభవమును మీకు దెలుపుదును.

నాగరికతలను నిర్మించినది ఇంజినీర్లు గాని, పారిశ్రామికులుగాని, సేనాపతులు గాని కారు. ప్రపంచమునకు జ్ఞానదాన మొనర్చినవారే వివిధ సంస్కృతులను నిర్మించిరి. గ్రీకు సంస్కృతి నిర్మాతలగు ప్లేటో, సోక్రటీసు, పెరికిల్స్ మున్నగు వారిని, భారత సంస్కృతి నిర్మాతలగు ఉపనిషత్కర్తలను బుద్ధాదులను,కమ్యూనిస్టు సంస్కృతి నిర్మాతలగు మార్క్సు మున్నగువారిని జూచినచో మనకీ విషయము స్పష్టమగును. తన భావములతో నీ ప్రపంచమును కదిపితినని మార్క్సు చెప్పికొనినాడు. తక్కిన అన్నింటికంటె ను భావములే ప్రపంచమును మిక్కిలి కదలించి వేయును. సత్యాన్వేషియును, మతమౌఢ్య నియంతృత్వములకు వ్యతిరేకముగా స్వతంత్రభావనా స్వామ్యపరిరక్షకమును, ఒక యంశమును తిరస్కరించుటకు ముందు దానిని అర్థము చేసికొనగోరునదియు, అంతిమ నిర్ణయము మనది కాక భగవంతునిదే యని చెప్పునదియు అగు తాత్త్విక దృక్పథమున్నచో, తప్పు చేయువాడు దుష్టశక్తుల ప్రోద్బలమువలననే అట్లు చేయుచున్నాడని మనము అర్థము చేసికొనగలిగినచో, ఎదుటివానికి విద్యాబుద్ధులు గఱపి, వాని ప్రస్తుతస్థితికి కారణమేదో తెలిసికొని, వాని పరివర్తనకు కృషి యొనర్చుటే మనపరమకర్తవ్యమని మనము చెప్పజాలినచో, అప్పుడు మాత్రమే మనకు 'తక్కినవారి యెడల కొంత సానుభూతి యున్నట్లగును.

రెండు మూడునాళ్ళ క్రితము బెర్ట్రాండ్ రస్సెల్, హలాషీ, షిజర్, ఆర్థర్ కాంప్టన్ మున్నగువారి ప్రసక్తివచ్చినది. వీరు నానాదేశములవారు. కాని వారు ముఖ్యముగా ఆయాదేశముల పట్ల దురభిమానము కలవారు కారు. "మీదేశము అన్యాయముచే మోసముచే దౌర్జన్యముచే స్వాతంత్ర్యము పొందవలెనని కోరినచో నాదేశము నశించుగాక" అన్న గాంధీమహాత్మునివలెనే వారును జాతీయ

దురభిమానదూరులే. గాంధీజీ రవీంద్ర నాథటాగోరున కొక లేఖలో నిట్లు పేర్కొనెను. "పతితమైన అభాగ్య భారత దేశము తనకు దానుగాని, ప్రపంచము నకుగాని సహాయపడజాలదు. స్వతంత్ర మైన విజ్ఞానవంతమైన భారతదేశము మాత్రమే తనకుదానుగాని, ప్రపంచము నకుగాని తోడ్పడగల్గును. నా దేశమునకు నేను స్వాతంత్ర్యము గోరునది అవసర మగుచో మానవజాతి శ్రేయస్సును పరి రక్షించుటకై నాజాతి ఆత్మార్పణమొన ర్చుటకే."

గాంధీజీ జాతీయవాదమట్టిది. ఆయన ప్రబోధించినదదే. భౌతికశక్తుల పరాజయ మును ఆధ్యాత్మికశక్తుల విజయమును దెలుపు శిలువను మనమారాధించు చున్నాము. కాని మన ఆధ్యాత్మిక భావ ములను వదలుకొనుటకును సిద్ధపడు చున్నాము. గాంధీమహాత్ముడు మత మునుగూర్చి ఇట్లు వక్కాణించెను. "మత ము విలువలు విశ్వజనీనములు. జాతీయ ములైన విలువలు సంకుచితములు. మనము విశ్వజనీనమైన దానికంటె సంకు చితమైనదాని నెన్నడును గొనియాడఁ గూడదు."

*

బిరుదప్రదానము

శ్రీ అయితం కాశీపతిప్రసాదరాయకవి

౨

జిత కాళిదాస బిరుదము నతికించుకొనంగఁ దలఁచి యటిముట్టినేమో?
మతిలోఁ దబ్బిబ్బుపడిన మతిమంతుఁడ వీవె గదర! మందప్రజ్ఞా!

పురుగానేఁ గనినప్పుడె హరియింపఁగఁ బడెను నీదు నఖిల ప్రజ్ఞల్
ధరణిని పీడిన కవి సెక్కరణిని నాడినఁ దగునని గర్వించితివా.

గతి నీకిడి గతియించిన మతిమంతులకీర్తిఁ గొనఁగ మాయలు సేయన్
జతనంబులు చేసెదవా? మృతులెదురుగఁ బలుకరనుచు మిథ్యాదృష్టీ.

అనిన స్మేరువు దిద్దిరం దిరిగి మూర్ధాస్థానిఁ బడ్డట్టు నే
మన నోరాడక రిత్తచూపులను నత్యంత భ్రమాలోలతన్
దనువల్లాడఁగ వక్త్రముం దెఱచి విధ్వస్తాఖిల ప్రజ్ఞ నా
తని దిక్కేనియుఁ జూడ నోటువడి స్రస్తస్పష్టదంభుండనై.

ఝంఝామరుత్తుచే సన్నజాజుల తీగె
తడఁబడునటు వడవడ వడంకి;
ఘనఘనా ఘనముచేఁ గలహంసశాబంబు
పదము తొట్రిలులీల నదరి చెదిరి,
గురుధరా ధరముచే మరలిన సెలయేటి
నీటిచాలనఁ దొట్రుపాటు చెంది
ఖరకరాంశువులచేఁ బరితప్తమైనట్టి
పంకజాకరమన నింకఁ బాఱి,

భద్రగజము చెంతఁ బడిన దోమవిధానఁ
బెద్దపులిని డాయు పిల్లివోలె
నంతరంబు స్పష్టమై యాతనికి నాకు
దోఁచనెటి దిక్కుఁ దోఁచదంత

మృతినిగన్న పాముమీఁద నెక్కినవాఁడు గట్టితోడఁ దానిఁ గొట్టువాఁడు
తద్ధరాచ్ఛలన విధాన బమ్మెరవోవు తీరుగాఁగఁ దెల్విజాఱె నాకు.

ఎటులో ధైర్యముపూని గొంతువడఁకన్ హీనస్వరంబెత్తి నీ
భటుఁడన్ దాంభికుఁడన్ ననున్ దయ క్షమింపంజూడు మీ యంచు నా
నిటలంబందునఁ గేలుసేర్చి కరుణా నిర్నిద్రభావంబునన్
పటు కోపంబును వీడుమీ! ఎవఁడవో వాక్రువ్వుమీ వేఁడెదన్.

సాక్షాత్కారము చెందినట్టి కమలాబ్జాతాక్షి నాథుండవో
అక్షిద్వంద్వము ధన్యతంబఱగ నాకై వచ్చు వాజ్ఞేతవో
కుక్షిన్సర్వము నిల్పినట్టి కవితాకూలంకష ప్రజ్ఞతో
నక్షీణాకృతి నాకుఁగా నిలుచు వా వ్యాసుండవో! తెల్పుమా!

దృష్టిధ్వంసముచేయు తేజున నదృష్టైధ్య ప్రభావంబునన్
స్రష్టన్మెచ్చుని వాగ్గభీరతను విస్పష్ట ప్రకాశంబునన్
నష్టప్రజ్ఞుని నన్నుఁ జేసిన కళానై పుణ్యతన్వ్రజ వా
ఙ్మృష్టిన్నిల్పిన నీ వెవండవు విభూ! పూజించెదన్దైల్చెదన్.

నీ యీ రూపము లోకవంద్యము, కళానీకంబు దుర్వారమున్
ధీయుక్తుల్ధరణీ ప్రకంపన విధాదీక్షా ప్రదక్షంబులో
ధ్యేయా! మ్రొక్కెద సన్నుతించెద నెదం దీర్తున్ భవత్పాదముల్
నా యజ్ఞానముఁ బాపవచ్చిన రమానాథుండవో దెల్పుమా

కలకంఠ స్పృహణీయ మాధురిమచేఁ గంబు ప్రభోదార ని
స్తుల గంభీర సినాద మేదురతచే సూరి ప్రజానీక మం
జుల సంస్కార గిరావధీరణ కళాశోభావ సద్వాక్కుచే
విలసిల్లె న్వచనంబు నీయది విభూ! విద్యాసతీనేతవా!

దుర్నిరీక్ష్య హిమాద్రితోఁ దులఁదూగు ను
 న్నత శిరంబునకుఁ బ్రణామమయ్య
తరణేందు బింబ ప్రథాకాంతులం గ్రక్కు
 కన్నుదోయికి నమస్కారమయ్య
తొలఁగి పారెడు గాంగఝురులఁబోలు లలాట
 వితత రేఖాళికి నతులు తండ్రి
ప్రతిభా విభాస్వర భానూత్కరము గ్రమ్ము
 సుందరాస్యమునకు జోతలయ్య

జన్మ జన్మాంతరా కల్ప్య సర్వపుణ్య
సంచయానంత ఫలము గాన్పించినటుల
నెట్టయెదుటను హరి పొడగట్టినటుల
ప్రేమతోడుత సాక్షాత్కరించినావు.

నీ నిస్తుల్య పవిత్రవాణి యిట సందేశంబు నేమిచ్చునో
నీ నిత్యప్రతిభా ప్రభావగతి దే ని న్నాకు నిర్మించునో
నీ నిర్వాహకమందు నాకిచట రాణింపంగ నున్నట్టి బో
ధానందామృతధార లెట్టివియొ? దేవా తెల్పవే దాఁసుడన్.

పాదంబు గడుగంగఁ బాద్య మిచ్చుటలేదు
ఆకస్మికంబైన రాక వలన
బసిఁడి సింగపుగద్దె యొసఁగంగ నిటలేదు
చాపకు గతిలేని స్థలముగానఁ
గొసరి పూజింపంగఁ గుసుమోత్కరము లేదు
బడుగు పేదల యాకు గుడిసెగాన
దినఁగఁ బెట్టఁగ నీకు దివ్యాన్నమిట లేదు
పిడికెడన్నము లేని పేదఁగానఁ

గాని కన్నీటిచాలు నిక్కంబు మనసు
స్వచ్ఛతరవాక్కుఁ గవితా రసంబుగలదు
చరణమొత్తెడు శక్తి హస్తములఁ గలదు
తన్ను మోర్చెదఁగానిఁ నాతావు విడకు.

చంద్రమశ్శీతలంబు విశాలతరము
నిర్మలంబు నుదాత్తంబు నిస్తులంబు
హృదయ భాజనమందులో హృద్యసరస
భావఫలములు గలవు! దేవా గ్రహింపు.

జన్మ జన్మాంతరాత్త తేజముల నొప్పు గంధ గంధిలబుధ హృద్వసుంధరంబు
కవనకల్పక సుమజాల కల్పితంబు లలితగుచ్ఛంబు గలదు పూజలకు దేవ.

ఈ రూపం బీ తేజము నీరాజసమీ గభీరనిస్తుల దృగ్వ్యా
పారం బీ యాజ్ఞలు లోకారాధ్యోన్నత కవీశ్వరావలి కొప్పున్.

ఏ దేవుఁ బూజించి యేతల్లి కడుపార
నినుఁ గనఁగలిగెనో వినఁగవలతు
నేమహి నీజన్మధామమై యేపారి
చెలఁగె విఖ్యాతినిఁ దెలియవలతు
నే చక్రవర్తుల కిడితివో స్వర్గంబు
నెఱ కబ్బములనిచ్చి యెఱుఁగవలతు
నెవరు నీకాలాన నెసలారి నీమూర్తిఁ
జేయెత్తి మ్రొక్కిరో చెప్పవలతు

నెట్టిచోటుల మెట్టియే మట్టియందు
హైమసంపదఁ దీప్తితో యరయవలతుఁ
బేరు నీకేమి? నీయొక్క బిరుదమేమి?
దానుఁ దెల్పవచ్చిన కాళిదాసువేమొ ?

దేవీపాద సమర్చనాత్తమయి సందీపించు మందారమై
జీవద్రత్న కళాభిరామమయి యక్షీణాను భావాబ్ధియై
లావణ్యాస్పదమై ప్రకర్షచణమై లాలాట హేమాద్రిపై
శ్రీ విన్యాసము జూపు కుంకుమము గౌరీ భక్త భాగ్యంబగున్.

భ్రాంతి ధ్వాంతవినీల మానసము భాస్వచ్ఛేముషీ కౌముదీ
కాంతి క్రాంతిని గాంతమయ్యె, బుధరాట్కల్యాణ కల్యాదృతిన్
చెంతన్నిటు నిల్చు మాత్రమున; నిషేపింతు నీపాదముల్
స్వాంతంబందు కళానిధీ! వసుమతీ భాగప్రవీణారతిన్.

స్తంభింపంబడె సర్వగర్వమును వాక్స్తంభంబునుం గల్గెడిన్
జృంభింపంబడె భక్తిభావము త్వదాశీర్లోభ భావంబునన్
గంభీరత్వము గొల్లవోయె దురహంకారంబుతో గూడనన్
దంభ ప్రజ్ఞునిఁ దెల్పవచ్చితె! కృపార్ద్రస్వాంతం రూపంబునన్.

నిక్కనిక్కి పొంగి త్రొక్కని దారులఁ
ద్రొక్కి తుళ్లి త్రుళ్లి దొరలిపాఱు
నట్టియేఱు జడధి నడుగాటి రూపఱు
గతిని నాదుశక్తి గళిత మిచట.

గ్రంథ సమీక్ష:

ఆముక్తమాల్యద - పర్యాలోకనము

రచన: శ్రీ వెల్దండ ప్రభాకరామాత్య

వెల. రు 6-0-0

ప్రతులకు: సాహిత్య నికేతనము

248/బి, నల్లకుంట, హైద్రాబాదు-1

తెలుగున పంచకావ్యములలో పట్టాభిషేక భాగ్యమునకు నోచికొన్న ప్రౌఢప్రబంధరాజ మాముక్తమాల్యద గీర్వాణకావ్య పంచకములోని కిరాతార్జునీయమువలె, వనవల్చు బాలపఠితలను నారికేళఫలపాకసమ్మితముగా భయపెట్టినను, నర్థగౌరవమున నిది భారవిభంగి గురువు ఆంధ్రభోజుడు- శ్రీకృష్ణదేవరాయని 'సరస్వతీ కంఠాభరణ' మీ ప్రబంధము ఆలోచనాదమృతముగా ప్రాచీనులు గౌరవించిన సాహిత్యమును సంగీతమువలె నా పాతమధురముగా నాస్వాదింప సాహసించు నేటి సుకుమార పఠితల పాలిటికి పెనుభూతమైన విష్ణుచిత్తీయము, రాయలవారి సాహిత్యసౌహిత్య సర్వస్వము ఆముక్తము కావ్యముకాదు ఆముక్తమనగా రాయలే విష్ణుచిత్తీయ కవితావాణి నందుకొనుటకు కొన్ని జన్మముల సంస్కారము వలయును.

ఆముక్త మన్నంతనే నేడు చదువరుల మనస్సులను కలవర పెట్టునది కవయిత్ర నిర్ణయవిషయము శూద్రుడు కవిత్వము చెప్పరాదనుకొన్న యప్పకవ్యాదులు పెద్దనగారికి కావ్యకర్తృత్వము నంటగట్టగా, పెద్దఱికము పెంచుకొన్న నేటి కవులుగాని యప్పకవులు తాళము తాటించిరి తన 'మారీచ్ పరిణయ కావ్యము'లో రాయలకూతురు నాతండ్రి విష్ణుచిత్త కథ రచించినాడని వచించినది ఇది నా కృతియని చెప్పికొన్న తండ్రికి దిక్కులేదు మఱి అబలమాట బలమైన సాక్ష్యమా! దుష్టవాదములచేత సత్యమును కనుగొనలేము అష్టదిగ్గజముల నాకర్షించిన భువనైక రసికుడు సర్వజ్ఞుడు కాదనగలమా? "సతాంహి సందేహపదేషు వస్తుషు, ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః"॥ అన్న వాక్యమే సహృదయుల కిట్టిచోట్ల శరణ్యము కావ్యముతో గాక కవితో చేతులు కలుపుచున్న నేటి నాగరకతాముద్ర మాత్ర మతిపందనీయము

ఏవం విధవిష్ణుచిత్తీయ కావ్యము నధికరించి, సాహిత్యసాగర సాంయాత్రికులైన శ్రీ వెల్దండ ప్రభాకరామాత్యులవారు, 'పర్యాలోకనము'ను పేర విమర్శాగ్రంథమును గ్రంథించినారు శ్రీ ప్రభాకరు లాంధ్రాంగ్లగీర్వాణభాషావేత్తలు. స్నేహపాత్రులు వినయసుభగులు. వీరి విమర్శ నిష్పాక్షికముగా, కూలంకషముగా నడచినది విమర్శకునకుమాత్రమే కీర్తిహేతుసాధనములుగా కువిమర్శలు తలసూపు వర్తమానకాలమున, మూలభావదీపికలుగా నిట్టి యుత్తమవిమర్శ వెలువడుట ముదావహము మూలస్రష్టకంటె నధికుడుగా భాసింపనెంచు పేరాసతోడి యధివిమర్శకుడు కాదీయన ఆముక్తము విశిష్టాద్వైత మతైక ప్రతిపాదకకావ్యము దానిమీద పర్యాలోకనము వీరి లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణత్వమునకు కతపత్రము తర్కశక్తిచేత సత్యమును తలక్రిందుచేయని వీరి ఋజుభావము గమనార్హము కావ్యకర్తృత్వ విషయనిర్ణయములో రాజకవి దెస వీరి మొగ్గుదల, గాఢసంస్కారమునకు మంచి సాకిరి

పూర్వకవులవలె బహుముఖముగా నూహించు మేధాసంపత్తిగాని, చూచినది సుందరముగా పరిచయించు మనోబలముగాని చాలనివారికి, మనుచరిత్ర మూహాకావ్యము విష్ణుచిత్తీయ ముత్ప్రేక్షాకావ్యము నగుటలో వింతలేదు పెనుగొండలో నేటికి గాలికి నోరూరించు ద్రాక్షాగుళుచ్ఛములు,కాలతురుష్కముష్కరుని కఱకుకోరల కెరయయిన హంపీమధుర సౌధనిర్మాణములు మనసునకు రానివారికి, ప్రబంధముల లోని వర్ణనము లతిశయోక్తి భుక్తములుగాక స్వభావోక్తి చారువులగునా? ఈ రహస్యమును కనిపెట్టియే ప్రభాకరామాత్యులు నేటికి పాటవము చెదరని హంపీ పెనుగొండల శిథిల విశేషములు దిక్ప్రదర్శించి, పర్యాలోకనము ప్రారంభించినారు ఏ తాదృగ్వాతావరణ నైపథ్యమున కింథులయిన పఠితలకు పూర్వప్రబంధము లేమాత్ర మర్థమైనట్లో! కావుననే ప్రబంధము లందును, ముఖ్యముగా నాముక్తము సమకాలిక సాం

షిక జీవనమునకు సర్వతోముఖ దర్పణమని ప్రభాకరుల ప్రవచనము

ప్రభాకరులవలె పరకోటి ముట్టిన గురుభక్తిచేత, వన్నెగాంచిన వారధునాతన కవిలోకమున అరుదు. వీరికి గల నిర్మల గురుభక్తియే వీరి నింతవారిగా నాశీర్వదించినది వీరివంటి సహృదయులు వేయి కొొకరైన నున్నచో మన సాహిత్యము నిత్యకళ్యాణము పచ్చతోరణముగా వర్ధిల్లుట నిశ్చితము ఆముక్తమాల్యదా బహువారపఠన పరమఫలమైన 'పర్యాలోకనము' పర్యాలోకించు శ్రద్ధాళువులకే సత్యము పదపదమున ప్రతిధ్వనించును శ్రీమాన్ ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులవారు సంతరించిన బృహద్వ్యాఖ్యానిక యేతద్విమర్శాగ్రంథ పారిజాతకుసుమ సౌరభోద్గారిగా నున్నది "నిధే స్పంజాయతే ధత్నం నికషాల్లభతే రుచిమ్। కవే స్పంజాయతే కావ్యం విమర్శా దభ్నుతే యశమ్॥ అను సమరసూక్తికి సర్వధా లక్ష్యముగా నున్న శ్రీ వెల్లండ ప్రభాకరామాత్యులవారి "యాముక్తమాల్యదా పర్యాలోకనము" రసికపరితలచేత బహుధా బహుమానింపబడునని నా దృఢ విశ్వాసము.

—శనగన. నరసింహస్వామి.